

వైసీపీ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం అలవాటు చేసుకుంది. గత ప్రభుత్వంలో డీఎస్సీ పేరుతో దగా జరిగితే, కూటమి ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించిన ఘనత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కు దక్కింది. ప్రతి ఏడాది డీఎస్సీతో యువత ఆశలు వెలుగునిస్తుంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



గురువారం 18.09.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 153 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# ఆరోగ్యాంధ్ర...!

## 'హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్' ఇదే మా లక్ష్యం



**మహిళా ఆరోగ్యమే కుటుంబానికి బలమైన పునాది**

**రాష్ట్రంలోని ప్రతీ కుటుంబానికీ రూ.2.5 లక్షల ఆరోగ్య భీమా**

**ప్రజారోగ్యంపై రాష్ట్రం చేస్తున్న వ్యయం రూ.20 వేల కోట్లు**

**విశాఖలో స్వస్త్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో**

**సీఎం చంద్రబాబు**

**విశాఖ, (జర్నలిస్ట్ ఫైల్) :** ఆరోగ్యం విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించాలని, ప్రజారోగ్యానికి ఎన్డీఏ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. విశాఖలో ఏర్పాటు చేసిన స్వస్త్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ప్రధాని మోదీ ప్రసంగాన్ని లైవ్‌లో వీక్షించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "పేదల అభ్యున్నతి, మహిళల ఆరోగ్యం పై ప్రధాని మోదీ ప్రత్యేక దృష్టి పెట్టారు. మోదీ పుట్టినరోజు సందర్భంగా ఆయన సుదీర్ఘకాలం ప్రధానిగా ఉండి మంచి పాలన అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. నరేంద్ర మోదీ నాయకత్వంలో 11 ఏళ్లలో మనదేశం 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తయారైంది. 2038 నాటికి ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి నెంబర్ వన్‌గా తయారవుతుంది. వికసిత్ భారత్ కల సాకారంతో పేదరిక నిర్మూలన మనం చూడబోతున్నాం. జీఎస్టీ సంస్కరణలతో ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. అలాగే దేశానికి సమర్ధవంతమైన ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ పనిచేస్తున్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం అంతా ఆరోగ్యంగా ఉంటుంది. తద్వారా రాష్ట్రం బాగుంటుంది. మంచి ఆరోగ్యం కోసం చక్కెర, ఉప్పు, నూనె వాడకాలను తగ్గించాలని కోరుతున్నాను. కేంద్ర ప్రభుత్వం స్వస్త్ నారీ – సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతి మహిళ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఇవాల్టి నుంచి అక్టోబర్ 2 తేదీ వరకూ 15 రోజుల పాటు వైద్య పరీక్షలు నిర్వహిస్తాం. రాష్ట్రమంతటా 13,944 హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నాం. తల్లిబిడ్డా ఆరోగ్య రక్షణ కోసం కార్డులు జారీ, గర్భిణీ స్త్రీల సంరక్షణతో పాటు పిల్లలకు టీకాలు వేయడంపై దృష్టి పెట్టాం. రక్తహీనత, పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తాం. హైబీపీ, షుగర్, ఓరల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్, టీబీ తదితర అన్నిరకాల వైద్య పరీక్షలు ఈ కార్యక్రమంలో ఉచితంగా చేస్తాం. గైనకాలజీ, ఈఎన్‌టీ, నేత్ర, డెర్మటాలజీ, సైకియాట్రీ, డెంటల్ సర్జన్, పీడియాట్రిషన్ డాక్టర్లు ఈ శిబిరాల్లో వైద్య సేవలు అందిస్తారు" అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**ప్రజారోగ్యానికి ప్రాధాన్యత :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ ఏడాది ఆరోగ్యరంగానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 19,264 కోట్ల వ్యయం చేస్తోందని తెలిపారు. దీనిపై మాట్లాడుతూ.. "ఇంట్లో ఎవరికి ఆరోగ్యం బాగో లేకపోయినా ఆ కుటుంబమంతా ఇబ్బంది పడుతుంది. నేటి కాలంలో వైద్య ఖర్చుల కంటే ఆస్పత్రి ఖర్చులే ఎక్కువయ్యాయి. అందుకే ప్రతి కుటుంబానికి యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్ తీసుకువచ్చాం. రాష్ట్రంలో అందరికీ రూ. 2.5 లక్షల వరకూ ఉచితంగా ఆరోగ్య భీమా కల్పిస్తున్నాం. పేదలకు రూ. 25 లక్షల వరకూ వైద్య చికిత్సలకు మిగతా 2లో...

## చేతల్లో స్పీడ్ ఆఫ్ డూయింగ్




**చంద్రబాబు వల్లే 15నెలల్లో 10లక్షల కోట్ల పెట్టుబడులు**

**క్వాంటమ్ వ్యాలీ, డాటా సిటీలతో ఎపి రూపురేఖలు మారిపోతాయి**

**ఎఐ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ప్రత్యేక పాఠ్యాంశాలు**

**పరిశ్రమల స్థాపనకు ప్రతిబంధకంగా ఉన్న నిబంధనలు సవరిస్తున్నాం**

**ఆంధ్రప్రదేశ్ - యుకె బిజినెస్ ఫోరం రోడ్ షోలో మంత్రి లోకేష్**

**లండన్:** స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను మాటల్లో కాకుండా చేతల్లో చూపుతున్నాం, గత 15నెలల్లో రాష్ట్రానికి 10లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించగలిగాం, విజనరీ లీడర్ చంద్రబాబు సమర్థ నాయకత్వం వల్లే ఇది సాధ్యమైందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. నవంబర్ 14, 15తేదీల్లో విశాఖపట్నంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న పార్టనర్ షిప్ సమ్మిట్ –2025కు మిగతా 2లో...

## మాది బాధ్యతాయుత ప్రభుత్వం

- పారిశ్రామికవేత్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం
- వచ్చే నెలలోనే విశాఖకు గూగుల్ డేటా సెంటర్
- 2026 ఆగస్టు నాటికి భోగాపురం ఎయిర్ పోర్టు సిద్ధం
- సీఐఐ- గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ బిజినెస్ సమ్మిట్ సమావేశానికి హాజరైన సీఎం చంద్రబాబు
- సీఐఐ నివేదికను విడుదల చేసిన సీఎం, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతా రామన్



**విశాఖ, (జర్నలిస్ట్ ఫైల్) : :** పారిశ్రామిక వేత్తలకు రాష్ట్రప్రభుత్వం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తో ఎవరూ పోటీ పడలేరని సీఎం అన్నారు. విశాఖలో సీఐఐ- గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ బిజినెస్ సమ్మిట్ కు కేంద్ర మంత్రి నిర్మలా సీతా రామన్ తో కలిసి ముఖ్యమంత్రి హాజరయ్యారు. రాష్ట్రంలో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం ఉన్న మానవ వనరులు అందుబాటులో ఉన్నాయని సీఎం అన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న డబుల్ ఇంజన్ సర్కార్ డబుల్ డిజిట్ గ్రోత్ సాధిస్తుందని అన్నారు. సరైన సమయంలో సరైన చోట సరైన నేతగా ప్రధాని మోదీ ఉన్నారని .. దేశానికి ఆయన పెద్ద ఆస్తి అని సీఎం వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ నేతృత్వంలో భారత్ బలమైన ఆర్థిక వ్యవస్థగా ఉందని అన్నారు. 2028 నాటికే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని స్పష్టం చేశారు. ఏపీ కూడా 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా విజన్ రూపొందించామని సీఎం స్పష్టం చేశారు. వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్ నినాదంతో కుటుంబంలో ఒకరిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దటంతో పాటు ..రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను, ఆలోచనలను ప్రోత్సహిస్తామని అన్నారు. విభజన తర్వాత వారసత్వంగా వచ్చిన ఇబ్బందులను అధిగమించామని అన్నారు. 2019-24 మధ్య రాజకీయ పరిస్థితులు, పాలనా కారణాల వల్ల ఏపీ చాలా అవకాశాలను కోల్పోయిందని సీఎం వ్యాఖ్యానించారు. మిగతా 2లో...

## 26 నుంచి బీచ్‌ఫెస్ట్




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** బాపట్ల జిల్లాలోని ఆహ్లాదకరమైన సూర్యలంక బీచ్‌లో ఈ నెల 26 నుంచి 28 వరకు మూడు రోజులపాటు బీచ్ ఫెస్టివల్ ను అద్భుతంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని మంత్రుల బృంధం అధికారులను ఆదేశించింది. బుధవారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర, అనగాని సత్యం ప్రసాద్ మరియు గొట్టిపాటి రవికుమార్ తో కూడిన మంత్రుల బృందం సూర్యలంక బీచ్ ఫెస్టివల్ నిర్వహణ ఏర్పాట్లపై సంబందిత శాఖల అధికారులతో సమావేశమై సమంగ్రంగా చర్చించి పలు ఆదేశాలను జారీచేశారు. ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల అనుసంధానంగా నిర్వహించబడుతున్న నేపద్యంలో ఈ వేడుకలను ఎంతో విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ ఫెస్టివల్ నిర్వహణ ద్వారా సూర్యలంక బీచ్‌ను ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా మంచి గుర్తింపు వచ్చేలా పటిష్టమైన ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు. పర్యాటకులు మరియు సందర్శకులకు ఆహ్లాదం కలిగించే విధంగా క్రీడలు, క్రీడా సదుపాయాలు మరియు మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. మిగతా 2లో...

**బీసీ రక్షణ చట్టానికి త్వరలో..**

## తుది రూపం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** వెనుకబడిన తరగతుల ఆత్మాభిమానం నిలిపేవిధంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు త్వరలో బీసీ రక్షణకు తుది రూపం తీసుకు రానున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత నేతృత్వంలో బీసీ మంత్రులు, హోం మంత్రి అనిత, రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి ఎన్.ఎం.డి.ఫరూక్ బుధవారం కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి మంత్రి సవిత విలేకరులతో మాట్లాడారు. టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీల అభ్యున్నతికి పాటు పడుతోందన్నారు. అన్న ఎన్టీఆర్ స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబు బీసీలను అన్ని రంగాల్లో ముందంజలో నిలపడానికి రేయింబవళ్లు కృషి చేస్తున్నారన్నారు. చరిత్రలో ఎన్నడూ లేనంతగా 2025-26 బడ్జెట్ లో రూ.47 వేల కోట్లకుపైగా కేటాయించారన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు బీసీ రక్షణ చట్టం రూప కల్పనకు నిర్ణయించామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం మేర బీసీ రిజర్వేషన్ల అమలుకు చర్యలు తీసుకుంటున్నారు. బీసీలు ఆత్మగౌరవంతో జీవనం సాగించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రస్తుతం బీసీ మంత్రులు రెండు పర్యాయాలు సమావేశమయ్యామని, త్వరలో మరో సమావేశం నిర్వహించనున్నామని తెలిపారు. మిగతా 2లో...

## మెడికల్ కాలేజీల ప్రైవేటుపరం.. అబద్ధం




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** హెల్త్, వెల్త్, హ్యాపీ అనే నినాదంతో సీఎం చంద్రబాబు ముందుకు వెళుతున్నారని మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, వాసంశెట్టి సుభాష్ లు అన్నారు. ఏపీ సచివాలంలోని పబ్లిసిటీ సెల్ లో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ ఎంపవర్ మెంట్ మరియు రిలేషన్స్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 11 మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తున్నారని మాజీ ముఖ్యమంత్రి జగన్ అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పీపీపీ మోడల్ లో కాలేజీలను అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేక దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గత పాలకుల హాయాంలో మెడికల్ కాలేజీల నిర్మాణానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని, కేవలం కేంద్రం కేటాయించిన నిధులనే వినియోగించారన్నారు. 5 కాలేజీలకు కేవలం గోడలు, స్లాబులు, రంగులు వేసి మెడికల్ కాలేజీ కట్టామని చెప్పుకుంటున్నారని, మిగతా 2లో...

## మహిళలకు ఉచిత వైద్యసేవలు

**విశాఖ, (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల ద్వారా మహిళలకు ఉచితంగా 8 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. "స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్" కార్యక్రమాన్ని మధ్యప్రదేశ్ లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బుధవారం ప్రారంభించారు. దీనికి అనుగుణంగా విశాఖపట్నం ఆర్ కే బీచ్ లోని ఎయు కన్వెన్షన్ సెంటర్ లోరాష్ట్రంలో వైద్య శిబిరాల ప్రారంభ కార్యక్రమం జరిగింది. వచ్చే నెల 2వ తేదీ వరకు జరిగే వైద్య శిబిరాలను రాష్ట్ర చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ. విశ్వకర్మ జయంతి, ప్రధాన మంత్రి జన్మదినోత్సవం ఒకేరోజురావడం అరుదైన పరిణామన్నారు.



**8,181 స్పెషలిస్టు వైద్యులు ద్వారా పరీక్షలు :** రాష్ట్ర వ్యాప్తంగా 15,672 వైద్య శిబిరాలను ఉప ఆరోగ్య కేంద్రాలు మొదలుకొని బోధనాసుపాత్రుల్లో కూడా ఏర్పాటు చేశామని మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. మిగతా 2లో...

## ఫ్రీబస్సు.. సక్సెస్

**రాష్ట్రంలో మహిళలకు ఆసరా కల్పిస్తున్న ఉచిత బస్సు**

**30 రోజుల్లో 73 శాతానికి పెరిగిన ఆక్యుపెన్సీ**

**రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 3.17 కోట్ల మంది మహిళలు ప్రయాణం**

**తొలి నెలలో రూ.120 కోట్ల రాయితీ**

**వినియోగించుకున్న మహిళలు**

**చిరు మహిళా వ్యాపారులకు ఆర్థిక వెసులుబాటు**

**విద్యార్థినులు హ్యాపీ** మిగతా 2లో...

## నేపాల్ టు... ఏపీ

## సురక్షితంగా తరలింపు !



**మంత్రి నారా లోకేష్ కృషి**

**రాష్ట్రానికి చేరుకున్న నేపాల్ లో చిక్కుకున్న తెలుగు యాత్రికులు**

**చివరి తెలుగువ్యక్తిని రక్షించే వరకు కంట్రోల్ రూమ్ కొనసాగుతుందని హామీ**

**361 మంది ఏపీ వాసులను రక్షించి రాష్ట్రానికి చేర్చిన మంత్రి లోకేష్**

**నేడు హైదరాబాద్ చేరుకోనున్న మానససరోవర్ లో చిక్కుకుపోయిన చివరి 86 మంది సభ్యుల బృందం**

**మంత్రి లోకేష్ చొరవతో ఇప్పటికే రాష్ట్రానికి సురక్షితంగా చేరుకున్న 275 మంది తెలుగువారు**

మిగతా 3లో...

# చేతల్లో స్పీడ్ ఆఫ్ డూయింగ్

(మొదటి పేజీ తరువాయి)

గ్లోబల్ పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం పలికేందుకు లండన్ లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరక్టర్స్, పాల్ మాల్ కన్వెన్షన్ వేదికగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం – యుకె బిజినెస్ ఫోరం నిర్వహించిన రోడ్ షోలో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి టెక్ మహీంద్ర యూరప్ బిజినెస్ హెడ్ హర్షుల్ అస్నానీ సంధానకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ వేగంగా అభివృద్ధి సాధించడానికి మూడు ప్రధాన కారణాలు ఉన్నాయి. అందులో మొదటిది లీడర్ షిప్ ట్రాక్ రికార్డ్. మాకు సుస్థిరమైన నాయకత్వం ఉంది. మా ముఖ్యమంత్రి చంద్రబాబు గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరమే లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ను ఆయన అద్భుతంగా అభివృద్ధి చేశారు. ఇప్పుడు కొత్త రాష్ట్రాన్ని కూడా అదేవిధంగా అభివృద్ధి చేస్తున్నారు.

2వది స్పీడ్ ఆఫ్ డూయింగ్ కు మేం ప్రాధాన్యత నిస్తున్నాం. ప్రాజెక్టు ఆరునెలలు ఆలస్యమైతే మొత్తం బిజినెస్ ప్లాన్ దెబ్బతింటుంది. భారతదేశంలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ను ఆర్సెలర్ మిట్టల్ సంస్థ ఆంధ్రప్రదేశ్ లో ఏర్పాటుచేయబోతోంది. గత ఏడాది జూన్ లో వారితో చర్చలు జరిపినపుడు, వారు మూడు ప్రత్యేక అభ్యర్థనలు చేయగా, కేవలం 12గంటల్లోనే పరిష్కరించాం. నవంబర్ లో ఆర్సెలర్ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభం కాబోతున్నాయి. దేశంలో అతిపెద్ద డాటా సెంటర్ త్వరలో విశాఖపట్నానికి రాబోతోంది. టిసిఎస్ వంటి ప్రతిష్టాత్మక




సంస్థలను రాష్ట్రానికి రప్పించేందుకే మేం ఎకరా 99 పైసలకే భూములు ఇచ్చాం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను మాటల్లో కాకుండా చేతల్లో చూపిస్తున్నాం. 3వది మావద్ద ఉత్సాహవంతంగా పనిచేసే కొత్తతరం యువనాయకత్వం ఉంది. మొత్తం శాసనసభలో 50శాతం తొలిసారి గెలిచినవారు. మంత్రివర్గంలోని 25మందిలో 17మంది కొత్తవారే. వారందరికీ స్టార్టప్ మైండ్ సెట్ ఉంది. ఆంధ్రప్రదేశ్ ఒక స్టార్టప్ స్టేట్. మేమంతా రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయలన్న తపన, పట్టుదలతో పనిచేస్తున్నాం. విజనరీ లీడర్ చంద్రబాబు గారి నాయకత్వాన గత 15నెలల్లో రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించగలిగాం. ఎంఓయులతో సరిపెట్టకుండా ప్రాజెక్టులను గ్రౌండింగ్ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. రాబోయే అయిదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నది మా లక్ష్యం. ఇటువంటి సాహసోపేతమైన హామీని దేశంలో మేం మాత్రమే ఇచ్చాం. రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులను తెచ్చి, యువతకు **ఉద్యోగాలు కల్పించడమే మా ప్రధాన ధ్యేయం.**

దక్షిణ ఆసియాలో తొలి 158 బిట్ క్వాంటమ్ కంప్యూటర్ జనవరిలో అమరావతికి రాబోతోంది. ప్రధాని మోడీ క్వాంటమ్ మిషన్ ను ముందుండి నడిపించేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. దీనిద్వారా అమరావతిలో అద్భుతమైన ఎకో సిస్టమ్ ఏర్పాటు కాబోతోంది. విశాఖలో డాటా సిటీ నిర్మాణం వల్ల అక్కడ కేబుల్స్ ల్యాండ్ అవుతాయి. ముంబాయి కన్నా రెట్టింపు సామర్థ్యంతో 1.5 గిగావాట్ల డేటా సెంటర్స్ విశాఖకు రాబోతున్నాయి. రాబోయే మూడేళ్లలో అవి పూర్తవుతాయి. ఇది ఆరంభం మాత్రమే. ఇంకా ఎన్నో ప్రతిష్టాత్మక సంస్థలతో చర్చలు జరుపుతున్నాం. క్వాంటమ్ వ్యాలీ, డాటా సిటీలతో ఎపి దేశంలోనే ప్రత్యేక స్థానాన్ని సాధించబోతోంది. క్వాంటమ్ వ్యాలీ, డాటా సిటీలతో ఆంధ్రప్రదేశ్ రూపురేఖలు మారబోతున్నాయి. ఐటి విప్లవం వల్ల భారతదేశం లబ్ధి పొందింది. ఇప్పుడు ఎఐ సాంకేతికత శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఎఐ ద్వారా వచ్చే అవకాశాలను అందిపుచ్చుకునేందుకు మేం స్కిల్ అప్ గ్రేడేషన్ కు ప్రాధాన్యత నిస్తున్నాం. కళాశాలలు, యూనివర్సిటీల్లో ఎఐ పాఠ్యాంశాలను ప్రవేశపెడుతున్నాం. రాబోయే రోజుల్లో ఎఐ గేమ్ చేంజర్ కాబోతోంది. వివిధ పరిశ్రమలకు అవసరమైన వర్క్ ఫోర్స్ ను సిద్ధం చేసేందుకు రాష్ట్రప్రభుత్వం తరపున స్కిల్ ఇంటర్వెన్షన్ ను అమలు చేస్తున్నాం. యువతలో నైపుణ్యాలను పెంపొందించి, ఉద్యోగావకాశాలు కల్పించేందుకు అక్టోబర్ లో నైపుణ్యం పోర్టల్ ను ప్రారంభించబోతున్నాం.

విజన్ – 2047 లక్ష్యంలో ప్రధానమైన $ 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీకి చేరుకోవడానికి ప్రతిఏటా సగటున 15శాతం వృద్ధి రేటు సాధించాల్సి ఉంది. ఇందుకు అనుగుణంగా మేం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం. ఆంధ్రప్రదేశ్ లో 5వేల ఎకరాల్లో మేం స్పేస్ సిటీని నిర్మించబోతున్నాం. భారత్ లో స్పేస్ ఎక్స్ కు సమానమైన స్కైరూట్ అనే సంస్థకు 300 ఎకరాలు కేటాయించాం. భూమి ధరకు సంబంధించి ఆ సంస్థ విజ్ఞాపనను పరిశీలించి, కేబినెట్ లో చర్చించి కేవలం వారంరోజుల్లో ఆ సంస్థకు భూకేటాయింపులు పూర్తిచేశాం. యుఎస్ అదనపు సుంకాల నేపథ్యంలో సవాళ్లను అవకాశాలుగా మలుచుకుని ముందుకు సాగుతాం. యుకె, రష్యా, యూరప్ లలో కొత్త మార్కెట్లను వెదుక్కుంటాం. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే పెట్టుబడిదారులకు సహకరించేందుకు మేం వందరోజుల ప్రణాళికను అమలు చేస్తున్నాం. అయిదుగురు ప్రఖ్యాత పారిశ్రామికవేత్తలతో సలహామండలిని ఏర్పాటుచేశాం. పరిశ్రమలస్థాపనలో ప్రతిబంధకంగా ఉన్న కొన్ని నిబంధనలను సవరిస్తున్నాం. ఎపిలో కార్మిక సంస్కరణలు, ల్యాండ్ కన్వర్షన్, నాలా టాక్స్ వంటివి సవరించాలని కేంద్రమంత్రి అశ్వనీ వైష్టవ్ సూచించగా, కేవలం 45రోజుల్లో ఆ సవరణలు పూర్తిచేశామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. ఈ రోడ్ షోలో యుకె డిప్యూటీ హై కమిషనర్ సుజిత్ ఘోష్, టెక్ మహీంద్రా యూరప్ విభాగం ప్రెసిడెంట్ హర్షుల్ అస్నానీ, ఐసిఐసిఐ బ్యాంకు యుకె విభాగం సిఇఓ రాఘవ్ సింఘాల్, ఎపిఐఐసి వైస్ చైర్మన్ %డ% ఎండి అభిషిక్త్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ ఫండ్, మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీలు, సర్వీస్ ప్రొవైడర్ కంపెనీలకు చెందిన 150మంది సిఇఓలు, సీనియర్ ఎగ్జిక్యూటివ్ లు పాల్గొన్నారు.

# ఆరోగ్యాంధ్ర..!

(మొదటి పేజీ తరువాయి)

అయ్యే ఖర్చును ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్టు భరిస్తుంది. ఈ రోజు నుంచి వచ్చే నెల 16వరకు 8వ రాష్ట్రీయ పోషణ మాసంగా పాటిస్తున్నాం. ప్రత్యేక థీమ్‌తో ఆరోగ్య పద్ధతులను పాటించేలా చూస్తున్నాం. రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరి ఆరోగ్య రికార్డులను డిజిటల్‌గా రూపొందించేందుకు టాటా, గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి ప్రాజెక్ట్ సంజీవని చేపట్టాం. విశాఖలోని మెడ్ టెక్ జోన్ ద్వారా వైద్య పరికరాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఇవి ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి అవుతున్నాయి". అని సీఎం అన్నారు.

**మహిళాభ్యున్నతికి కట్టుబడి ఉన్నాం :** మహిళలకు ఓ వైపు సంక్షేమం అందిస్తూనే మరోవైపు వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామని ముఖ్యమంత్రి తెలిపారు. ఇంట్లో ఎందరు పిల్లుంటే వారందరికీ తల్లికి వందనం ఇచ్చాం. దీపం పథకం కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నాం. స్త్రీ శక్తి కింద మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించాం. డ్వాక్రా, మెప్మా సంఘాలతో మహిళల ఆర్థిక స్థితిగతులు మార్చాం. డ్వాక్రా మహిళల పొదుపు రూ. 20 వేల కోట్ల పైనే ఉంది. డ్వాక్రా రుణాలు కట్టని వారు 2 పర్సంట్ మాత్రమే ఉన్నారంటే వారి ఆర్థిక క్రమశిక్షణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. లక్షమంది మహిళలను లక్షాధికారులను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. మొదటిసారిగా ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో హక్కు ఇవ్వగా...ప్రధాని మోదీ మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. విశాఖ వాసులది మంచి మనసు. హుద్ హుద్ విపత్తు సమయంలో వారు చూపిన చొరవ, సేవను నేను మర్చిపోలేను. విశాఖ బెస్ట్ సిటీ అని నేను ఎక్కడికి వెళ్లినా చెబుతాను. దేశంలోనే మహిళలకు సురక్షిత ప్రాంతం విశాఖ. విశాఖకు త్వరలో గూగుల్ వస్తోంది. భవిష్యత్ లో దేశంలోనే గొప్ప నగరంగా విశాఖ తయారుచేస్తామని సీఎం చంద్రబాబు అన్నారు.

# మాది బాధ్యతాయుత ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం ఏపీలో ఒక రెస్పాన్సిబుల్ ప్రభుత్వం అధికారంలో ఉందని ముఖ్యమంత్రి అన్నారు.

**వచ్చే ఆగస్టుకు భోగాపురం ఎయిర్ పోర్టు సిద్ధం :** ఏపీలో ఉన్న సుదీర్ఘ తీరప్రాంతంతో పాటు పోర్టు ఆధారిత పరిశ్రమల ద్వారా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తామని ముఖ్యమంత్రి పారిశ్రామిక వేత్తలను ఉద్దేశించి అన్నారు. దీని కోసం ఏపీలో లాజిస్టిక్స్ రంగంపై దృష్టి పెట్టామని పోర్టులు, ఎయిర్ పోర్టులు, రహదారులు, రైల్వేలను సమన్వయం చేస్తూ రవాణా వ్యయాన్ని తగ్గిస్తామని వెల్లడించారు. ఈ ప్రాజెక్టులను పీపీపీ విధానంలో అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. వచ్చే ఏడాది ఆగస్టు నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తుందని తెలిపిన సీఎం.. విశాఖ, విజయవాడ, తిరుపతి, రాజమండ్రి, కడపతో పాటు ఓర్వకల్లు, పుట్టపర్తి లాంటి చోట్ల విమానాశ్రయాలు రాష్ట్రాన్ని ఇతర ప్రాంతాలతో అనుసంధానిస్తున్నాయని స్పష్టం చేశారు. త్వరలో అమరావతిలోనూ అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయం నిర్మించాలని నిర్ణయించినట్టు తెలిపారు. హైదరాబాద్–అమరావతి–చెన్నైలను అనుసంధానిస్తూ బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కూడా వస్తుందన్నారు. అమరావతి నగరాన్ని గ్రీన్ ఫీల్డ్ నగరంగా నిర్మిస్తున్నామని.. విజయవాడ–గుంటూరులను అనుసంధానిస్తున్నట్టు తెలిపారు. వచ్చే నెలలో విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు అవుతుందని అన్నారు. టెక్నాలజీ పరంగా దేశంలోనే తొలి క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సంజీవని ప్రాజెక్టు ద్వారా బిల్ గేట్స్ ఫౌండేషన్ తో కలిసి డిజిటల్ హెల్త్ రికార్డులను తయారు చేస్తున్నట్టు వివరించారు. అలాగే డేటా లేక్ ద్వారా ప్రభుత్వ శాఖల సమాచారాన్ని అనుసంధానం చేస్తున్నామని స్పష్టం చేశారు. వాట్సప్ గవర్నెన్సు ద్వారా పౌర సేవలను అందిస్తున్నామని వివరించారు. సేవల నాణ్యత కోసం ప్రైవేటు కంపెనీల తరహాలోనే ఈ సేవలకు రేటింగ్ కూడా కోరుతున్నామని అన్నారు. అలాగే జీఎస్టీ స్లాబ్ లను తగ్గిస్తూ కేంద్రం తీసుకువచ్చిన సంస్కరణలు ఓ గేమ్ చేంజర్ గా మారనున్నాయని వివరించారు.

# 26 నుంచి బీచ్‌ఫెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

సాహస క్రీడలు, ఎగ్జిబిషన్, లేజర్ షో మరియు సాంస్కృతిక కార్యకలాపాలు నిర్వహణకు తగు ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సాంప్రదాయ మరియు ఆధునిక సాంస్కృతిక కార్యక్రమాలు, బీచ్ క్రీడలు, సంగీతం, నృత్య ప్రదర్శనలు, స్థానిక వంటకాలతో ప్రత్యేక ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించడం జరుగుతుందని, అందుకు తగ్గట్టుగా పటిష్టంగా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో సందర్శకులు ఈ బీచ్ ఫెస్టివల్ కు హాజరయ్యే అవకాశం ఉన్నందున శాంతి భద్రతల విషయం పై ప్రత్యేక శ్రద్ధచూపాల్సి ఉందన్నారు.

ఈ నెల 27న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూర్యలంక బీచ్‌ను సందర్శించనున్నారని, ఈ సందర్భంగా రూ.97 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారని, అందుకు తగ్గట్టుగా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రుల బృందం ఆదేశించింది. రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు మరియు గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ ఈ బీచ్ ఫెస్టివల్ కు విస్తృత ప్రచారన్న కల్పించే విధంగా బాపట్ల జిల్లా కేంద్రంతో పాటు హైదరాబాదులో కూడా అవుడోర్ పబ్లిసిటీకై విస్తృత ఏర్పాట్లు చేయాలని, సోషల్ మీడియా ను కూడా విస్తృతంగా వినియోగించుకోవాలని ఆదేశించారు. బాపట్ల జిల్లా కలెక్టర్ డా.వి. వినోద్ కుమార్ మూడు రోజుల ఈ బీచ్ ఫెస్టివల్ కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా మంత్రుల బృందానికి వివరించారు. అన్ని వయస్సుల వారికి అనుకూలంగా వినోదం, సాంస్కృతిక సంపదను అందించేలా ఈ ఉత్సవం రూపకల్పన చేసినట్టు చెప్పారు. ఫెస్టివల్ జరిగే ప్రాంతాలను, రహదారులను, వేదికలను సుందరంగా తీర్చిదిద్దే విధంగా తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అభివృద్ధి పనులతో పాటు అన్ని ఏర్పాట్లు పూర్తయిన తర్వాత సూర్యలంక జాతీయ, అంతర్జాతీయ పర్యాటక పటంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదిస్తుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. పర్యాటక, సాంస్కృతిక శాఖలతో పాటు సంబందిత అన్ని శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# బీసీ రక్షణ చట్టానికి త్వరలో.. తుది రూపం

(మొదటి పేజీ తరువాయి)

మరో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో బీసీలు తీవ్ర ఇబ్బందులు పాలయ్యారన్నారు. తప్పుడు కేసులు పెట్టి టీడీపీలోని బీసీ నాయకులను అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టారన్నారు. బీసీలకు గౌరవ ప్రదమైన జీవనం సాగించడమే లక్ష్యంగా బీసీ రక్షణ చట్టం తీసుకొస్తున్నామన్నారు.

అంతకుముందు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో చేపట్టిన బీసీ మంత్రుల సమావేశం సుదీర్ఘంగా సాగింది. గత ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు బీసీ రక్షణ చట్టం రూపకల్పన, స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పనపై సమావేశంలో చర్చించారు. చట్టపరంగా, న్యాయపరంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా బీసీ రక్షణ చట్టం రూపకల్పన చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో బీసీ మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, కొండపల్లి శ్రీనివాస్, వాసంశెట్టి సుభాష్ సహా హోం మంత్రి అనిత, న్యాయ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, బీసీ సంక్షేమ శాఖాధికారులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీల ప్రైవేటుపరం.. అబద్ధం

(మొదటి పేజీ తరువాయి)

ఇందుకు కేవలం కేంద్ర నిధులు రూ. 600కోట్లు మాత్రమే ఖర్చుచేశారని వివరించారు. ఆయా కాలేజీల్లో రాష్ట్ర వాటాగా మౌలిక సదుపాయాలు, పరికరాల కొనుగోలుకు ఇంకా రూ. 1900కోట్లు అవసరమని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రతి మెడికల్ కాలేజీలో మౌలిక సదుపాయాలు కల్పించనుందని వివరించారు. అయితే ఆ భారం సామాన్యుడిపై పడకుండా ఉండేందుకు పీపీపీ మోడల్ లో ముందుకు వెళుతున్నామన్నారు. పీపీపీ మోడల్ తో మెడికల్ కాలేజీలు నిర్మించినా ఫీజులు మాత్రం గతంలో వలే ఉంటాయని తెలిపారు.

ప్రతి జిల్లాలో ఒక మెడికల్ కాలేజీ ఉండాలనేది సీఎం చంద్రబాబు ఆశయమని, అందుకు అనుగుణంగా 1995 నుండి ఆయన పాలనలో మన రాష్ట్రానికి అనేక మెడికల్ కాలేజీలు తీసుకువచ్చారని, అలాగే ఎయిమ్స్, బసవతారకం క్యాన్సర్ వైద్యశాల తదితర సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలు సీఎం చంద్రబాబు మన రాష్ట్రంలో ఏర్పాటుకు కృషి చేశారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. సీఎం చంద్రబాబు గతంలో మెడికల్ కాలేజీలు స్థాపించడంతోనే దేశ విదేశాల్లో మన రాష్ట్రానికి చెందిన వైద్యులు తమ సేవలను అందించగలుగుతున్నారని గుర్తుచేశారు. సీఎం చంద్రబాబు ఒక విజన్ తో రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తారన్నారు. గతంలో జీనోమ్ వ్యాలీ ఏర్పాటు సమయంలో విమర్శలు చేసిన వారు కరోనా సమయంలో జీనోమ్ వ్యాలీ నుండే కరోనా వ్యాక్సిన్ తయారుచేసి కోట్ల మందికి ప్రాణాధారమైందన్న వాస్తవాన్ని గుర్తించిన విషయం రాష్ట్ర ప్రజలకు విదితమే అని అన్నారు.

**కూటమి ప్రభుత్వం-మంచి ప్రభుత్వం : మంత్రి వాసంశెట్టి సుభాష్**

కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వమని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తూ అంతే ప్రాధాన్యతను సంక్షేమానికి ఇస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని కార్మిక శాఖ, ఫ్యాక్టరీస్, బాయిలర్స్ మరియు ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. గత ప్రభుత్వం 17 మెడికల్ కాలేజీలు నిర్మించిందని అంటున్నారని, కాని వాస్తవంగా 5 మెడికల్ కాలేజీలు అ–రకొరగా నిర్మించారని, కేవలం కేంద్రం ఇచ్చిన నిధులతోనే ఆ భవనాలను నిర్మించారని ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ను మాత్రం ఏర్పాటు చేయలేదని విమర్శించారు. దీంతో ఆ భారం కూటమి ప్రభుత్వంపై పడిందన్నారు.

# మహిళలకు ఉచిత వైద్యసేవలు

(మొదటి పేజీ తరువాయి)




తొలిరోజు మధ్యాహ్నానికే 80 వేల మంది టెస్టులు చేయించుకున్నట్లు వెల్లడించారు. 8,181 స్పెషలిస్టు వైద్యుల ద్వారా మహిళలకు ఆరోగ్య పరీక్షలు జరుగుతున్నట్లు చెప్పారు. ఈ శిబిరాల ద్వారా చిన్నారులు, బాలబాలికలకు కలిపి కోటి మందికి పైగా ఆరోగ్య పరీక్షలు చేయాలనీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.

మహిళలకు ఉచితంగా రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, ఇతర పరీక్షలను శిబిరాల ద్వారా చేస్తున్నట్లు పేర్కొన్నారు. మెప్మా గ్రామ వార్డు సచివాలయాలు, అంగన్వాడీలు, వైద్య ఆరోగ్య శాఖకు చెందిన వారితో కలిపి 4,000 సిబ్బంది వైద్య శిబిరాల నిర్వహణ విధులో పాల్గొంటున్నట్లు వివరించారు.

**త్వరలో క్యాన్సర్ స్క్రీనింగ్ :** 18 ఏళ్ళు దాటిన వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, కూటమి ప్రభుత్వం ముందు నుంచే పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. ఎన్.సి.డి. 03 కింద చేసిన పరీక్షల్లో ఓరల్ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టుల నిర్వహణకు కనిపించిన స్పందన సర్వైకల్ రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు కనిపించలేదన్నారు. ఈ రెండు పరీక్షల మహిళలు ఆసుపత్రులకు వచ్చి చేయించుకునేందుకు సంశయిస్తున్నారన్నారు. కొందిరికి అవగాహన కూడా లేదన్నారు. ఎన్.సి.డి 03 (సర్వే) ద్వారా కేసులు గుర్తింపు అత్యంత తక్కువగా ఉన్నందున మరోసారి సర్వే చేయబోతున్నట్లు స్పష్టం చేశారు. ముందస్తు పరీక్షలు ద్వారా గుర్తించిన వ్యాధులకు అనుగుణంగా చికిత్సలు అందిస్తే ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. ఈ పరీక్షల ఆవశ్యకతను మహిళలు గుర్తించాలని, రాష్ట్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు సహకరించాలని ఆయన కోరారు. గిరిజనలు ఉండే ప్రాంతాల్లో 14 లక్షలు మందికి సికిల్ సెల్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ పరీక్షలు నిర్వహణ ద్వారా సమస్యలను గుర్తించిన వారికి తదుపరి చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

**మహిళా సాధికారితకు పెద్దపీట :** కేంద్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. దేశంలో కీలకమైన శాఖలు రక్షణ శాఖ, ఆర్థిక శాఖ, నిర్మలా సీతారామన్, విద్యా శాఖ స్మృతి ఇరానికి ప్రధాని మోడీ అప్పగించారన్నారు,.

**సంక్షేమ పథకాలకు అపూర్వ స్పందన :** రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు మంచి స్పందన కనిపిస్తుందన్నారు. మహిళా ఆరోగ్యం కోసం కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫించన్లు, తల్లికి వందనం, గ్యాస్ సిలిండర్లు, స్త్రీ శక్తి కింద ఉచితంగా ఆర్ టి సి బస్సులో ప్రయాణం, తదితర పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సౌరవ్ గౌరవ్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ వీరపాండ్యన్, ఆయుష్ కమీషనర్ దినేష్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా సాగరిక ఫంక్షన్ హాలులో స్టాల్ లో సందర్శించారు.

మధ్యప్రదేశ్ లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వైద్య శిబిరాల ప్రారంభ కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు సత్యకుమార్ యాదవ్, పయ్యావుల కేశవ్, డోలా వీరాంజనేయస్వామి, ప్రభుతులు వీక్షించారు.

# పోటీలలో ప్రతిభ చాటిన శాశ్వత



**కాకుమాను,( జర్నలిస్ట్ ఫైల్):**కామ్రేడ్ కొల్లా. వెంకయ్య 27 వ వర్ధంతి సందర్భంగా పెదనందిపాడు కొల్లా వెంకయ్య లైబ్రరీ భవనం నందు నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన , క్విజ్ పోటీలలో కాకుమాను ఎన్ జడ్పీ పాఠశాల 10 వ తరగతి విద్యార్థిని బొనిగల. శాశ్వత వక్తృత్వ , వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబరిచి మొదటి బహుమతి గెలుపొందినారు. శ్రీ శ్రీ గేయాలు,క్విజ్ పోటీలలో ద్వితీయ, తృతీయ బహుమతులను అందుకున్నది.అదే విధంగా పాఠశాల విద్యార్థులు అయిన 8 వ తరగతి విద్యార్థిని ప్రవస్తి వక్తృత్వ పోటీలో ద్వితీయ బహుమతి, శ్రీ శ్రీ గేయాలు పోటీల లో మొదటి బహుమతి, పొందుకున్నారు. 9 వ తరగతి విద్యార్థిని ఆన్సర్ అలీ వ్యాసరచన పోటీలో ద్వితీయ బహుమతి పొందినట్లు మండల విద్యా శాఖ అధికారి కెన్నెడీ తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

# ఫ్రీబస్సు.. సక్సెస్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో, (జర్నలిస్ట్ ఫైల్) :** స్త్రీ శక్తి పథకం రాష్ట్రం లో బ్రహ్మాండంగా సక్సెస్ అయింది. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు పెద్ద ఎత్తున ఈ పథకాన్ని వినియోగించుకుంటున్నారు. ఈ హామీని నెరవేర్చడం, రాష్ట్రవ్యాప్తంగా మహిళలు పెద్ద ఎత్తున వినియోగించుకోవడంతో కూటమి ప్రభుత్వంలో కూడా హర్షం వ్యక్తం అవుతోంది. నిత్యం వందలాది మంది మహిళలు ఉచిత బస్సులో ప్రయాణిస్తున్నారు. పల్లె వెలుగు బస్సు నుంచి ఎక్స్ప్రెస్ బస్సు వరకు ఎక్కి ప్రయాణించే అవకాశం కల్పించడంతో సమీప ప్రాంతాల్లో ఉన్న పుణ్యక్షేత్రాలను కూడా మహిళా భక్తులతో కిటకిటలాడుతున్నాయి. దీంతో మహిళలు సులభంగా నిత్యం 100 కిలోమీటర్ల దూరం వరకు ప్రయాణిస్తున్నారు. ఒక విధంగా చెప్పాలంటే ఈ స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం మహిళలకు ఆర్థిక వెసులుబాటు కూడా కల్పించిందని చెప్పాలి. దీనికి తోడు బస్సులు ఒత్తిడిగా ఉన్నప్పటికీ ఈ నెల రోజుల్లో మహిళలు కూడా ఇబ్బందులు లేకుండా అవకాశాన్ని వినియోగించుకుంటున్నారు. కూటమి నేతలు ఎన్నికల హామీగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రయాణం కల్పిస్తామని తెలంగాణ, కర్ణాటక తరహాలో హామీ ఇచ్చారు. ఈ ఉచిత బస్సుని రాష్ట్రంలో ఆగస్టు 15న ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ విజయవాడలో ప్రారంభించారు. శనివారం నాటికి ఖచ్చితంగా నెల రోజులు పూర్తి చేసుకుంది. ఈ నెల రోజుల్లో ఉచిత బస్సు వల్ల మహిళలు పెద్ద ఎత్తున లాభపడ్డారని ప్రభుత్వాధినేతలతో సహా ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు. ఈ నెల రోజుల్లో ఆర్టీసీ సేవలను ఎంతమంది మహిళలు ఉపయోగించుకున్నారు? సుమారుగా వారి ఎంత లాభపడ్డారు? వివిధ కళాశాలలో చదువుకునే విద్యార్థునుల స్థితిగతులు ఎలా ఉన్నాయని లెక్కలను పక్కాగా తీసిన ఆర్టీసీ అధికారులు ప్రభుత్వానికి ఒక నివేదిక రూపంలో అందజేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ స్త్రీ శక్తి పథకం లక్ష్యం నెరవేరిందని మాత్రం చెబుతున్నారు.

మహిళలకు ఏ విధంగా ఇది ఉపయోగపడింది అంటే దీని మీద సానుకూలమైన ఫలితాలే వచ్చినట్లుగా ప్రభుత్వానికి నివేదికలు ఉన్నాయి. ప్రభుత్వం మాత్రం దీనిని మహిళా లోకానికి పెద్ద బహుమతిగా అభివర్ణించింది. టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల వేళ ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలో ఇది కీలకంగా ఉంది. దాని ప్రకారం అధికారంలోకి వచ్చిన తరువాత ఉచిత బస్సు విషయంలో అన్ని రకాలైన కసరత్తులు చేసి మరీ 2025 ఆగస్టు 15న ఈ పథకాన్ని అమలు చేసింది. అయితే కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఈ పథకం అమలులో ఉన్న చిన్నపాటి లోపాలను కూడా సవరించి మన రాష్ట్రంలో అమలు చేయడం లో కూటమి ప్రభుత్వం 100% సక్సెస్ అయింది.

మహిళలకు ఇది ఒక బహుమతిగా ప్రభుత్వం పేర్కొంటోంది. ముఖ్యంగా శ్రామిక మహిళలు ఉద్యోగినులు అలాగే విద్యార్థినులు వీరంతా ఈ పథకానికి ప్రధాన లబ్ధిదారులుగా ఉన్నారు. నిత్యం గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు వెళ్లి పొట్టకూటికోసం పాలు, పెరుగు, పూలు, ఇతర రకాల కూరగాయలు వ్యాపారం చేసుకునే మహిళలు ఈ పథకంపై పూర్తిస్థాయిలో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**ఎంతోమంది మహిళలకు లాభం :** ఇక ఈ ఉచిత బస్సు పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు కొంతమేరకు ఆర్థిక వెసులుబాటు కల్పిస్తోంది. ఆర్టీసీ ఎక్స్ ప్రెస్ ల వరకూ ఎక్కే చాన్స్ ఉండడంతో చాలా సులువుగా వంద కిలోమీటర్ల దూరం ఉచితంగా ప్రయాణం చేస్తున్నారు. పక్క జిల్లాలలు వెళ్తున్నారు. మరో విశేషం ఏమిటంటే నిత్యం చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునే మహిళలు కూడా పురుగు జిల్లాలకు సైతం వెళ్లి వ్యాపారం చేసుకుని ఇంటికి చేరుతున్నారు. ఈ పరిస్థితులు కూడా ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఆడపడుచులు తమ కన్న వారిని చూసేందుకు, ఫంక్షన్లకు, ఎలాంటి ఖర్చులు లేకుండా వెళుతున్నామని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో మహిళలు దేవాలయాల సందర్శనకు ఉచిత బస్సుని వాడుకుంటున్నారు. దీంతో నెల రోజులుగా ఉచిత బస్సు ద్వారా మహిళలు అందుకున్న లాభం కానీ వారు మిగుల్చుకున్న ఆదాయాన్ని అధికారులు లెక్కలు వేసి ప్రభుత్వానికి నివేదిక అందజేసినట్లు తెలుస్తోంది. ప్రాథమిక అంచనా ప్రకారం జీరో టికెట్లను అధికారులు లెక్క కట్టినట్టు తెలుస్తోంది. దీని ప్రకారం ఈ 30 రోజుల్లో సుమారు రు.120 కోట్లను టికెట్ రాయితీ రూపంలో మహిళలు పొందినట్లు తేలింది. ఇది భారీ మొత్తం కిందనే చెప్పాల్సి ఉంది. రమారమీగా ఇదే లెక్కలు ఒక ఏడాదికి అంచనా వేస్తే రాష్ట్రవ్యాప్తంగా మహిళలు దాదాపు రూ. 1500 కోట్ల ఆదా చేసుకున్నట్లేనని అధికారులు అంచనావిస్తున్నారు. అంటే ఇంతటి భారీ ఆర్థిక లాభం ప్రతీ ఇంటికీ చేకూర్చిన ఘనతను కూటమి ప్రభుత్వానికి దక్కుతుంది. ఇక ఈ పథకాన్ని.నెల రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా. 3.19 కోట్ల మంది మహిళలు వినియోగించుకున్నారని తేలింది.

వీరందరి పర్సులలో : పట్టణాలు నగరాల్లో మహిళలు చిరు ఉద్యోగాలు చేసుకుంటూ తమ జీవితాలను గడుపుతున్నారు. వారు ప్రతీ నెలా రూ. వెయ్యి నుండి రూ. 1200లను బస్ పాస్ కోసం ఖర్చు చేస్తున్నారు. అలా ఆ మహిళల పర్సులో ఇపుడు ఆ మొత్తం మిగిలినట్లే కదా.. ఈ నగదు ఒక చిన్నపాటి కుటుంబం నెలవారీ ఖర్చులకు. వినియోగించుకుంటుందని ప్రభుత్వం భావిస్తోంది. అంతే కాదు విద్యార్థినులు కూడా మూడు నెలలకు రూ. 15 వందల స్టూడెంట్ బస్ పాస్ తీసుకునేవారు. ఇపుడు వారికి ఆ డబ్బులు మిగిలినట్లె. ఇక రోజు వారీ కూలీ నాలీ పనులు చేసుకునేవారు ప్రధానంగా ఆటోలను ఆశ్రయించిఏవారు వారికి వచ్చే కూలీలో వంద రూపాయల దాకా ఈ ఆటో చార్జీలకే రోజుకు పోయేది. ఇపుడు వారికి నెలకు మూడు వేల దాకా మిగుతోంది అన్నది లెక్క చెబుతోంది. ఆర్టీసీ బస్సులు

ఆక్యుపెన్సీ రేటు బాగా పెరిగిందని అధికారులు చెబుతున్నారు : వీరు కాక మధ్యతరతి గృహిణులు తమ కుటుంబాలతో ఎక్కడికైనా వెళ్లాలి అనుకుంటే వారి బడ్జెట్ లో రూ. 1000 నెలలో ఖర్చు అయ్యేది. ఇపుడు మహిళలకు ఉచిత బస్సు వల్ల అయిదు వందల దాకా ఆదా అవుతోంది. దాంతో నెలకు రెండు మూడు సార్లు కూడా వెళ్ళగలుతున్నారు. ఇలా వివిధ వర్గాల మహిళలు అంతా స్త్రీ శక్తి పథకానికి జై కొడుతున్న నేపథ్యం కనిపిస్తోంది. ఇక బస్సులో మహిళల ఆక్యుపెన్సీ రేటు పెరిగింది. 73 శాతం వారు ప్రయాణిస్తున్నట్లు గుర్తించారు. భవిష్యత్తులో ఈ ఉచిత బస్సు ప్రయాణం మరింత గా మహిళల ఆదరణ పొందుతుందని అధికారులు భావిస్తున్నారు.

అయితే మహిళలతో ఆర్టీసీలో నెలకొంటున్న రద్దీని అధిగమించేందుకు ప్రభుత్వం కొత్త ఎలక్ట్రికల్ బస్సులను కొనుగోలు చేసింది రాష్ట్రవ్యాప్తంగా ప్రవేశపెట్టేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. పెరుగుతున్న ఆక్యుఫెన్సీకి ధీటుగా బస్సులను పెంచాల్సిన అవసరం కూడా ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని బస్సులలో ఇంకా రద్దీ ఎక్కువగా ఉంది. దీన్ని అధిగమించేందుకు కృషి చేయాల్సిన అవసరం కూడా ఉంది.

# నేపాల్‌టూ.. ఏపీ సురక్షితంగా తరలింపు!



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** తెలుగువారికి ఎప్పుడు ఏ ఆపద వచ్చినా తాము అండగా నిలబడతామని మరోసారి నిరూపించారు విద్య, ఐటీ, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేష్. గతంలో ఉత్తరాఖండ్ వరదల సమయంలో చిక్కుకుపోయిన తెలుగువారిని నారా చంద్రబాబునాయుడు క్షేమంగా స్వరాష్ట్రానికి చేర్చారు. నేడు కూటమి ప్రభుత్వంలో నేపాల్ లో చిక్కుకుపోయిన చివరి తెలుగు వ్యక్తిని రాష్ట్రానికి చేర్చి విజయవంతంగా ఆపరేషన్ నేపాల్ రెస్క్యూను మంత్రి నారా లోకేష్ పూర్తిచేశారు. నేపాల్ లో నెలకొన్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అక్కడ పలు ప్రాంతాల్లో బృందాలుగా ఏపీ యాత్రికులు చిక్కుకుపోయారు. వారిని సురక్షితంగా రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు ఈ నెల 10, 11 తేదీల్లో రెండు రోజుల పాటు సచివాలయంలోని రియల్ టైం గవర్నెన్స్ లోని ప్రత్యేక వార్ రూమ్ ద్వారా పరిస్థితులను ఎప్పటికప్పుడు మంత్రి నారా లోకేష్ సమీక్షించారు. ఇందుకోసం తన అనంతపురం పర్యటనను రద్దు చేసుకున్నారు. వార్ రూమ్ నుంచి ఢిల్లీలోని ఏపీ భవన్ అధికారులు, కేంద్ర ప్రభుత్వం, నేపాల్ రాయబార కార్యాలయం, రాష్ట్రానికి చెందిన మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో మంత్రి లోకేష్ నిరంతరం సమన్వయం చేశారు. ఫలితంగా నేపాల్ లో చిక్కుకున్న చిట్టచివరి వ్యక్తి వరకు రాష్ట్రానికి చేరుకున్నారు.

**నేపాల్ నుంచి మొత్తం 361మంది ఏపీ వాసులను రక్షించి రాష్ట్రానికి చేర్చిన మంత్రి లోకేష్ :** నేపాల్ లోని పలు ప్రాంతాల్లో చిక్కుకుపోయిన మొత్తం 361 మంది ఏపీ వాసులను రక్షించి ప్రత్యేక విమానాల ద్వారా వారందరినీ సురక్షితంగా మంత్రి నారా లోకేష్ రాష్ట్రానికి చేర్చారు. మంత్రి చొరవతో ఇప్పటికే 275 మందిని రాష్ట్రానికి రప్పించి వారందరినీ వారి వారి గమస్థానాలైన విశాఖపట్నం, కర్నూలు, నంద్యాల, తిరుపతికి చేర్చారు. నేడు మానససరోవర్ యాత్రకు వెళ్లి అక్కడ చిక్కుకుపోయిన చివరి 86 మంది సభ్యుల బృందం కూడా ఖాట్మాండూ విమానాశ్రయం నుంచి బయలుదేరారు. వీరంతా ఢిల్లీ మీదుగా హైదరాబాద్ చేరుకోనున్నారు. దీంతో మొత్తం 361 మంది ఏపీ వాసులను రక్షించి వారివారి స్వస్థలాలకు చేర్చినట్లు అయింది. నేపాల్ లో ఇక ఎవరూ ఏపీ వాసులు లేకపోవడంతో ఢిల్లీలోని ఏపీ భవన్ లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ ను అధికారులు మూసివేస్తున్నారు.


**తెలుగువారిని సురక్షితంగా వెనక్కి తీసుకురావడమే ఏకైక అజెండాగా పనిచేసిన మంత్రి లోకేష్ :** నేపాల్ లో చిక్కుకున్న తెలుగువారిని సురక్షితంగా రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు మంత్రి నారా లోకేష్ యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేశారు. హెల్ప్ లైన్ నెంబర్లు ఏర్పాటుచేసి అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ప్రతి రెండు గంటలకోసారి తెలుగువారి క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. వీడియో కాల్ ద్వారా బాధితులతో మాట్లాడి వారిలో ధైర్యం నింపారు. ఉంటున్న ప్రదేశం నుంచి ఎవరూ బయటకు రావొద్దని పదేపదే విజ్ఞప్తి చేశారు. నేపాల్ లో చిక్కుకున్న తెలుగువారిని సురక్షితంగా వెనక్కి తీసుకురావడమే ఏకైక అజెండాగా పనిచేశారు. వారిని క్షేమంగా ఇంటికి చేర్చే బాధ్యత ప్రభుత్వానిది అంటూ భరోసా ఇచ్చారు. ప్రత్యేక విమానాల ద్వారా విశాఖ, తిరుపతి విమానాశ్రయాలకు చేరుకున్న రాష్ట్ర వాసులను వారి స్వస్థలాలకు చేర్చే బాధ్యతను కూటమి ఎమ్మెల్యేలకు అప్పగించారు. దీంతో రాష్ట్రానికి చేరుకున్న తెలుగువారిని ఆయా విమానాశ్రయాలకు వెళ్లి కూటమి ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. వారికి కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటుచేశారు. వాహనాల ద్వారా వారిని స్వస్థలాలకు చేర్చారు. చివరి తెలుగు వ్యక్తిని రాష్ట్రానికి తీసుకువచ్చేంత వరకు కంట్రోల్ రూమ్ కొనసాగుతుందని హామీ ఇచ్చారు. హామీని నిలబెట్టుకుంటూ నేపాల్ నుంచి మొత్తం 361 మంది ఏపీ వాసులను రక్షించి రాష్ట్రానికి చేర్చారు. తెలుగువారిని కాపాడేందుకు మంత్రి నారా లోకేష్ చేసిన కృషి పట్ల నేపాల్ నుంచి రాష్ట్రానికి తిరిగొచ్చిన ఏపీవాసులు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## అసైన్డ్ భూములు ఇచ్చిన రైతులకు పట్టా భూమిజారీ



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** ఏపీ రాజధాని నగర నిర్మాణం కోసం అసైన్డ్ భూములుఈ ఇచ్చిన రైతులకు ఊరట కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం బుధవారం కీలక నిర్ణయం తీసుకుంది. ల్యాండ్ పూలింగ్‌లో అసైన్డ్ భూములు అప్పగించిన రైతులకు ఇచ్చే రిటర్నబుల్ ప్లాట్లను అసైన్డ్ కాకుండా పట్టా పేరుతో జారీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. రిటర్నబుల్ ప్లాట్లలో అసైన్డ్ అని ఉండటంతో అవి అమ్ముడుపోవడం లేదని రైతులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఇటీవల జరిగిన మంత్రివర్గం సమావేశంలో ఈ అంశంపై చర్చించిన సీఎం చంద్రబాబు.. రైతులందరికీ పట్టా పేరిట ప్లాట్లు ఇవ్వాలని నిర్ణయించారు. దీంతో అవసరమైన మార్పులు చేస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ జీవో జారీ చేశారు.

## బాధ్యతలు స్వీకరించిన ప్రాధికారిక సంస్థ చైర్మన్ శివారెడ్డి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** ఏపీ స్థిరాస్తి వ్యాపార ప్రాధికార సంస్థ (రెరా) ఛైర్మన్‌గా ఎ.శివారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని రెరా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శివారెడ్డితో జస్టిస్ గంగారం ప్రమాణం చేయించారు. రెరా సభ్యులుగా నియమితులైన మంత్రిరావు వెంకటరత్నం, దామచర్ల శ్రీనివాసరావు, మేరువ వెంకటేశ్వర్లు, జజ్జవరవు కులదీప్‌లతో ఛైర్మన్ శివారెడ్డి ప్రమాణం చేయించారు. ఛైర్మన్, రెరా సభ్యులను పలువురు సత్కరించారు. రెగ్యులేటరీ అథారిటీకి పూర్తి బోర్డు నియామకం జరిగిందని, భవన నిర్మాణ రంగానికి సంబంధించి కేవలం పర్యవేక్షణ ఒక్కటే కాకుండా ఈ రంగం అభివృద్ధికి పనిచేస్తామని శివారెడ్డి తెలిపారు. త్వరలో మొత్తం సభ్యులందరితో చర్చించి సమగ్ర కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు.

## ఎంపీ భూపతిరాజు ఘనసత్కారం




**భీమవరం (జర్నలిస్ట్ ఫైల్) :** నరసాపురం పార్లమెంట్ సభ్యులు, కేంద్ర ఉక్కు శాఖా సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను భీమవరంలో క్యాంపు కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్, రాష్ట్ర బ్రాహ్మణ వెల్ ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన వెలగలేటి గంగాధర్ శాలువాతో సత్కరించారు. తన నియమాకానికి సహకరించిన కేంద్రమంత్రి వర్మకు ధన్యవాదాలు తెలిపారు.

భూపతిరాజు మాట్లాడుతూ, పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా సేవ చేసిన గంగాధర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, బ్రాహ్మణ వెల్ ఫేర్ కార్పొరేషన్‌ద్వారా పేద బ్రాహ్మణులను గుర్తించి వారి అభివృద్ధికి ముందడుగు వేయాలని సూచించారు.

కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు దేవి, బీజేపీ రాష్ట్ర పబ్లిసిటీ అండ్ లిటరేచర్ ప్రధాన పాలపాటి రవికుమార్, బీజేపీ సీనియర్ నేతలు మాధవరెడ్డి, యువమోర్చా నేతలు జంధ్యాల సాయి రాధాకృష్ణ పాల్గొన్నారు.

## ఉద్యోగులు, ఉపాధ్యాయుల పాత బకాయిలు విడుదల చేయాలి - ఆప్టా

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ద్యోగులు, ఉపాధ్యాయులకు రావలసిన పాత బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) రాష్ట్ర అధ్యక్షుడు ఎ.జి.ఎస్. గణపతి రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రకాష్‌రావు డిమాండ్ చేశారు.

వారి ప్రకటనలో వారు తెలిపారు – "ఉపాధ్యాయులు, ఉద్యోగులకు రావలసిన పీఆర్‌సీ, డీఏ, ఈఎల్ ఏరియర్స్ ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి. దసరా పండుగకు కనీసం రెండు డీఏలు మంజూరు చేయాలి. సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ కోసం మూడు సంవత్సరాల క్రితమే దరఖాస్తు చేసినా ఇప్పటివరకు నగదు చెల్లింపులు జరగలేదు. చెల్లింపులు జరగకముందే వాటిపై ఆదాయపన్ను కూడా వసూలు చేయడం అన్యాయం" అని ఆవేదన వ్యక్తం చేశారు.

"ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మెరుగైన పీఆర్‌సీతో పాటు పాత బకాయిలు కూడా చెల్లిస్తామని ఇచ్చిన హామీ ఇప్పటి వరకు నెరవేరలేదు. దీనివల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో తీవ్ర నిరాశ నెలకొంది. ఉద్యోగుల న్యాయబద్ధమైన కోరికలను వాయిదా వేయడం తగదు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని అన్ని బకాయిలను విడుదల చేయాలి. పీఆర్‌సీ కమిటీని నియమించి 30 శాతం ఐఆర్‌ను తక్షణమే ప్రకటించాలి" అని డిమాండ్ చేశారు.

## స్పీకర్ తో గుంటూరు ఎస్పీ భేటీ



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు జిల్లా కొత్త ఎస్పీ వకుల్ జిందాల్ అసెంబ్లీ ప్రాంగణంలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్న పాత్రుడు వకుల్ జిందాల్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సేవలో సమర్థత ప్రదర్శించి, పోలీస్ శాఖ ప్రతిష్టను మరింత పెంచాలని సూచించారు. జిల్లా శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నిర్మూలనలో కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. తదనంతరం గురువారం ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లపై సమీక్ష జరుగగా, పటిష్టమైన బందోబస్తు కల్పించాలని, భద్రతలో ఎటువంటి లోపం ఉండకూడదని స్పీకర్ ఆదేశాలు జారీ చేశారు.

# డయేరియా బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

- **అంచెలంచెలుగా నీటి శుద్ధి**
- **అకాల వర్షాలతోనే వ్యాధులు**
- **కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచన**
- **ఏ సమయంలోనైనా తనను సంప్రదించవచ్చన్న ఎమ్మెల్యే**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో డయేరియా బాధితులను బుధవారం రాత్రి గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ పరామర్శించారు. బాధితులు ఎక్కడి నుంచి వచ్చారు ? ? ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందనే విషయాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ యశస్వీ రమణను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో తాగునీటిని అంచెలంచెలుగా శుద్ధి చేస్తున్నామని తెలిపారు. తక్కెళ్లపాడు వాటర్ హెడ్స్ నుంచి వచ్చే నీటిని రిజర్వాయర్ల వద్ద శుద్ధి చేస్తామని, అనంతరం ఇళ్లకు సరఫరాలో అయ్యాక శాంపిల్స్ తీసుకుంటామని వెల్లడించారు. అయితే అకాల వర్షాల కారణంగా రోగాలు ప్రబలుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఆస్పత్రిలో ప్రతి ఒక్కరిపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని ఈ సందర్భంగా సూపరింటెండెంట్ యశస్వీ రమణకు ఎమ్మెల్యే నసీర్ సూచించారు. ఏ సమయంలోనైనా తనను సంప్రదించవచ్చని తెలిపారు.

# మంగళగిరిలో రూపుదిద్దుకుంటున్న 'మోడల్ లైబ్రరీ'



**మంగళగిరి, (జర్నలిస్ట్ ఫైల్) :** మంగళగిరి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లోనూ మోడల్ గా తీర్చిదిద్దాలనే దృఢ సంకల్పంతో రాష్ట్ర మానవవనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేష్ ముందుకుసాగుతున్నారు. ఏ పని మొదలుపెట్టినా పూర్తిస్థాయిలో అధ్యయనం చేస్తూ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా చేపడుతున్నారు. యువత తమ సామర్థ్యాలకు తగ్గట్టుగా ఉద్యోగాలు సాధించాలంటే పోటీ పరీక్షల్లో మంచి ప్రతిభను కనబరిస్తేగాని సాధ్యంకాదు. ప్రధానంగా పోటీపరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులను దృష్టిలో పెట్టుకుని మంగళగిరి శివాలయం పక్కనే గల గుంటూరు జిల్లా గ్రంథాలయసంస్థ ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయాన్ని అభివృద్ధి చేస్తున్నారు. నియోజకవర్గంలో ప్రతిదీ ఓ మోడల్ గా తీర్చిదిద్దాలనే సంకల్పంతో పూర్తిస్థాయి వసతులతో గ్రంథాలయ భవన నిర్మాణం చేపట్టారు. ఒక కోటీ 30 లక్షల అంచనావ్యయంతో రెండతస్తుల గ్రంథాలయ భవన నిర్మాణ పనులు ఈ నెలాఖరుకల్లా పూర్తిచేయాలనే లక్ష్యంతో చురుగ్గా పనులు కొనసాగుతున్నాయి. ఫస్ట్ ఫ్లోర్ లో పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యే ఉద్యోగార్థులకు రెండు క్లాస్ రూములు నిర్మిస్తున్నారు. ఇందులో కాంపిటీటివ్, సాఫ్ట్ స్కిల్స్ (స్పోకెన్ ఇంగ్లీష్) వంటి తరగతులు నిర్వహిస్తారు. అలాగే డిజిటల్ లైబ్రరీ.. 20 కంప్యూటర్లు ఏర్పాటుచేస్తున్నారు. అన్ని పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు అవసరమైన బుక్స్ అందుబాటులో వుంచుతారు. ఇక గ్రౌండ్ ఫ్లోర్ లో పిల్లలకు ఉపయోగపడేవిధంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అలాగే నిత్యం లైబ్రరీకి వచ్చే చదువరులకోసం వివిధ దిన పత్రికలు, వార, మాసపత్రికలు అందుబాటులో వుండేవిధంగా రీడింగ్ రూమ్ ఉంటుంది. ఈ విజ్ఞానభాండాగారం భవననిర్మాణం పూర్తయితే పెద్దనగరాలకు దీటుగా మౌలికవసతులు సమకూరుతాయి. మంగళగిరిలో ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయ భవనం పునర్నిర్మాణం పనులు పూర్తయితే తమకు ఎంతో ప్రయోజనకరంగా వుంటుందని నిరుద్యోగ యువత హర్షం వ్యక్తంచేస్తోంది.

## ఆర్టీసి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రవాణా శాఖ ప్రధాన కార్యదర్శికి విజ్ఞప్తి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఏపి ఆర్టీసి 2020లో విలీనం అయిన అనంతరం ఉత్పన్నమయ్యే సమస్యల్లో ప్రభుత్వ పరిధిలో ఉన్న అంశాలను పరిష్కరించమని ఆర్టీసి ఎండీ ప్రభుత్వం ముందుకు సిఫార్సు చేశారు. ఈ మేరకు ఆర్టీసి ఉద్యోగుల పదోన్నతలతో పాటు ఇతర 14 సమస్యలను త్వరగా పరిష్కరించమని బుదవారం సచివాలయంలో రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నూతన బాధ్యతలు చేపట్టిన చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు కలసి, సమస్యల పరిష్కారానికి విజ్ఞప్తి చేసి లేఖలు అందించారు. ఈ వివరాలు ఏపిపిటీడీ (ఆర్టీసి) ఉద్యోగి యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసయ్య ప్రకటించారు. ప్రధానంగా ప్రభుత్వ పరిధిలో పెండింగు ఉన్న సమస్యల్లో, విలీనం కు ముందు ఉన్న పాత నియమాల మేరకు ఆర్టీసి ఉద్యోగులకు పదోన్నతలు ఇవ్వాలన్న యూనియన్ విజ్ఞప్తి మేరకు గతనెల 28న ముఖ్యమంత్రికి 6000 మంది పదోన్నతలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వబడింది. అయితే జిఓ జారీ కోసం జేడీ వద్ద పెండింగ్ ఉండటంతో, చీఫ్ సెక్రటరీ వెంటనే చర్య తీసుకొని పదోన్నతలు వచ్చేవిధంగా చూడనున్నట్లు హామీ ఇచ్చారు. అంతేకాక, ప్రభుత్వ పరిధిలో ఇంకా పెండింగ్‌గా ఉన్న సమస్యలలో సుమారు 8000 కండక్టర్లు, డ్రైవర్లు, మెంటినెన్స్ సిబ్బంది, క్లరికల్ & సూపర్ వైజర్స్, అధికారులు నియామకాలకు అనుమతులు ఇవ్వడం, పాత కాంట్రాక్ట్ కండక్టర్లు, డ్రైవర్లకు, ఆర్టీసి సెక్యూరిటీ కానిస్టేబుళ్లకు, జూనియర్ అసిస్టెంట్లకు జీతాలు అందకపోవడం వంటి సమస్యలను త్వరగా పరిష్కరించమని, రిటైర్డ్ ఉద్యోగులకు ఆర్టీసి విలీనం కాకముందు ఉన్న రిటైర్డు ఎంప్లాయిస్ మెడికల్ స్కీమ్ అమలు చేయమని యూనియన్ విజ్ఞప్తి చేశారు. అయితే జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలు, ఇ.హెచ్.ఎస్ మేనేజింగ్ కమిటి సమావేశాల్లో ప్రభుత్వ గుర్తింపు సంఘాల ప్రతినిధులు పాల్గొనటానికి అవకాశం కల్పించమని, సంబంధిత రాయితీలను ఇచ్చేలా చూడమని కూడా యూనియన్ లేఖలో అభ్యర్థన చేశారు. రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని కలిసిన వారిలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సుబ్రహ్మణ్యం రాజు, మొయినుద్దీన్, నారాయణ, జోనల్ కార్యదర్శి వై.యస్. రావు పాల్గొన్నారు.

## శ్రీవారాహీ అమ్మవారి సేవలో....మంత్రి నాదెండ్లమనోహర్



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** కొల్లిపర మండలంలోని కుంచవరం గ్రామానికి వేంచేసిన మంత్రి నాదెండ్ల మనోహర్, గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం పోస్ట్ స్వచ్ఛంద సంస్థ ప్రాంగణంలోని శ్రీ వారాహి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా పోస్ట్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు తన్నీరు శ్రీనివాస్ బాబు, ముద్దాబత్తుని రమణయ్య తదితర గ్రామస్తులు మంత్రి నాదెండ్ల మనోహర్ కు సాదర స్వాగతం పలికారు. మంత్రి నాదెండ్ల మనోహర్ శ్రీ వారాహి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు న్యాయవాది హరిదాసు గౌరీ శంకర్, పార్టీలోని పలువురు నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## స్వస్త్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 21వ డివిజన్‌కేవీపీ కాలనీ అర్బన్ ప్రైమరీ హెల్త్‌కేర్ సెంటర్‌లో "స్వస్త్ నారీ – సశక్త్ పరివార్ అభియాన్" కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గళ్ళా మాధవి మంగళవారం ప్రారంభించారు. మహిళల ఆరోగ్యం, కుటుంబ బలోపేతం లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన ఈ జాతీయ పథకం, సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు దేశవ్యాప్తంగా నిర్వహించబడుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా దేశమంతటా మహిళల కోసం ఈ ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు ప్రారంభించారని, ఈ అభియాన్‌లో గుండె జబ్బులు, మధుమేహం, నోటి/గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్, గర్భిణుల కౌన్సిలింగ్, పోషకాహార అవగాహన, బాలికల్లో హిమోగ్లోబిన్ పరీక్షలు, రక్తహీనత నివారణ, పిల్లల సికిల్ సెల్ అనీమియా పరీక్షలు, టీకాలు, ఆయుష్మాన్ కార్డుల పంపిణీ, రక్తదాన శిబిరాలు, బహిష్టు పరిశుభ్రత అవగాహన వంటి విస్తృత సేవలు అందించబడతాయన్నారు. మహిళలు ఆరోగ్యవంతంగా ఉంటేనే కుటుంబం, సమాజం బలోపేతం అవుతుందని, ప్రతి ఒక్కరూ ఈ శిబిరాలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు.

## భూమనకు పోలీసులు నోటీసులు జారీ



**తిరుపతి, (జర్నలిస్ట్ ఫైల్) :** తిరుపతిలోని అలిపిరి సమీపంలో ఒక విగ్రహం నిర్లక్ష్యానికి గురైందంటూ టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యల కారణంగా ఆయనపై కేసు నమోదయింది. ఈ నేపథ్యంలో భూమన కరుణాకర్ రెడ్డికి బుధవారం అలిపిరి పోలీసులు 41 ఏ నోటీసులు జారీ చేశారు. గురువారం తిరుపతి డీఎస్పీ కార్యాలయానికి హాజరు కావాలంటూ జారీ చేసిన నోటీసుల్లో భూమనకు స్పష్టం చేశారు.

అయితే కొద్ది రోజుల పాటు తాను బిజీగా ఉంటానని ఈ సందర్భంగా పోలీసులకు ఆయన స్పష్టం చేశారు. వీలు చూసుకుని రావాలంటూ భూమనకు ఎస్ఐ అజిత సూచించారు. వచ్చే మంగళవారం అంటే.. సెప్టెంబర్ 23వ తేదీన తాను ఈ విచారణకు హాజరవుతానని పోలీసులకు భూమన కరుణాకర్ రెడ్డి స్పష్టం చేసినట్లు తెలుస్తుంది.

తిరుపతిలోని అలిపిరి సమీపంలోని ఒక విగ్రహం నిర్లక్ష్యానికి గురైందంటూ ఆయన ఇటీవల తీవ్ర విమర్శలు చేశారు. భూమన వ్యాఖ్యలు శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బ తీసే విధంగా ఉందంటూ విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంపై డిప్యూటీ ఈవో గోవిందరాజు అలిపిరి పోలీసులను ఆశ్రయించారు. దీంతో భూమన కరుణాకర్ రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ క్రమంలో ఆయనకు అలిపిరి పోలీసులు నోటీసులు జారీ చేశారు.

మరోవైపు టీటీడీపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం టీటీడీ పాలక మండలి సమావేశమైంది. ఈ సందర్భంగా ఈ అంశంపై చర్చ జరిగింది. టీటీడీపై దుష్ప్రచారానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామంటూ ఆ ధార్మిక సంస్థ చైర్మన్ బీఆర్ నాయుడు హెచ్చరించారు.

## బిజెపి నేతృత్వంలో రక్తదాన శిబిరం




**మైదుకూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** దేశాధినేత ప్రధానమంత్రి మోడీ పుట్టిన రోజు సందర్భంగా మైదుకూరు నియోజకవర్గం బిజెపి కన్వీనర్ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో మైదుకూరు ప్రాథమిక ఆరోగ్య రక్త నిల్వ కేంద్రం వారు బిజెపి కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మోడీ జన్మదిన సందర్భంగా నియోజకవర్గ కన్వీనర్ మాచనూరు సుబ్బరాయుడు రక్తదానాన్ని చేశారు. స్వచ్ఛందంగా బిజెపి నాయకులు కార్యకర్తలు ప్రజలు రక్తదానంలో పాల్గొన్నారు... ఈ సందర్భంగా ప్రధానమంత్రి మోడీకి 75వ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

# బిఆర్ఎస్ తెలంగాణలో ఉండదు

## కాంగ్రెస్ సీనియర్ నేత సామ రాంమోహన్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 17(జర్నలిస్ట్‌ఫైల్):** బిఆర్ఎస్ పార్టీ ఇంకా తెలంగాణలో నిలబడదని కాంగ్రెస్ సీనియర్ నేత సామరాంమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. బిఆర్ఎస్‌ను కబ్జా చేసేందుకు హరీష్ రావు కుట్ర చేస్తున్నారన్నారు. కెటిఆర్‌ను నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో జోనల్ ఆఫీసుకి పంపించే ప్రయత్నం జరుగుతుందన్నారు. జోనల్ ఆఫీసు కర్ణాటకలో ఉందని, ఈడి కేసులో హీరోయిన్ కెటిఆర్ మీద ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా కెటిఆర్‌ను జైలుకు పంపే ప్రయత్నం హరీష్‌రావు చేస్తున్నారని అన్నారు. కెసిఆర్ కుటుంబంలో ఇప్పటికే ఒకరు బయటకి వెళ్లిపోయారని అన్నారు.బిఆర్ఎస్ నాకౌట్ మ్యాచ్‌లో జరుగుతున్న ఇంట్రెస్టింగ్ పోరులో టర్నింగ్ పాయింట్ కెటిఆర్ ఇష్యు అన్నారు. బిజెపి తాడు పట్టుకొని కెటిఆర్‌ను ఇరికించే ప్రయత్నం హరీష్ రావు చేస్తున్నారని అన్నారు.

# కాంగ్రెస్‌లో చేరిన ఆదిలాబాద్‌జిల్లా నాయకులు

## పార్టీలోకి ఆహ్వానించిన మహేష్‌కుమార్ గౌడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 17(జర్నలిస్ట్‌ఫైల్):** ఆదిలాబాద్ జిల్లాకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఘర్ వాపసి షురూ అంటూ టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు ఆదిలాబాద్ నాయకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదిలాబాద్ మాజీ డిసిసి అధ్యక్షులు సాజిద్ ఖాన్, మాజీ టిపిసిసి ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సంజీవరెడ్డిలుపార్టీలో చేరారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇటీవల టిపిసిసి కార్యవర్గ సమావేశంలో పార్టీని వీడిన కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరిగి కాంగ్రెస్‌లో చేరాలని ఉప ముఖ్యమంత్రి భట్టి ప్రతిపాదనను కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేసిన విషయం తెలిసిందే.

# నేడు తెలంగాణ ప్రజలు విముక్తిపొందిన రోజు

## మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్

**హైదరాబాద్, సెప్టెంబరు 17(జర్నలిస్ట్‌ఫైల్):** సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజలు విముక్తి పొందిన రోజు అని ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. సెప్టెంబర్ 17న దేశ ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా కోట్లాదిమంది ప్రజలు అనేకరకాల కార్యక్రమాలు చేస్తున్నారని అన్నారు. మోడీ నాయకత్వంలో గుజరాత్ గొప్పగా అభివృద్ధి చెందిందని, వారి నాయకత్వంలో ప్రపంచ చిత్రపటం మీద భారత జాతి గౌరవం, ఔన్నత్యం గొప్పగా పెరిగిందన్నారు. పేద దేశంగా ముద్ర ఉన్న భారత్ మోడీ నాయకత్వంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. రాబోయే కాలంలో మోడీ మరింత ఆరోగ్యంగా ఉండి, దేశాన్ని మరింత వేగంగా అభివృద్ధి చేయాలని మనస్ఫూర్తిగా కొరుకుంటున్నానని ఎంపి ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

# భర్తపై వేడి నూనె పోసిన భార్య

## చికిత్స పొందుతూ మరణించిన వెంకటేష్

**మల్దకల్, సెప్టెంబరు 17(జర్నలిస్ట్‌ఫైల్):** కుటుంబ తగాదాలే కారణంగా భర్తపై వేడి నూనె పోసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. మల్దకల్ ఎస్సై నందికర్ తెలిపిన వివరాల ప్రకారం జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం, మల్లెందొడ్డి గ్రామంలో నిద్రిస్తున్న భర్త వెంకటేష్‌పై భార్య పద్మ వేడినూనే పోసింది. గత 8 సంవత్సరాల క్రితం వెంకటేశ్ పద్మలకి వివాహం జరిగింది. వారికి ముగ్గురుపిల్లలు ఉన్నారు.వివాహం అనంతరం భార్య,భర్తలు తరుచుగా గొడవ పడేవారని అందులో భాగంగా ఈ నెల 11వ తేది ఉదయం 5గంటల సమయంలో నిద్రిస్తున్న భర్త వెంకటేష్ పై భార్య పద్మ వేడి నూనె పోసింది. వెంకటేష్‌కు తీవ్ర గాయాలు కాగా గద్వాల ఆసుపత్రి తరలించగా పరిస్థితి విషమించడంతో డాక్టర్లు కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు.అక్కడ చికిత్స పొందుతు సోమవారం సాయంత్రం వెంకటేష్ మరణించాడన్నారు. ఈనెల 11వ తేదిన సంఘటన జరిగిన రోజు భార్య పద్మను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం పద్మను రిమాండ్‌కు తరలించడం జరిగిందని మల్దకల్ ఎస్ఐ నందికర్ తెలిపారు.

# జిఎస్‌టి తగ్గింపుతో ఆర్థిక వ్యవస్థకు భారీ సంస్కరణలు

## మాజీ ఎంపి సయ్యద్ జాఫర్ ఇస్లాం



**హైదరాబాద్, సెప్టెంబరు 17(జర్నలిస్ట్‌ఫైల్):** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జిఎస్‌టి రేట్లను తగ్గించడం ద్వారా ప్రజలకు, వ్యాపారులకు, దేశ ఆర్థిక వ్యవస్థకు భారీ సంస్కరణను తీసుకొచ్చారని మాజీ ఎంపి సయ్యద్ జాఫర్ ఇస్లాం అన్నారు. మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో మాట్లాడారు. యుపిఏ పాలనలో రాష్ట్రాలు, కేంద్రానికి వేర్వేరు రేట్లు ఉండేవి -వ్యాట్, ఆక్ట్రాయ్, ఎంట్రీ టాక్స్, ఇతర అనేక పరోక్ష పన్నులు ఉం డేవని అన్నారు. ఇవి చాలా గందరగోళాన్ని, సంక్లిష్టతను కలిగించేవని, మోడీ ప్రభుత్వంలోని జిఎస్‌టి సంస్కరణల ద్వారా అత్యవసర వస్తువులకు జీరో శాతం పన్ను వర్తించనుందని, 28 శాతం జిఎస్‌టి పరిధిలో ఉన్న వస్తువులు 18శాతం, 12శాతం వస్తువులు 5శాతం, లేదా జీరో శాతంలోకి తగ్గించబడ్డా యన్నారు. దీని ద్వారా మధ్యతరగతి కుటుంబాలు, సామాన్య ప్రజలకు ఉపశమనం కలుగుతుందన్నారు.




ధర్నాలో నిరసన తెలుపుతున్న నీట్ 2025 విద్యార్థులు

# జిఓ 33ని సవరించాలి

## నీట్-2025 విద్యార్థుల డిమాండ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), సెప్టెంబరు 17(జర్నలిస్ట్‌ఫైల్):** నీట్ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 33ను సవరించి, తెలంగాణ నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలని నీట్ విద్యార్థులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ధర్నాచౌక్ వద్ద నీట్ 2025లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులు తమకు మెడికల్ కౌన్సిలింగ్‌లో పాల్గొనే అవకాశం కల్పించాలని కోరుతూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాలు, జీవో నెంబర్ 33 ప్రకారం కేవలం ఇంటర్ వేరే ప్రాంతంలో చదివారనే కారణంతో, తెలంగాణలో పుట్టి, పదవ తరగతి వరకు ఇక్కడే చదివిన విద్యార్థులను స్థానికులుగా పరిగణించబడరు అంటూ కౌన్సిలింగ్‌కు అనుమతించకపోవటం అన్యాయమన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసే సమయంలో మార్పులు, చేర్పులు చేసుకునే పూర్తి స్వేచ్ఛ తెలంగాణ ప్రభుత్వానికి ఇచ్చిందని గుర్తుచేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి, రాష్ట్రమంత్రులు నీట్ 2025 విద్యార్థుల సమస్యపై స్పందించి, తక్షణమే న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నీట్ 2025 విద్యార్థులు, తల్లి తండ్రులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# ఫీజులు, స్కాలర్‌షిప్‌లు చెల్లించే వరకు ఉద్యమాలు

## ముఖ్యమంత్రికి ఎంపి ఆర్.కృష్ణయ్య లేఖ

**హైదరాబాద్, సెప్టెంబరు 17(జర్నలిస్ట్‌ఫైల్):** ఫీజులు రియంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని రాష్ట్రంలోని మొత్తం కాలేజీలు ఇచ్చిన బంద్ పిలుపును విరమించు కోవడం పట్ల బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హర్షం వ్యక్తం చేశారు. దీనివలన విద్యార్థుల చదువు వాతావరణం దెబ్బతినకుండా కాపాడినందుకు అభినందిస్తున్నామని, అయితే బకాయిలు కేవలం 600 కోట్లు చెల్లిస్తామని ప్రకటించడం సరికాదన్నారు. మొత్తం బకాయిలు 8వేల కోట్లు ఉంటే 600 కోట్లు ఏ మూలకు సరిపోతాయని ప్రశ్నించారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించాలంటే మొత్తం బకాయిలు చెల్లిస్తే శాశ్వత పరిష్కారం లభిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.

# తిరుమలగిరిలో 3వేల మంది అనర్హులు

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మంగళవారం సచివాలయంలో నాగార్జునసాగర్ నియోజకవర్గ భూసమస్యలపై సమీక్షిస్తున్న మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,సెప్టెంబరు 17(జర్నలిస్ట్‌ఫైల్):** పేద ప్రజలు దశాబ్దాల కాలంగా సాగు చేసుకుంటున్న భూములపై వారికి హక్కులు కల్పించే విషయంలో మానవీయ కోణంలో ఆలోచన చేయాలని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు. సచివాలయంలో మంగళవారం నాగార్జున సాగర్ నియోజకవర్గంలో భూ సమస్యలపై అటవీ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలను సాకుగా చూపించి జటిలం చేయొద్దని అటవీశాఖ అధికారులకు సూచించారు. నాగార్జున సాగర్ నియోజకవర్గంలో 40 నుంచి 50 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్న భూములపై గిరిజనులకు హక్కులు, కల్పించడానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, ఐతే నిబంధనలు చూపుతూ ఆ భూములు అటవీ శాఖకు చెందినవని అధికారులు కొర్రీ వేస్తున్నారన్నారు. ఈ అంశంపై రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాలు సమన్వయంతో పని చేసి వీలైనంత త్వరగా పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలన్నారు.భూ భారతి పైలట్ ప్రాజెక్టులో భాగంగా నాగార్జున సాగర్ అసెంబ్లీ నియోజకవర్గం లోని తిరుమలగిరి మండలాన్ని ఎంపిక చేసి ప్రయోగాత్మకంగా సర్వే నిర్వహించినట్లు మంత్రి పొంగులేటి చెప్పారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ కోసం 235 సర్వే నెంబర్లను ఎంపిక చేశామన్నారు.. మొత్తం 23 వేల ఎకరాలో సర్వే నిర్వ హించగా, అందులో 12 వేల ఎకరాలు ప్రభుత్వ భూమిగా గుర్తించామన్నారు. ఇందులో 8 వేల ఎకరాలు సాగుకు అనుకూలంగా ఉన్నాయన్నారు. వాటిలో 4. వేల ఎకరాలు పాసు పుస్తకాలతో సాగులో ఉన్నాయని వివరించారు. మిగిలిన 4037 ఎకరాలకు సంబంధించి కొత్త పాసు పుస్తకాలు ఇవ్వవలసి ఉందన్నారు. ఈ సర్వేలో 2936 ఎకరాలకు సంబంధించి 3069 మంది వద్ద బోగస్ పాసు పుస్తకాలు ఉన్నట్లు గుర్తించి వారి పాసు పుస్తకాలను రద్దు చేశామని తెలిపారు. వీటికి రైతు భరోసా, రైతు బీమా తదితరాలను రద్దు చేశామన్నారు. సర్వేలో భాగంగా 7 వేల ఎకరాలు అటవీ భూమిని గుర్తించామని, ఈ భూములకు సంబంధించిన వివాదాలను వీలైనంత త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో మాజీ మంత్రి కె. జానా రెడ్డి, నాగార్జున సాగర్ శాసన సభ్యులు కె. జయవీర్ రెడ్డి, దేవరకొండ శాసనసభ్యులు బాలూ నాయక్, రెవెన్యూ శాఖ సెక్రటరీ డీఎస్ లోకేష్ కుమార్, పీసీసీఎస్ సి. సువర్ణ, నల్గొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి పాల్గొన్నారు.

# వృత్తి, ఉద్యోగాల్లో ఒత్తిడికి లోనవుతున్న మహిళలు: మంత్రి సీతక్క

**హైదరాబాద్,సెప్టెంబరు 17(జర్నలిస్ట్‌ఫైల్):** మహిళలకు ఎన్నో సవాళ్లుఉన్నాప్రభుత్వ ఉద్యోగంలో రాణిస్తున్నారని మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులుగా ఎన్నికైన మహిళలచే ప్రమాణస్వీకారం చేయించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళకు ఉద్యోగం అంటేనే అదనపు బాధ్యత ఒకవైపు కుటుంబ బాధ్యతలు మరొకవైపు వృత్తి బాధ్యతలు.రెండిటిని ఏకకాలంలో నెరవేర్చుతున్న మహిళా ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. కుటుంబ బాధ్యతలు, వృత్తి బాధ్యతల్లో మహిళలు నిత్యం ఒత్తిడిలకు లోన్ అవుతుంటారు కానీ ఆ ఒత్తిడిలను అధిగమించి రాణిస్తున్న మహిళలు తమ ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా ఫ్యామిలీ బారాన్ని మోస్తూ ఉద్యోగాలు చేస్తున్నారన్నారు.భర్త సహకారం ఉన్న మహిళా ఉద్యోగులు అదృష్టవంతులు అత్తమామలు,భర్త, పిల్లల బాధ్యతలుసునాయాసంగా మోయగలరన్నారు.

భూదేవికి ఉన్నంత ఓపిక మహిళలకు ఉన్నందున కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉందన్నారు. అన్ని రంగాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సవాలను చర్చించేం దుకు ఈనెల 22న రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని, ఈ సమావేశానికి మహిళ ఉద్యోగులను ఆహ్వానిస్తున్నా మన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో వచ్చే అభిప్రాయాలను బట్టి నూతన పాలసీ తీసుకొస్తామని, ఉచిత బస్సు ప్రయాణం మీద తప్పుడు ప్రచారం చేస్తున్నా రన్నారు. మహిళల ప్రతిభను బయటికి రాకుండా చేసేందుకు గొడవలను భూతద్దంలో పెట్టి చూయిస్తున్నారన్న మంత్రి సీతక్క మహిళలు ఐక్యత సాధిస్తే అన్ని సాధించినట్లుతెలంగాణలో మహిళా స్వయం సహాయక బృందాలు అద్భు తాలు సృష్టిస్తున్నట్లు తెలిపారు.పెట్రోల్ బంకుల ఏర్పాటు ద్వారా లక్షల రూపాయలు సంపాదిస్తు న్నారని మహిళా ఉద్యోగులకు మా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

ఎలాంటి సమస్యలు ఉన్న నేరుగా మాతో చెప్పుకోవచ్చు తెలంగాణ ప్రభుత్వ గౌరవాన్ని కాపాడే విధంగా మహిళా ఉద్యోగులు పనిచేసే ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు.

# డ్రగ్స్ కెమికల్స్‌ను గుర్తించడానికి ఎక్సైజ్ టీమ్‌లకు శిక్షణ

## డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్తిక్ చెతన్య

**హైదరాబాద్,సెప్టెంబరు 17(జర్నలిస్ట్‌ఫైల్):** గంజాయి ,డ్రగ్స్ తనిఖీలకు వెళ్లినపుడు ప్రత్యక్షంగా పట్టుకోవడంతోపాటు సింథటిక్ డ్రగ్స్, ఆల్ప్రోజోలం, కెమికల్స్‌ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌టీమ్‌లు తనిఖీలు నిర్వహించినపుడు చాల విషయాలను గుర్తుకు పెట్టుకోవాలని ఎక్స్‌ఫర్ట్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్. కార్తిక్ చెతన్య అన్నారు.ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం ఎక్సైజ్ శాఖ స్టేట్ టాస్క్‌ఫోర్స్ టీమ్‌లతోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్ టి ఎఫ్, డిటిఎఫ్ టీమ్‌లకు కెమికల్స్‌ను ఎలా గుర్తించడం అనే విషయంపై అవగహన సమావేశాన్ని నిర్వహించారు.ఆదివారం నాచారం, చర్లపల్లి ప్రాంతాల్లో డ్రగ్స్ తయారీకి వినియోగించే మెపెడ్రెన్‌ను పట్టుకున్నారు. అదే విధంగా ఒక పాఠశాలలో ఆల్ప్రోజోలం తయారీ విషయం వెలుగులోకి వచ్చింది. ఇటువంటి సమయాల్లో తనిఖీలకు టాస్క్ ఫోర్స్ ఎక్సైజ్‌శాఖ వెళ్లినప్పుడు యంత్రాంగం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాన్ని పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

తనిఖీల్లో ప్రధానంగా ఎక్సైజ్ శాఖ టీమ్‌లు వెళ్లినపుడు పెంటనీల్, ఆల్ప్రోజలం, డ్రగ్స్ మెఫెడ్రోన్ , సిం థటిక్ డ్రగ్స్ తయారీపై యూనిట్ల వద్దకు వెళ్లినపుడు ముందు కమికల్స్ మిలితం కోసం తయారుచేసిన లేదా రాసిన నోట్స్‌ను, మ్యాపులను, అక్కడ ఉన్న కెమికల్స్‌ను, తయారీ యంత్రాలను స్వాధీనం చేసుకోవాలన్నారు.అనంతరం సంబంధిత నిందితులు ఏ రకమైన డ్రగ్స్ తయారీ చేస్తున్నాడనే విషయం కోసం స్థానికంగా ఉన్న కెమికల్స్ వివరాలను గుగూల్‌లో పబ్ చామ్, ఎంఎస్‌డిఎస్ లాంటి సైట్లలో సమాచారం పక్కా విషయాన్ని తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు.ఈ మాత్రం జాగ్రత్తలు తీసుకుంటే కేసులను బాగా చేయడంతో పాటు నిందితులను వట్టుకోవచ్చున్నారు.ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా అడిషనల్ కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషి, అసిస్టెంట్ కమిషనర్లు ప్రణవీ, అనిల్ కుమార్‌రెడ్డి, ఆర్.కిషన్, జి .శ్రీనివాసరెడ్డి, అడిషనర్ ఎస్పీ వెంకటేశ్వర బాబు, ఎస్ టి ఎఫ్ డీఎస్పీలు తుల శ్రీనివాసరావు, తిరుపతి యాదవ్,ఈఎస్‌లు ప్రదీప్‌రావు, నవీన్, ఉజ్వలరెడ్డిలు పాల్గన్నారు.

# అటవీ అధికారులపై దాడులు చేస్తే పిడి యాక్టు

## అటవీ శాఖ అసోసియేషన్ సమావేశంలో మంత్రి సురేఖ

**హైదరాబాద్,సెప్టెంబరు 17(జర్నలిస్ట్‌ఫైల్):** అటవీ అధికారులపై దాడులు చేస్తే పీడీ యాక్టులు పెడతామని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. మంగళవారం తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర అటవీశాఖ అధికారుల అసోసియేషన్ సంఘాలతో మంత్రి సురేఖ, ప్రిన్స్ పల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ, సునీత భగవత్, తదితరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ అధికారుల సంఘాల నాయకుల తమ సమస్యలు చెప్పుకున్నారు. అనంతరం మంత్రి సురేఖ మాట్లాడుతూ తాను ఫారెస్టు సిబ్బందికి ఒక అక్కగా అండగా ఉంటానని చెప్పారు. ఫారెస్టు ఉద్యోగుల సమస్యలు వినేందుకు తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. చిన్న చిన్న విషయాలు శాఖపరంగా మనమే పరిష్కరించుకుందామన్నారు.కీలక అంశాలు సిఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిదామన్నారు. మనమంతా ఒక ఫ్యామిలీ అని మంత్రి కొండా సురేఖ గుర్తు చేశారు.ఎందుకంటే,అటవీ శాఖకు, ఫారెస్టు ఉద్యోగులే ఫ్రంట్ రన్నర్స్‌ని అలాంటి ఉద్యోగుల కోసం పని చేయడం తన బాధ్యత అన్నారు.పోలీసులకు ఎటువంటి జీత భత్యాలు ఇస్తున్నారో. అటవీ అధికారులకు అంతే స్థాయిలో ఇచ్చేందుకు తాను ప్రత్యేకంగా కృషి చేస్తానన్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అటవీ అధికారులకు అవార్డులు ఇచ్చేవారని రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఈఅవార్డులు ఇవ్వడం ఆపేశారని మంత్రి సురేఖ గుర్తుచేశారు.అయితే, ఇటీవల జరిగిన అటవీశాఖ రివ్యూలో సీఎం దృష్టికి తీసుకెళితే ఆయన సుముఖత వ్యక్తం చేసిన విషయాన్ని మంత్రి సమావేశంలో ప్రస్తావించగా ఫారెస్ట్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫారెస్టు ఉద్యోగులు మహారాష్ట్ర మాదిరి అటవీ భూములను అన్యాక్రాంతం చేసేవాళ్ళను కఠిన చట్టాలతో శిక్షించాలని, అటవీశాఖ బీట్ అధికారుల నియామకం వెంటనే చేపట్టాలని,ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్‌లను జోన్ పోస్టును డిస్ట్రిక్ లెవల్ పోస్టుగా చేయాల న్నారు.క్షేత్రస్థాయిలో పర్యటించేందుకు బీట్, సెక్షన్, డీఆర్‌ఓలకు ద్విచక్రవాహనాలు ఇవ్వాలని, ఫారెస్టు ఏరియాలో పని చేసే అధికారులను మూడు సంవత్సరాలకు ఒకసారైన కౌన్సిలింగ్ ద్వారా 100 శాతం బదిలీలు జరపాలని,ప్రతి జిల్లాకు రెండు, మూడు ఫారెస్టు స్టేషన్లు ఏర్పాటు చేయాలన్నారు.

# కర్ణాటకలో బంగారం, రాగి అన్వేషణకు సింగరేణికి లైసెన్స్

## కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి నుండి లైసెన్స్ పత్రాలు స్వీకరించిన సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్

**గోదావరిఖని,17(జర్నలిస్ట్‌ఫైల్):**సింగరేణి సంస్థ కర్ణాటక రాష్ట్రంలోని దేవదుర్గ ప్రాంతంలో బంగారం, రాగి ఖనిజాల అన్వేషణ చేయడానికి అనుమతిస్తూ జారీచేసిన లైసెన్సులను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ కు అందజేశారు. మంగళవారం హైదరాబాద్ లోని టీ హాబ్ లో కేంద్ర గనుల శాఖ ఆధ్వర్యంలో జరిగిన కీలక ఖనిజాల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సెమినార్ లో వీటిని అందజేశారు. గత మార్చి నెలలో కేంద్ర గనుల శాఖ నిర్వహించిన కీలక ఖనిజాల వేలంపాటలో సింగరేణి సంస్థ పాల్గొని 37.75 శాతం రాయల్టీతో కర్ణాటక రాష్ట్రంలోని దేవదుర్గ ప్రాంతంలో 199 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో గల బంగారం, రాగి ఖనిజాల అన్వేషణ పనిని




దక్కించుకుంది. దీనికి సంబంధించిన లైసెన్సు, సర్టిఫికెట్లను మంగళవారం కేంద్ర మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ కీలక ఖనిజ రంగంలో భారతదేశాన్ని స్వయం సమృద్ధిగా మార్చడం కోసం ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు కృషి చేయాలన్నారు. దేశంలో కీలక ఖనిజ రంగం అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 32 వేల కోట్ల రూపాయలను కేటాయించిందన్నారు. కీలక ఖనిజాల అన్వేషణకు వేలంపాటలో విజేతలైన వారికి ఆయన అభినందనలు తెలియజేశారు. వెంటనే అన్వేషణ పనులు ప్రారంభించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సింగరేణి సీఎండీ తో పాటు తెలంగాణ రాష్ట్ర డిపార్ట్మెంట్ ఆఫ్ మైన్స్ అండ్ జియాలజీ శాఖ డైరెక్టర్ వల్లూరు క్రాంతి, సింగరేణి డైరెక్టర్ (పి.పి) కె.వెం కటేశ్వర్లు, జనరల్ మేనేజర్ కోఆర్డినేషన్ మార్కె టింగ్ తాడబోయిన శ్రీనివాస్, జనరల్ మేనేజర్ ఎక్స్ప్లోరేషన్ శ్రీనివాసరావు, జనరల్ మేనేజర్ ఆర్ అండ్ డి కనకయ్య పాల్గొన్నారు.

# ఆచార్య జివిఎస్ తరతరాలకు స్ఫూర్తి: రమణాచారి

**హైదరాబాద్ (నాంపల్లి), సెప్టెంబరు 17(జర్నలిస్ట్‌ఫైల్):** ఆచార్య జీవిఎస్‌గా ప్రసిద్ధి చెందిన గూడ వెంకట సుబ్రహ్మణ్యం సంగీత సాహిత్య నృత్యరంగాల్లో విశేషకృషి చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి నాటి నేటి రానున్న తరాలకు స్ఫూర్తి, మార్గనిర్దేశి అని విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. జీవిఎస్ పండితుడు, సాహిత్య విమర్శకుడు, కవి, రచయిత, తెలుగు సాహిత్యం, విమర్శలకు గణనీయమైన కృషిచేశారని, ముఖ్యంగా సాహితీరంగంలో విమర్శకునిగా చెరగని ముద్రవేశారని తెలిపారు. నన్నయ్య నుంచి ప్రఖ్యాత కవులైన సినారె, శివారెడ్డిల వరకు తెలుగు కవుల సాహితీ ప్రక్రియల స్వరూప స్వభావాలను విశ్లేషిస్తూ రచించిన సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలన్న వ్యాస పరంపర జీవిఎస్‌కు విశేష ఖ్యాతిని ఆర్జించిపెట్టిందని గుర్తుచేశారు. ఆయన పేరున ప్రతీ సంవత్సరం ప్రముఖులకు పురస్కారాలు అందించడం హర్షదా యకమన్నారు. తెలుగు విశ్వవిద్యాలయంలో మంగళవారంరాత్రి శ్రీసౌమ్య వారణాసి నిర్వహణ లో ఇన్సూరెన్స్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆఫ్ ఇండియా సీఈఓ వెంకట్ చంగవల్లి సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి డా. కె.వి.రమణాచారి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. విశిష్ట అతి థులు ప్రాచార్య శలాక రఘునాథశర్మ, ఎల్. కాళిదాస్ వెంకటరం గా రావు, డా. ముక్తేవి భారతి, ఆచార్య టి.గౌరీ శంకర్, ఆచార్య వై.రెడ్డి శ్యామల తదితరులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి ఎల్. వి. సుబ్రహ్మణ్యంను ఘనంగా సత్కరించారు. తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షురాలు డా. ఆవుల మంజులతనుసత్కరించి సుశీల సుబ్రహ్మణ్యం సారస్వత పురస్కారం ప్రదానంచేసి శుభాభినందనలు తెలిపారు.సభకుముందు శ్రీసౌమ్య వారణాసి, విద్యార్థులచే నిర్వహించిన సంగీత కార్యక్రమం ప్రేక్షకులను తన్మయుల్ని చేసింది.



సాహితీ పురస్కారంతోఎల్.వి.సుబ్రహ్మణ్యంను,సారస్వత పురస్కారంతో సత్కరిస్తున్న రమణాచారి, రఘునాథశర్మ, గౌరీశంకర్, శ్రీసౌమ్య తదితర అతిథులు



మంగళవారం ఎంజిబిఎస్ వద్ద పాస్‌పోర్టు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్. చిత్రంలో మేయర్ విజయలక్ష్మి,ఎంపి అసదుద్దీన్ ఓవైసి తదితరులు

# పాస్‌పోర్టు కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి పొన్నం

**హైదరాబాద్ (గోషామహల్), సెప్టెంబరు 17(జర్నలిస్ట్‌ఫైల్):** మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో ఆధునీకరించిన నూతన పాస్‌పోర్టు కార్యాలయాన్ని హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఓవైసీ,గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి,రాజ్యసభ్యులు మందడి అనిల్‌కుమార్‌యాదవ్,పాస్‌పోర్టు జాయింట్ సెక్రటరీ కెజె శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరి చందన,రీజినల్ పాస్‌పోర్టు అధికారి స్నేహజతో కలిసి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు.అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన పాస్‌పోర్టు కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలోనే మొట్ట మొదటిసారిగా మెట్రోరైల్ స్టేషన్‌లో ప్రారంభించినట్లు తెలిపారు.పాస్‌పోర్టు కార్యాలయానికి వచ్చే ఉద్యోగులు పాస్ పోర్టు ధరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు.తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ పాస్ పోర్టు కార్యాలయం దేశంలోనే ఐదవ స్థానంలో ఉందన్నారు. తెలంగాణలో 5 పాస్ పోర్ట్ కేంద్రాలు ఉన్నట్లు వివరించారు. ఎంజిబిఎస్, టొలిచౌకి, బేగంపేట్, నిజామాబాద్, కరీంనగర్‌లో ఉన్నట్లు చెప్పారు. తెలంగాణలో రోజుకు 4500 పాస్‌పోర్టులు ఇచ్చే సామర్థ్యం ఉందన్నారు. 7500 స్లాట్స్ ఉన్నట్లుచెప్పారు.దీనికి 1200 స్లాట్స్ చేసుకోవాలన్నారు.తాను ఎంపిగా ఉన్నప్పుడు కరీంనగర్‌లో ప్రారంభించుకున్న పాస్‌పోర్టు కేంద్రంలో 250 నుంచి 500 స్లాట్స్ పెంచుకోవాలని కోరారు.



# సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపిన ప్రమాద బాధితుడు రాహుల్ కుటుంబం

**(జర్నలిస్ట్‌ఫైల్)ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,సెప్టెంబరు 17:** ప్రమాద బాధితుడు గుండేటి రాహుల్ కుటుంబంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్ జిల్లా దామెర మండలం, పులకుర్తి గ్రామానికి చెందిన గుండేటి రాహుల్ ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయారు. రాహుల్ కు సీఎం సహాయనిధి ద్వారా చికిత్స అందించి, కృత్రిమ కాళ్లను అమర్చేందుకు ప్రభుత్వం సాయం చేసింది. నవంబర్ 2, 2024న రైలులోరాజస్థాన్ వెళుతున్న రాహుల్‌ను కొందరు దుండగులు రైల్లో నుంచి తోసేశారు. ఈ ఘటనలో రెండు కాళ్లు కోల్పోయిన రాహుల్ కు కృత్రిమ కాళ్లు అమర్చేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకం అందించింది. తను మళ్లీ నడవగలిగేందుకు సహకారం అందించిన ముఖ్యమంత్రికి కుటుంబంతో కలిసి రాహుల్ ధన్యవాదాలు తెలిపారు.




ప్రసంగిస్తున్న హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

# సెప్టెంబరు 17-చరిత్రాత్మకం

## తెలంగాణ ప్రజలు బానిసత్వం నుంచి బయటకి వచ్చినరోజు

## హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

**హైదరాబాద్, సెప్టెంబరు 17(జర్నలిస్ట్‌ఫైల్):**సెప్టెంబరు 17 హైదరాబాద్ విమోచన దినోత్సవం చారిత్రత్మకమైందని, ఇంటింట ప్రతి ఒక్కరూ ఈ దినోత్సవాన్ని ఉత్సవంగా జరుపుకోవాలని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పిలుపునిచ్చారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆధ్వర్యంలో హైదరాబాద్ విమోచన దినోత్సవంపై పాడూరి కరుణ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున హైదరాబాద్లో జాతీయ జెండాను కూడా ఎగురవేయలేదన్నారు. సర్ధార్ వల్లాభాయ్ పటేల్ నిజాం సంస్థానాన్ని విలీనం చేశారని అన్నారు. తెలంగాణ ప్రజలు బానిసత్వం నుంచి బయటకి వచ్చింది సెప్టెంబర్ 17నఅని కాబట్టి ఈ రోజును విమోచన దినోత్సవంగా బావించాలని అన్నారు. ప్రభుత్వం కూడా విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలని ఈ చరిత్రను పాఠ్యా పుస్తకాలలో చేర్చి భావితరాలకు అందించాలని కోరారు. మహారాష్ట్ర మాజీ గవర్నర్ సిహెచ్ విద్యా సాగర్ రావు మాట్లాడుతూ నిజాం అరాచకాలు చెప్పాలంటే గంటలు కూడా చాలవని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ డాక్టర్ వకులభరణం కృష్ణమోహన్ రావు, మాజీ విసీ ప్రొఫెసర్ తిరుపతిరావు, ప్రొఫెసర్ మురళి మనోహర్, ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకట్రెడ్డి, బీజేపీనాయకులు డాక్టర్ మనోహర్రెడ్డి, స్వాతంత్ర సమర యోధుడు విట్టల్ రావు ఆర్య, పాశం యాదగిరి, జాతీయ సాఫాయి కర్మచారి కమిషన్ మాజీ సభ్యులు చింత సాంబ మూర్తి, జర్నలిస్ట్ కప్పర ప్రసాద్, ఉప్పల శారద తదితరులు పాల్గొన్నారు.

# హెచ్‌సిఏ అక్రమాలపై విచారణ కమిటీ వేయండి

## బీసీసీఐకి టీడీసిఏ అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి లేఖ

**హైదరాబాద్, సెప్టెంబరు 17(జర్నలిస్ట్‌ఫైల్):** 2005 నుంచి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలను నిగ్గు తేల్చేందుకు ఉన్నతస్థాయి విచారణ కమిటీ వేయాలని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)ని తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి కోరారు. గత 90 ఏండ్లుగా తెలంగాణ జిల్లాల క్రికెటర్లకు తీరన అన్యాయం జరుగుతోందని, గ్రామీణ క్రికెటర్లకు అవకాశాలు కల్పించేందుకు అన్ని జిల్లాలకు, క్రికెట్ క్లబ్‌లకు సభ్యత్వం ఇచ్చేలా హెచ్‌సీఏను ఆదేశించాలని అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బీసీసీఐ కార్యదర్శి దేవాజిత్ సైకియాకు రాసిన లేఖను మంగళవారం ఈమెయిల్ చేశారు. ఈసందర్భంగా తెలంగాణలో 31 గ్రామీణ జిల్లాలకు కలిపి 300 క్లబ్‌లకు సభ్యత్వంఇచ్చేలా హెచ్‌సీఏను ఆదేశించాలని, బీసీసీఐ అందించే నిధుల్లో 50 శాతం గ్రామీణ క్రికెట్ అభివృద్ధికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే బీసీసీఐ దేశవాళీ టోర్నమెంట్లలో గ్రామీణ క్రికెటర్లు పోటీపడేలా టీడీసీఏకుసహకారం అందించాలి. అవినీతి, అక్రమాలకు పాల్పడిన హెచ్‌సీఏ ఆఫీస్‌బేరర్లపై జీవితకాల నిషేధం విధించాలే కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి లేఖలో పేర్కొన్నారు.





## నిరుద్యోగులకు వరం 'ఐబిఎం స్కిల్ బిల్డ్'

**విజయవాడ పశ్చిమ, సెప్టెంబరు 17(జర్నలిస్ట్‌ఫైల్):**

ఉపాధి అవకాశాల కోసం ప్రయత్నించే నిరుద్యోగులకు ఐబిఎం స్కిల్ బిల్డ్ ప్రోగ్రాం వరం లాంటిదని స్కిల్ బిల్డ్ ట్రైనర్ నరేంద్ర అన్నారు. కెబిఎన్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో ఐబిఎం స్కిల్ బిల్డ్ ప్రోగ్రాం జరిగింది. రిసోర్స్ పర్సన్ గా పాల్గొన్న నరేంద్ర మాట్లాడుతూ ఉద్యోగం చేస్తున్న యువత కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడానికి, చిన్న వ్యాపారులు, స్టార్టప్ స్థాపకుల అవకాశాలు మెరుగుపరచటానికి స్కిల్ బిల్డ్ ప్రోగ్రాం ఎంతో ఉపయోగిస్తుందన్నారు. ఈ శిక్షణ పొందటం ద్వారా విద్యార్థుల్లో కమ్యూనికేషన్, లీడర్‌షిప్, డిజైన్ థింకింగ్, క్రిటికల్ థింకింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్ నైపుణ్యాలు పెరుగుతాయన్నారు. కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ అంశాల గురించి ఉదాహరణ పూర్వకంగా విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ 21వ శతాబ్దపు పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు శిక్షణ ఇవ్వటానికి స్కిల్ బిల్డ్ ప్రోగ్రాం ఉపయోగిస్తుందన్నారు. హిందూ హై స్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, పి.ఎల్.రమేష్, విభాగాధిపతి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రగ్బీ జిల్లా జట్టుకు ఎంపికైన ఉంగుటూరు విద్యార్థులు



**ఉంగుటూరు, సెప్టెంబర్ 17(జర్నలిస్ట్‌ఫైల్):**

కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం ఉంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రగ్బీ కృష్ణాజిల్లా జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని సిహెచ్ .అనిత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీన గన్నవరం బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి జట్టు కు క్రీడాకారుల ఎంపిక పోటీలు జరిగినట్లు చెప్పారు. ఈ పోటీలలో ఉంగుటూరు జిల్లా పరిషత్ పాఠశాల నుండి విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరచి ఉమ్మడి కృష్ణాజిల్లా జట్టుకు ఎంపికైనట్లు వివరించారు. రగ్బీ ఆటలో అండర్ 17 బాలుర విభాగంలో ఉంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న ఎస్ గణేష్ బాలికల విభాగంలో సిహెచ్ .విన్నీ, భవ్య శ్రీ జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. అండర్ 14 బాలుర విభాగంలో 8వ తరగతి చదువుతున్న డి. చేతన్ సింహ, 9వ తరగతి చదువుతున్న డి.తనుష్ కుమార్, బాలికల విభాగంలో ఎనిమిదవ తరగతి చదువుతున్న టీ ప్రవల్లిక బి రిషిత ఉమ్మడి కృష్ణాజిల్లా జట్టుకు ఆయా విభాగాలలో ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని తెలిపారు. అండర్ 17, అండర్ 14 బాల,బాలికల విభాగాలలో ఉంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ఉమ్మడి కృష్ణాజిల్లా రగ్బీ జట్టుకు ఎంపికైన విద్యార్థినీ, విద్యార్థులను వారికి శిక్షణ ఇచ్చిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుని క్రాంతిని పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ పులి శ్రీనివాసరావు,కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయుని సిహెచ్.అనిత, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థిని,విద్యార్థులు అభినందించారు.

## హిందీ భాష ఔన్నత్యాన్ని వివరించిన ఉపాధ్యాయులు



**ఆగిరిపల్లి, సెప్టెంబర్ 17(జర్నలిస్ట్‌ఫైల్):**

ఆగిరిపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ నందు మంగళవారం హిందీ దివస్ ఘనంగా జరిగింది. హిందీ భాష మన రాజ భాష అని దాని ఔన్నత్యాన్ని హిందీ భాషా ఉపాధ్యాయులు బి, కవితా బాయ్, రజిని గంధ బి, విజయలక్ష్మి పద్యాలు పాటలు కవితల రూపంలో చక్కగా వివరించారు. విద్యార్థులు అనేక రకాలైన బోధనోపకరణాలను చక్కగా తయారుచేసి హిందీ ఎగ్జిబిషన్ ప్రదర్శించారు. విద్యార్థులు పాటలు, గేయాలు,నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని పి,పుష్పలత, ఎస్ఎంసి చైర్మన్ ఆవుల నరేష్, కమిటీ సభ్యులు,ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## సమస్యలకు పరిష్కారం రక్తపాతాలేనా..?

**ఆగిరిపల్లి, సెప్టెంబర్ 17(జర్నలిస్ట్‌ఫైల్):**



ఏలూరు జిల్లా నూజివీడు మండలం మీర్జాపురం గ్రామంలో మిన్నకూరి సురేష్ అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు చెట్టుకు కట్టేసి విచక్షణారహితంగా కర్రలతో, రాళ్లతో దాడిచేసిన ఘటన వెలుగుచూసింది. మీర్జాపురం గ్రామంలో మెడికల్ షాప్ కి వెళ్ళి మందులు తిసుకుంటున్న సమయం లో సుమారు పదిమంది కలిసి కట్టుగా వచ్చి సురేష్ అనే వ్యక్తిపై కత్తులతో రాడ్లతో దాడికి పాల్పడి నట్లు బాధితుడు చెబుతున్నాడు. విషయం తెలుసుకున్న నూజివీడు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని చెట్టుకు కట్టేసి ఉన్న సురేష్ ను నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. తలకు బలమైన గాయాలు కావడంతో ఎమర్జెన్సీ వార్డుకు షిఫ్ట్ చేయడం జరిగింది. అసలు సురేష్ పై దాడి ఎందుకు చేశారు అనే విషయాన్ని గురించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### అంతరించిపోతున్న కళలను

# పరిరక్షించుకుంటూ 'విజయవాడ ఉత్సవ్'





- విజయవాడ ప్రాశస్త్యాన్ని ప్రపంచానికి చాటేలా విజయవాడ ఉత్సవ్ వేడుకలు
- మంత్రులు సత్యకుమార్ యాదవ్, కొలుసు పార్థసారధి, ఎంపీ కేశినేని శివనాథ్ వెల్లడి
- ఫెస్టివల్ ను విజయవంతం చేసేందుకు సహకారం అందిస్తామన్న ఎమ్మెల్యేలు, నగర ప్రముఖులు
- నగరంలోని ఫార్చ్యూన్ మురళి హోటల్లో విజయవాడ ఉత్సవ్ సన్నాహక సమావేశం
- విజయవాడ ఉత్సవాలను దిగ్విజయం చేయడంపై ప్రజాప్రతినిధుల చర్చలు

**విజయవాడ, సెప్టెంబర్ 17(జర్నలిస్ట్‌ఫైల్):**

దేశవ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా దసరా అంటే విజయవాడకు వెళ్లాలనిపించేలా విజయవాడ ఉత్సవ్ ఫెస్టివల్ నిర్వహిస్తామని, ఈ ఫెస్టివల్ ను విజయవంతం చేసేందుకు తమ వంతు సహకారం అందిస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, సమాచార శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. సోసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని ఫార్చ్యూన్ మురళి హోటల్లో మంగళవారం విజయవాడ ఉత్సవ్ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా మంత్రులతో పాటు పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య పాల్గొనగా, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ సభాధ్యక్షత వహించారు. విజయవాడ ఉత్సవ్ ను విజయవంతం చేసేందుకు ప్రజా ప్రతినిధులు, నగర ప్రముఖులు చర్చించారు. అలాగే సలహాలు , సూచనలు కూడా అందించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ కేక్ కట్ చేయగా ప్రజాప్రతినిధులు, నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ కళలకు, సాంస్కృతిక రంగానికి రాజధాని విజయవాడ నగరం,విజయవాడ నగరానికి విజయవాడ ఉత్సవ్ తో ఆ పునర్వైభవం తీసుకువచ్చే విధంగా అందరితో కలిసి కృషి చేస్తామన్నారు. వైసిపి నాయకులు కుళ్లు రాజకీయాలు చేస్తున్నారని, అవి ఏమీ చేయలేవన్నారు. , బెజవాడ ఖ్యాతిని ఖండఖండాలకు తెలియజేసేలా విజయవాడ ఉత్సవ్ ను నిర్వహిస్తామన్నారు. ఈ ఫెస్టివల్ నిర్వహిస్తే నగరంలో వ్యాపార వర్గాలు బాగుంటాయని,మనీ సర్క్యులేట్ అవుతుందన్నారు. విజయవాడ నగర ప్రముఖులతో కలిసి సోసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ సంస్థ నెలకొల్పినట్లు తెలిపారు. అందులో తాను కూడా ఒక సలహా సంఘ సభ్యుడ్ని అని చెప్పారు. ఇందుకోసం అందరూ సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. అందరూ అన్ని కమిటీలో వుండి ఈ భారీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. సమయం తక్కువగా వున్నప్పటికీ కలిసికట్టుగా వుండి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. . ప్రతి ఏడాది ఉమ్మడి కృష్ణాజిల్లాలో రెండు ఫెస్టివల్ జరగాలన్నారు బందరులో బీచ్ ఫెస్టివల్, విజయవాడ లో విజయవాడ ఉత్సవ్ అన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ విజయవాడ నగరాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు ఈ ఉత్సవాలు దోహదపడతాయన్నారు. ఈ ఏడాది మొదలు పెట్టిన ఈ చిన్న ప్రయత్నంతో విజయవాడ వైభవాన్ని ప్రపంచానికి విస్తరించేలా చేస్తామన్నారు. మైసూర్ తరహాలో విజయవాడ ఫెస్ట్ నిర్వహిస్తానన్నారు. ఈ జిల్లాకు ఇన్చార్జ్ మంత్రిగా ఉన్న సమయంలో తనకు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కల్పించడం సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఫెస్టివల్ విజయవంతం చేసేందుకు అన్ని విధాలుగా సహకరం అందిస్తానన్నారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ విజయవాడ ప్రాశస్త్యాన్ని ప్రపంచానికి చాటేలా ఈ వేడుకలు నిర్వహిస్తుండటం సంతోషకరమన్నారు.తెలుగు ప్రజలు, ముఖ్యంగా ఎన్టీఆర్, కృష్ణ జిల్లా ప్రజలు అంతట ఉన్నారన్నారు.దేశ వ్యాప్తంగా విజయవాడ కనక దుర్గమ్మకి పేరుందనీ, ఆంధ్ర రాష్ట్రాన్ని దేశంలో మొదటి స్థానంలో నిలిపేందుకు చంద్రబాబు పని చేస్తున్నారన్నారు.ప్రపంచ స్థాయి నగరాలతో అమరావతిని అభివృద్ధి చేసేలా చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారనీ వెల్లడించారు. విజయవాడ ఉత్సవాల్లో అందర్నీ భాగస్వామ్యం చేయాలని సూచించారు. పర్యాటకులు, భక్తులు సేద తీరటానికి విజయవాడ అనువైన ప్రాంతంగా వుంటుందన్నారు. చారిత్రకంగా, పర్యాటకంగా కొండపల్లి అద్భుతమైన ప్రదేశమని తెలిపారు. విజయవాడ ఉత్సవ్ కి సంబంధించి ప్రజలు తిరస్కరించిన కొంతమంది నేతలు కోడిగుడ్డికి ఈకలు పీకినట్లు కొందరు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. విజయవాడ సాంస్కృతిక వైభవాన్ని చాటి చెప్పే ఈ విజయవాడ ఉత్సవ్ పెస్టివల్ ను దిగ్విజయం చేస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ విజయవాడ ఉత్సవ్ ను అడ్డుకోవటం ఎవరి వల్ల సాధ్యం కాదన్నారు. కనకదుర్గమ్మ, వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు వున్నాయన్నారు. పర్యాటకంగా విజయవాడ నగరం అభివృద్ధి చేసేందుకు చేస్తున్న కృషిని చూసి ఓర్వలేక వైసిపి నాయకులు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని, ప్రజలు వాటిని నమ్మే పరిస్థితిలో లేరని, ప్రజలకు అన్ని వాస్తవాలు తెలుసునన్నారు. ఈ విజయవాడ ఉత్సవ్ విజయవంతం అయ్యేందుకు తన వంతు సహకారం అందిస్తాని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ , తంగిరాల సౌమ్య, శ్రీరాం రాజగోపాల్ తాతయ్య , కాగిత కృష్ణ ప్రసాద్, వర్ల కుమార్ రాజా, కామినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మాట్లాడుతూ విజయవాడ ఉత్సవ్ ఫెస్టివల్ కు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. రాష్ట్రం దేశం నలుమూలల నుంచి జనం వచ్చేలా సకల ఏర్పాట్లు చేయటంతో పాటు, విజయవాడ చరిత్రలో ఈ వేడుకలు చిరస్థాయిగా ఉండేలా నిర్వహణ ఏర్పాట్లు జరగటం ఎంతో ఆనందంగా వుందన్నారు. విజయవాడను దసరా సంబరాలకు దక్షిణ భారత సాంస్కృతిక రాజధానిగా గుర్తింపు వచ్చేలా చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. విజయవాడ నగరమంతా భక్తి, సంస్కృతి, పర్యాటకం, వినోదాల సంగమంగా మారి, ప్రపంచంలోనే అతిపెద్ద కార్నివల్ జరుపుకోడానికి సన్నద్ధమవుతోందన్నారు.

ఈ సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్ , తంగిరాల సౌమ్య, శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), వసంత వెంకట కృష్ణ ప్రసాద్, కాగిత కృష్ణ ప్రసాద్, కామినేని శ్రీనివాస్, బోడె ప్రసాద్, వర్ల కుమార్ రాజా, యార్లగడ్డ వెంకట్రావు, వెస్ట్ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తనయుడు బొండా సిద్ధార్థ, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, మాజీ ఎమెల్సీ బుద్దా వెంకన్న, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, రాష్ట్ర పర్యాటక శాఖ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, ఎన్.టి.ఆర్. జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, కె.డి.సి.సి బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్, రాష్ట్ర నాగవంశం సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఎరుబోతు రమణ, రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతిన బాల కోటయ్య, రాష్ట్ర నగరాల సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మరుపిళ్ల తిరుమలరావు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, ఏపీ బిల్డింగ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, శాలివాహన సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్, గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎన్టీఆర్ జిల్లా జనసేన అధ్యక్షుడు సామినేని ఉదయ భాను, బిజెపి జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, జనసేన రాష్ట్ర నాయకులు అమ్మిశెట్టి వాసు లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు మన సంస్కృతి

- తెల్లపొణికి, అంకుడు చెట్ల పంపకానికి ప్రత్యేక ప్రాజెక్టు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ విజ్ఞప్తిపై సీఎం చంద్రబాబు హామీ

**అమరావతి, సెప్టెంబర్ 17(జర్నలిస్ట్‌ఫైల్):**



కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు మన సంస్కృతి అని.. ఈ బొమ్మలు తయారుచేసే కళాకారులకు అవసరమైన తెల్లపొణికి, అంకుడు చెట్ల పెంపకానికి ప్రత్యేక ప్రాజెక్టుతో ముందుకు వెళ్లాల్సిన అవసరముందని, ఇందుకు ఆయా జిల్లాల కలెక్టర్లు కృషిచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు.ఏపీ రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న 4వ జిల్లా కలెక్టర్ల సదస్సు రెండో రోజు మంగళవారం జరిగిన చర్చల సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడారు. కొండపల్లి బొమ్మల తయారీకి అవసరమైన తెల్లపొణికి చెట్లు అడవుల్లో అంతరించిపోతుండటంతో కళాకారులు ఇబ్బంది పడుతు న్నారని.. ఈ బొమ్మల తయారీపై ఎన్నో కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని, భౌగోళిక గుర్తింపు (జీఐ) పొందిన కొండపల్లి బొమ్మల ఖ్యాతి ఘనమైనదని పేర్కొన్నారు. కలెక్టర్ లక్ష్మీశ విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ.. కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు మన సంస్కృతి అని.. ఈ కళలను, కళాకారులను కాపాడుకోవాల్సిన అవసరముందని, ప్రత్యేక ప్రాజెక్టుతో బొమ్మల తయారీకి అవసరమైన చెట్లను పెంచి, కలపను అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం కృషిచేయనున్నట్లు తెలిపారు. ఇందుకు రెండు జిల్లాల కలెక్టర్లు దృష్టిసారించాలని సీఎం అన్నారు. హస్తకళాకారులకు అవసరమైన కలపను అందుబాటులో ఉంచేందుకు కృషిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

# రాజరాజేశ్వరిపేటలో సాధారణ పరిస్థితి

- అయినా కొనసాగుతున్న ప్రత్యేక బృందాల పర్యవేక్షణ
- న్యూ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న 31 మంది
- నిలకడగా డయేరియా బాధితుల ఆరోగ్య పరిస్థితి
- ప్రతిఒక్కరినీ పలకరించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, సెప్టెంబర్ 17(జర్నలిస్ట్‌ఫైల్):**



డయేరియాతో కలవరపాటుకు గురైన విజయవాడ న్యూ రాజరాజేశ్వరిపేటలో పరిస్థితులు చక్కబడ్డాయి. కేర్ అండ్ షేర్ స్కూల్లోని వైద్య శిబిరంలో మంగళవారం ఓ వ్యక్తి కోలుకొని ఇంటికి వెళ్లడంతో ప్రస్తుతం అక్కడ బాధితులు ఎవరూ లేరు. అదేవిధంగా న్యూ జీజీహెచ్‌లో 31 మంది చికిత్స పొందుతుండగా వారందరి పరిస్థితి నిలకడగా ఉంది. ఇప్పటివరకు 302 మంది చికిత్స తీసుకొని డిశ్చార్జ్ అయ్యారు. మంగళవారం ఉదయం కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కు హాజరుకావడానికి ముందు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆర్ఆర్‌పేటలోని మెడికల్ క్యాంపును, కాన్ఫరెన్స్ పూర్తయ్యాక న్యూ జీజీహెచ్‌ను సందర్శించారు. ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న ప్రతిఒక్కరినీ పలకరించి, భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిస్థితి పూర్తి అదుపులో ఉన్నప్పటికీ డీఎంహెచ్‌వో, ఇతర జిల్లా అధికారుల నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. డయేరియాతో పాటు సీజనల్ వ్యాధుల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వార్డు సచివాలయ స్థాయిలో ఇంటింటి అవగాహన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కాచి చల్లార్చిన నీటిని తాగడం, చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి చిన్నచిన్న జాగ్రత్తలు వ్యాధుల బారిన పడకుండా చేస్తాయని.. ఈ విషయంలో మాత్రం ప్రజలు ఎట్టిపరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. అధికారులు, సిబ్బంది ఇస్తున్న సూచనలను తు.చ. తప్పకుండా పాటించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కలెక్టర్ వెంట విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, ఆసుపత్రి అధికారులు తదితరులు ఉన్నారు.



డెహ్రాడూన్‌లో ఉధృత స్థాయిలో వరద దృశ్యం



ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో భారీ వర్షాలకు రోడ్డుపక్క గోతిలో పడ్డ బస్సు

# ఉత్తరాఖండ్‌లో మేఘ విస్ఫోటం

## ఆలయాల్లోకి వరద నీరు, కొట్టుకునిపోయిన ట్రాక్టర్

**డెహ్రాడూన్, సెప్టెంబరు 17:** ఉత్తరాఖండ్ డెహ్రాడూన్‌లో మేఘవిస్ఫోటం సంభవించింది. సహస్రధారలో పోటెత్తిన మెరుపువరదల్లో పలువురు గల్లంతయ్యారు. వరదతో పాటు వచ్చిన బురద, ఇతర శిథిలాల తాకిడికి అనేక ఇళ్లు, దుకాణాలు, హోటళ్లు దెబ్బతినగా, వాహనాలు నీటిలో కొట్టుకుపోయాయి. సహాయకచర్యలు చేపట్టిన ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, ప్రభావిత ప్రాంతాల ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. డెహ్రాడూన్‌లో విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. తపోవన్ ప్రాంతంలో నివాసాలు జలమయమయ్యాయి. వరదనీరు భారీగా చేరడంతో జిల్లాలోని తమ్సా, టన్స్, సాంగ్ నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మాల్‌దేవతా ప్రాంతంలో ఓ వంతెన కొట్టుకుపోయింది. ముస్సోరీలో కూడా భారీగా నష్టం వాటిల్లినట్లు తెలిసింది. రిషికేశ్‌లో చంద్రభాగానది ప్రమాదకర స్థితిలో ప్రవహిస్తోంది. నదీ ప్రవాహంలో చిక్కుకున్న ముగ్గురిని ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది రక్షించారు. ప్రేమ్‌నగర్ ప్రాంతంలో మైనింగ్ పనులు చేస్తుండగా, అకస్మాత్తుగా వరద ప్రవాహం రావడంతో అందులో అనేక మంది కార్మికులు చిక్కుకున్నారు. అందుకు సంబంధించిన వీడియో వైరల్ అయింది. ట్రక్కుపైన ఉన్న కార్మికులు ఒడ్డున ఉన్న ప్రజలను రక్షించమని వేడుకుంటున్నట్లు విడియోలో కనిపిస్తుంది. కొన్ని సెకన్ల తర్వాత ట్రాలీ కొట్టుకుపోయి బోల్తా పడింది. దీంతో ఎనిమిది కార్మికులు చనిపోయినట్లు భావిస్తున్నారు అధికారులు. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అదే సమయంలో భారీ వర్షాలకు తమ్సా ఉప్పొంగి ప్రవహించడంతో ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన తపకేశ్వర్ మహాదేవ్ ఆలయం నీట మునిగింది. ఆలయ ప్రాంగణంలోకి నీరు ప్రవేశించి హనుమాన్ విగ్రహం వరకు చేరింది. అయినప్పటికీ గర్భగుడి సురక్షితంగా ఉందని ఆలయ పూజారి ఆచార్య బిపిన్ జోషి వెల్లడించారు. ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాల కారణంగా తలెత్తిన పరిస్థితిపై ఆరా తీయడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామితో ఫోన్‌లో మాట్లాడారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా ఆరా తీశారు. ఇళ్లు, ప్రభుత్వ ఆస్తులకు చాలా నష్టం జరిగింది. జీవనోపాధి దెబ్బతింది. ఈ సంక్షోభ సమయంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్ని విధాలుగా సహాయం చేస్తామని మోడీ హామీ ఇచ్చినట్లు ధామి తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లో పరిపాలనా యంత్రాంగం పూర్తిగా చురుగ్గా ఉందని, యుద్ధ ప్రాతిపదికన రక్షణ మరియు సహాయ కార్యకలాపాలు జరుగుతున్నాయని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి బాధిత కుటుంబానికి అండగా నిలుస్తుంది. పోలీసులు, స్థానిక అధికారులు క్షేత్రస్థాయిలో అవిశ్రాంతంగా పనిచేస్తున్నారని ధామి తెలిపారు. భారీ వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తున్న ఓ నదిలో పది మంది కూలీలు కొట్టుకుపోయారు. భారీ వర్షాలకు డెహ్రాడూన్‌లోని టాన్స్ నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. అదే సమయంలో అటుగా వస్తున్న ఓ ట్రాక్టర్ నదిలో చిక్కుకుపోయింది. వరద ప్రవాహం పెరగడంతో కొట్టుకుపోయింది. అందులోని పది మంది కూలీలు కూడా గల్లంతయ్యారు. ఇందుకు సంబంధించిన షాకింగ్ వీడియో వైరల్ అవుతోంది. సమాచారం అందుకున్న రెస్క్యూ టీమ్ హుటాహుటిన అక్కడికి చేరుకొని గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపడుతోంది.

హిమాచల్ ప్రదేశ్‌లో మరోసారి భారీవర్షాలు కురుస్తున్నాయి. రాజధాని సిమ్లా, మండి సహా పలు ప్రాంతాల్లో కుండపోత వర్షంకురిసింది. ఈ వర్షానికి వరదలు సంభవించాయి. రాజధాని సిమ్లా, సమీప ప్రాంతాల్లో ఎక్కడికక్కడ కొండచరియలు విరిగిపడ్డాయి. మండి జిల్లాలోని ఓ బస్ డిపోను వరద ముంచెత్తింది. ఈ వర్షాలకు ప్రధాన రహదారులు, కాలనీలు నీట మునిగాయి. అనేక ఇళ్లు నేలకూలాయి. జనజీవనం స్తంభించిపోయింది. మండిలో రాత్రి 11 గంటల ప్రాంతంలో వర్షం ప్రారంభమైంది. తెల్లవారుజామున 1 గంట సమయానికి వర్షం తీవ్రత పెరిగింది. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇళ్ల నుంచి బయటకు వచ్చి సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకున్నారు. సౌలి ఖాద్ నది పొంగిపొర్లుతోంది. ధరంపూర్ సబ్ డివిజన్‌లోని బస్ డిపో పూర్తిగా నీట మునిగింది. దీంతో అనేక బస్సులు నీట మునిగాయి. బస్టాండ్ సమీపంలో ఉన్న కార్లు, ద్విచక్ర వాహనాలు కొట్టుకుపోయాయి. అనేక ఇళ్లు నీట మునిగాయి. అప్రమత్తమైన అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇప్పటి వరకూ ఎలాంటి మరణాలూ సంభవించలేదని అధికారులు తెలిపారు.



## రూ.60 కోట్ల కుంభకోణంలో బిపాసాబసు, నేహాధుపియాకు ఫీజులు ఇచ్చా!: రాజ్ కుంద్రా

**ముంబయి, సెప్టెంబరు 17:** బాలీవుడ్ నటి శిల్పా శెట్టి భర్త, వ్యాపారవేత్త రాజ్ కుంద్రాపై నమోదైన రూ.60 కోట్ల మోసం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో విచారణ ఎదుర్కొంటున్న రాజ్‌కుంద్రా డబ్బులో కొంత భాగాన్ని ప్రముఖ హీరోయిన్లు బిపాసా బసు, నేహా ధూపియాలకు ఫీజుల రూపంలో చెల్లించినట్లు చెప్పినట్లు సమాచారం. ముంబై పోలీసుల ఆర్థిక నేరాల విభాగం (ఇఒడబ్ల్యూ) జరిపిన విచారణలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించినట్లు తెలుస్తోంది. ఈ కేసు విచారణలో భాగంగా ఇఒడబ్ల్యూ అధికారులు రాజ్‌కుంద్రాను సుమారు ఐదు గంటల పాటు ప్రశ్నించారు. ఈ సమయంలో హీరోయిన్లకు ఫీజులు చెల్లించినట్లు ఆయన పేర్కొన్నప్పటికీ, పలు కీలక ప్రశ్నలకు మాత్రం సమాధానం ఇవ్వకుండా మౌనంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఆయనను మరోసారి విచారించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ కేసులో రాజ్ కుంద్రాతో పాటు ఆయన భార్య శిల్పాశెట్టిపైనా దర్యాప్తు కొనసాగుతోందని ముంబై పోలీసులు అధికారికంగా వెల్లడించారు. అధికారులు జరిపిన దర్యాప్తులో మరిన్ని ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. కుంద్రా కంపెనీ ఖాతాల నుంచి శిల్పా శెట్టి, బిపాసా బసు, నేహా ధూపియా సహా మొత్తం నలుగురు నటీమణుల బ్యాంకు ఖాతాలకు నేరుగా డబ్బు బదిలీ అయినట్లు ఆధారాలు లభించాయి. బాలాజీ ఎంటర్‌టైన్‌మెంట్‌కు కూడా లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఇప్పటివరకు అధికారులు సుమారు రూ.25 కోట్ల మేర ప్రత్యక్ష బదిలీలను ట్రాక్ చేశారు. ముఖ్యంగా పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్) సమయంలో నగదు కొరత ఏర్పడినప్పుడు కంపెనీ నుంచి పలు అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్లు దర్యాప్తులో తేలింది.

## హ్యాంబర్గర్, ఐస్‌క్రీమ్, కరావోకే పదాలునిషేధం: కిమ్

**ప్యాంగ్యాంగ్, సెప్టెంబరు 17:** ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్ మరోసారి తన విచిత్రమైన నిర్ణయాలతో ప్రపంచం దృష్టిని ఆకర్షించారు. తమ దేశంలో పాశ్చాత్య సంస్కృతి ప్రభావం ఉండకూడదన్న ఉద్దేశంతో హ్యాంబర్గర్, ఐస్‌క్రీమ్, కరావోకే వంటి సాధారణ పదాల వాడకంపై నిషేధం విధించారు. విదేశీ, ముఖ్యంగా దక్షిణ కొరియా పదజాలం స్థానంలో దేశీయ పదాలను మాత్రమే ఉపయోగించాలని కఠినమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ కొత్త నిబంధనల ప్రకారం ఇకపై హ్యాంబర్గర్‌ను రొట్టెల మధ్య రుబ్బిన గొడ్డు మాంసం అని పిలవాలి. అలాగే ఐస్‌క్రీమ్‌ను ఎసుకిమోగా, కరావోకేను తెరపై సంగీత పరికరంగా వ్యవహరించాలి. ముఖ్యంగా వోన్సన్ బీచ్ రిసార్టులో పనిచేసే టూరిస్ట్ గైడ్లకు ఈ విషయంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు డైలీ ఎన్‌కే అనే వార్తా సంస్థ నివేదించింది. పర్యాటకులతో మాట్లాడేటప్పుడు ప్రభుత్వం నిర్దేశించిన పదాలనే తప్పనిసరిగా వాడాలని వారికి స్పష్టం చేశారు.

## ఆపరేషన్ సింధూర్‌లో మసూద్ కుటుంబం ఛిద్రం

### జైషే మహ్మద్ తొలిసారి అంగీకారం

**ఇస్లామాబాద్, సెప్టెంబరు 17:** పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న జైష్ ఏ మొహమ్మద్ ఉగ్రవాద సంస్థకు భారత్ చేతిలో గట్టి ఎదురుదెబ్బ తగిలిన విషయాన్ని ఆ సంస్థ తొలిసారిగా బహిరంగంగా అంగీకరించింది. భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా పాకిస్థాన్‌లోని బహావల్‌పూర్‌లో జరిపిన వైమానిక దాడిలో తమ అధినేత మసూద్ అజహర్ కుటుంబ సభ్యులు మరణించినట్లు ధృవీకరించింది. ఈమేరకు జైష్ అగ్ర కమాండర్లలో ఒకరైన మసూద్ ఇలియాస్ కశ్మీరీ మాట్లాడిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. మే 7వ తేదీన బహావల్‌పూర్‌లోని జైష్ ప్రధాన కార్యాలయం జామియా మసీదు సుభాన్ అల్లాపై భారత బలగాలు జరిపిన దాడిలో మసూద్ అజహర్ కుటుంబం తీవ్రంగా నష్టపోయిందని ఆ కమాండర్ పేర్కొన్నాడు. "మే 7న భారత బలగాలు మోలానా మసూద్ అజార్ కుటుంబాన్ని ఛిద్రం చేశాయి" అని కాశ్మీరీ ఆ వీడియోలో ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ దాడిలో అజహర్ సోదరి, ఆమె భర్త, మేనల్లుడు, మేనకోడలు, ఇతర సమీప బంధువులు మొత్తం 10 మంది మరణించినట్లు సమాచారం. వారితో పాటు అజహర్ ప్రధాన అనుచరులైన నలుగురు సహాయకులు కూడా హతమయ్యారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో 26మంది మృతికి కారణమైన ఉగ్రదాడికి ప్రతీకారంగానే భారత్ ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టింది. బహావల్‌పూర్‌తో పాటు మరో ఎనిమిది ఉగ్రవాద శిబిరాలను కూడా భారత సైన్యం ధ్వంసం చేసింది. ఈ దాడిలో మసీదులోని ఒక డోమ్ దెబ్బతిన్నట్లు, లోపల తీవ్ర నష్టం వాటిల్లినట్లు ఉపగ్రహ చిత్రాలు వెల్లడిస్తున్నాయి. అయితే, ఈ దాడి గురించి పాకిస్థాన్ ప్రభుత్వం ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటనా చేయలేదు. కానీ, అజహర్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిపినట్లు ప్రత్యక్ష సాక్షులు, అంతర్జాతీయ మీడియా సంస్థలు నివేదించాయి. ఆకార్యక్రమానికి మసూద్ అజహర్ కూడా హాజరై కొద్ది నిమిషాల్లోనే అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. మసూద్ అజహర్, 2016 పఠాన్‌కోట్, 2019 పుల్వామా దాడుల వెనుక ప్రధాన సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. తాజా నిఘా సమాచారం ప్రకారం, అజహర్ ప్రస్తుతం తన స్థావరమైన బహావల్‌పూర్‌కు వెయ్యి కిలోమీటర్ల దూరంలో ఉన్న పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని గిల్గిత్ బల్టిస్థాన్ ప్రాంతంలో తలదాచుకున్నట్లు తెలుస్తోంది. అక్కడి స్కర్దు ప్రాంతంలో అతని కదలికలను గుర్తించారు. అజహర్ ఆఫ్ఘనిస్థాన్‌లో ఉండవచ్చని గతంలో పాక్ మాజీ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో జర్దారీ చేసిన వ్యాఖ్యలకు ఈ సమాచారం విరుద్ధంగా ఉంది.



## 25న ట్రంప్‌తో పాక్ ప్రధాని భేటీ




### మూడోసారి అమెరికా వెళుతున్న పాక్ ఆర్మీచీఫ్

**ఇస్లామాబాద్, సెప్టెంబరు 17:** ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి మావేశాలుప్రారంభం అవుతున్న క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ పాక్ ప్రధాని షెహబాజ్‌షరీఫ్, ఆర్మీచీఫ్ ఆసిమ్ మునీర్‌లతో భేటీ కానున్నారు. ఈనెల 25న ఇద్దరు పాక్‌నేతలు ట్రంప్‌తో చర్చలు జరుపుతారని పాక్ మీడియా స్పష్టంచేసింది. పాకిస్తాన్‌లో తీవ్రమైన వరదలు, ఖతార్‌పై ఇజ్రాయెల్ దాడి తదితర అంశాలు చర్చకు రావచ్చని అంచనా. భారత్‌తో దౌత్యపరమైన ఉద్రిక్తతలు కూడా ఈసమావేశంలో చర్చకువస్తాయనిపాక్ మీడియా చెపుతోంది. ఈనెల 23నుంచి 29 వరకూ ఐక్యరాజ్యసమితి సమావేశాలుప్రారంభం కానున్న నేపథ్యంలో వీరిద్దరితోభేటీ ఇపుడు చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ భేటీ ట్రంప్ వాణిజ్య ధోరణుల్లోనే చూస్తారని, దౌత్యపరంగా కాదన్న విమర్శలు కూడా లేకపోలేదు. పాకిస్తాన్‌కు ఎదురవుతున్న తెహ్రీక్ ఇ తాలిబన్ దాడులు, బెలూచిస్తాన్ లిబరేషన్‌ఫ్రంట్ ఆర్మీ దాడులతో సతమతం అవుతోంది. దీనికితోడు ఇటీవల పాకిస్థాన్‌ను ఆకస్మిక వరదలు కుదిపేసాయి. అనేక ప్రాంతాలు వరదల్లో మునిగిపోయి ప్రజలకు అపారనష్టం కలిగించాయి. ఇపుడున్న పరిస్థితుల్లో పాకిస్తాన్‌కు ఐఎంఎఫ్ ప్రపంచబ్యాంకువంటి ఇతర అంతర్జాతీయ సంస్థల నిధులు అవసరం అవుతాయి. అలాగే ప్యారిస్‌లోని ఫైనాన్షియల్ టాస్క్‌ఫోర్స్ ఆంక్షల నుంచి అధిగమించాలంటే పాక్‌కు అమెరికా సాయం అత్యవసరం. భారత్‌తో నెలకొన్న దౌత్య పరమయిన వివాదాలు పరిష్కరించుకోవాలన్నా అమెరికా సాయం అత్యవసరం ఏకైక మార్గంగా భావిస్తోంది. అందుకోసమే సమితిసమావేశాల సందర్భంగా పాక్ ప్రధాని షరీఫ్ ట్రంప్‌తో భేటీకి సిద్ధం అవుతున్నారు. ఇందుకు ట్రంప్‌కూడా సానుకూలంగా ఉన్నారు. భారత్‌ను దారిలోకి తెచ్చుకోడానికి అవసరమైన అన్ని జిమ్మికులు ప్రయోగిస్తున్న ట్రంప్ ఇపుడు పాక్‌ను ఒక బూచిగాచూపించి భారత్‌ను తన దారిలోకి తెచ్చుకుని వాణిజ్య ఒప్పందంపై ఏకపక్షంగా ఆమోదం తెచ్చుకోవాలన్న కుతూహలంతో ఉన్నారు. ఇదేమీ దౌత్యబంధం కాదని, వాణిజ్య పరమైన బంధాలేనని నిపుణుల అంచనా. మూడోసారి మునీర్ అమెరికా పర్యటనలో రక్షణ రంగ బంధం మరింత బలోపేతం చేసుకోడానికేనని తెలుస్తోంది. అటు ఆఫ్ఘన్‌వైపునుంచి తాలిబన్ తెహ్రీక్ దాడులు, బెలూచిస్తాన్ దాడులను అరికట్టాలంటే అమెరికాసాయం తప్పనిసరి అని భావిస్తున్న పాక్‌ను అమెరికా ఇపుడు సులువుగా తన చెప్పుచేతల్లో ఉంచుకని భారత్‌పై ప్రయోగించేందుకు ట్రంప్ యంత్రాంగం వెనుకాడదని సర్వత్రా వినిపిస్తోంది.

## అసోం మహిళా అధికారి ఇంట్లో నోట్లకట్టలు

### రూ.2 కోట్ల నగదు, బంగారం ఆభరణాలు స్వాధీనం

**గువాహటి, సెప్టెంబరు 17:** అసోంలో ఓ మహిళా ప్రభుత్వ అధికారి ఇంట్లో భారీగా అక్రమాస్తులు బయటపడ్డాయి. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై అసోం సివిల్ సర్వీస్ (ఎసిఎస్) అధికారిణి నుపూర్ బోరాను ముఖ్యమంత్రి ప్రత్యేక విజిలెన్స్ సెల్ అధికారులు సోమవారం అరెస్ట్ చేశారు. గువాహటిలోని ఆమె నివాసంలో జరిపిన సోదాల్లో సుమారు రూ.2కోట్ల విలువైన నగదు, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకోవడం సంచలనం సృష్టిస్తోంది. విజిలెన్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం గువాహటిలోని నుపూర్ బోరా ఇంట్లో జరిపిన తనిఖీల్లో రూ. 92 లక్షల నగదు, దాదాపు కోటి రూపాయల విలువైన బంగారు ఆభరణాలు లభించాయి. దీంతో పాటు, బార్‌పేటలో ఆమె అద్దెకు ఉంటున్న మరో ఇంట్లో సోదాలు చేయగా అదనంగా మరో రూ. 10 లక్షల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గోలాఘాట్‌కు చెందిన నుపూర్ బోరా 2019లో ఏసీఎస్ అధికారిణిగా విధుల్లో చేరారు. ప్రస్తుతం ఆమె కామ్రూప్ జిల్లాలోని గొరైమారిలో సర్కిల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ స్పందిస్తూ నుపూర్‌బోరాపై ఆరు నెలలుగా నిఘా ఉంచామని తెలిపారు. బార్‌పేట రెవెన్యూ సర్కిల్‌లో విధులు నిర్వర్తిస్తున్నప్పుడు ఆమె డబ్బు తీసుకుని హిందువుల భూములను అనుమానాస్పద వ్యక్తులకు బదిలీ చేశారు. అందుకే ఆమెపై కఠినచర్యలు తీసుకున్నామని సిఎం వివరించారు. ఈ కేసులో భాగంగా నుపూర్ బోరాకు సహకరించారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న బార్‌పేట రెవెన్యూ కార్యాలయంలో పనిచేసే లత్ మండల్ సురజిత్ డేకా నివాసంలో కూడా విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. నుపూర్ బార్‌పేటలో సర్కిల్ ఆఫీసర్‌గా ఉన్నప్పుడు ఆమెతో కుమ్మక్కై సురజిత్ బార్‌పేటలో అనేక భూములను అక్రమంగా సంపాదించినట్లు ఆరోపణలు ఉన్నాయి.



## వరదలో కొట్టుకుపోయిన ట్రాక్టర్

### డెహ్రాడూన్‌లో భారీ వర్షాలకు 10 మంది గల్లంతు, గాలింపు చర్యలు చేపట్టిన అధికారులు

**డెహ్రాడూన్, సెప్టెంబరు 17:** ఉత్తరాఖండ్‌లో కురుస్తున్న కుండపోత వర్షాలవల్ల రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వరదనీరు పోటెత్తుతోంది. దీంతో ఉత్తరాఖండ్‌లోని పలు నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మంగళవారం డెహ్రాడూన్‌లోని నదిని దాటుతుండడానికి ప్రయత్నించగా వరద ఉధృతి పెరగడంతో ప్రమాదవశాత్తు నదిలో ట్రాక్టర్ బోల్తాపడింది. ట్రాక్టర్‌లో ఉన్న 10 మంది వరదనీటిలో గల్లంతయ్యారు. స్థానికులు వారిని కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ లాభం లేకుండా పోయిందని అధికారులు తెలిపారు. నదిలో కొట్టుకుపోయిన వారంతా కూలీలని, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. గాలింపు చర్యలు కొన సాగుతున్నాయన్నారు. ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మరోప్రాంతంలో స్వర్ణ నదికి సమీపంలో వరదల్లో చిక్కుకున్న ఓ చిన్నారిని ఎన్డీఆర్ఎఫ్ బృందాలు కాపాడాయి. రాష్ట్రవ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు డెహ్రాడూన్, ముస్సోరీ మాల్‌లోని పలు ప్రాంతాలు నీటమునగడంతో ప్రజలు వరదలో చిక్కుకుపోయారు. ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యల్లో భాగంగా సహాయక బృందాలు దాదాపు 400 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. భారీ వర్షాల వల్ల అన్ని నదులు పొంగిపొర్లుతున్నాయని ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి తెలిపారు. 25నుంచి 30 చోట్ల రోడ్లు తెగిపోయాయని ఇళ్లు ప్రభుత్వ ఆస్తులు తీవ్రంగా దెబ్బతిన్నాయని అన్నారు. పరిస్థితులను అదుపులోకి తీసుకురావడానికి రెస్క్యూ బృందాలు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు.

## గాజాలో ఇజ్రాయెల్ మారణహోమం

### ఐక్యరాజ్యసమితి సంచలన నివేదిక



**న్యూయార్క్, సెప్టెంబరు 17:** గాజాలో ఇజ్రాయెల్ మారణహోమానికి పాల్పడిందంటూ ఐక్యరాజ్యసమితికి చెందిన స్వతంత్ర దర్యాప్తు కమిషన్ సంచలన నివేదిక విడుదల చేసింది. 2023లో హమాస్‌తో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇజ్రాయెల్ బలగాలు గాజా పాలస్తీనీయులపై జాతి నిర్మూలనకు పాల్పడ్డాయని చెప్పడానికి బలమైన ఆధారాలున్నాయని నివేదిక పేర్కొంది. ఈ యుద్ధంలో ఇజ్రాయెల్ మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడిందని కమిషన్ ఆరోపించింది. అంతర్జాతీయ చట్టం ప్రకారం నిర్వచించిన ఐదు మారణహోమ చర్యల్లో నాలుగింటికి ఇజ్రాయెల్ పాల్పడిందని కమిషన్ తన 72 పేజీల నివేదికలో పేర్కొంది. ఒక వర్గానికి చెందిన వారిని చంపడం, వారికి తీవ్రమైన శారీరక, మానసిక హాని కలిగించడం, ఉద్దేశపూర్వకంగా ఆ సమూహాన్ని నాశనం చేసే పరిస్థితులను సృష్టిం చడం, జననాలను నిరోధించడం వంటి చర్యలు ఇందులో ఉన్నాయని వివరించింది. ఇజ్రాయెల్ నేతల వ్యాఖ్యలు, సైన్యం ప్రవర్తించినతీరే వారి జాతి నిర్మూలన ఉద్దేశానికి నిదర్శనమని కమిషన్ అభిప్రాయ పడింది. అయితే, ఈ నివేదికను ఇజ్రాయెల్ తీవ్రంగా ఖండించింది. ఇదొక వక్రీకరించిన, తప్పుడు నివేదిక అని కొట్టిపారేసింది. ఈ కమిషన్‌లోని నిపుణులు హమాస్ ప్రతినిధులుగా పనిచేస్తున్నారని ఇజ్రాయెల్ విదేశాంగ శాఖ ఆరోపించింది. "వాస్తవానికి ఇజ్రాయెల్‌లో మారణహోమానికి ప్రయత్నిం చింది హమాస్. 1,200 మందిని చంపి, మహిళలపై అత్యాచారాలు చేసి, కుటుంబాలను సజీవ దహనం చేసిందని ఇజ్రాయెల్ గుర్తుచేసింది. ఈ నివేదిక నిరాధారమైనదని ఇజ్రాయెల్ సైనిక అధికారి ఒకరు తెలిపారు. 2023 అక్టోబర్ 7న హమాస్ ఇజ్రాయెల్‌పై అకస్మాత్తుగా దాడి చేసి సుమారు 1,200 మందిని చంపడంతో ఈ యుద్ధం మొదలైంది. దీనికి ప్రతిగా ఇజ్రాయెల్ గాజాపై సైనిక చర్య ప్రారంభించింది. అప్పటి నుంచి ఇప్పటివరకు గాజాలో 64,905 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని అక్కడి ఆరోగ్య శాఖ చెబుతోంది. గాజాలో 90 శాతానికి పైగా ఇళ్లు ధ్వంసమయ్యాయని, ఆరోగ్య, పారిశుద్ధ్య వ్యవస్థలు కుప్పకూలాయని, తీవ్ర ఆహార కొరత ఏర్పడిందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి 2021లో ఈ స్వతంత్ర అంతర్జాతీయ దర్యాప్తు కమిషన్‌ను ఏర్పాటు చేసింది.

## సంక్షిప్తంగా..

### లిక్కర్ స్కాం: చత్తీస్‌గఢ్ మాజీ సిఎం కుమారుని అరెస్ట్



**చత్తీస్‌గఢ్, సెప్టెంబరు 17:** మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో చత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్‌నేత భూపేశ్ బఘేల్ కుమారుడు చైతన్య బఘేల్‌ను ఇడి అరెస్టు చేసిన విషయం తెలిసిందే. తమ దర్యాప్తులో చైతన్య బఘేల్ రూ.1,000కోట్ల విలువైన మద్యం సిండికేట్‌ను నడిపినట్లు గుర్తించామన్నారు. ఈ సిండికేట్‌ను నిర్వహించడానికి దాని సభ్యులను అప్పటి ఐఎఎస్ అధికారి అనిల్, వ్యాపారవేత్త అన్వర్ ధేబర్‌సహకరించినట్లు ఇడి ఆరోపించింది. సిండికేట్ సేకరించిన అన్ని అక్రమ నిధుల ఖాతాలు, పంపిణీకి సంబంధించిన విషయాలను చైతన్య చూసుకునేవాడని ఇడి ఆరోపించింది. ఇక్కడ వచ్చిన ఆదాయాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు, పార్టీ కార్యకలాపాలకు వినియోగించేవాడని తెలిపింది. మరికొందరు రాజకీయ నేతలకు కూడా ఈ కుంభకోణంతో సంబంధం ఉందని త్వరలో వారిపైనా చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. ఈ కేసులో మరిన్ని వివరాలు తెలుసుకోవడానికి నిందితుల మొబైల్ ఫోన్లను పరిశీలిస్తున్నట్లు పేర్కొంది.

### ఆలయాలకు ఇచ్చే డబ్బు కల్యాణ మండపాల నిర్మాణానికి కాదు: సుప్రీం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** దేవాలయాలకు భక్తులు సమర్పించే డబ్బులు కల్యాణ మండపాల నిర్మాణానికి కాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఆలయ నిధులను ప్రభుత్వ నిధులుగా పరిగణించలేమంటూ మద్రాస్ హైకోర్టుకు చెందిన మదురై బెంచ్ ఇటీవల ఇచ్చిన తీర్పుపై స్టే విధించేందుకు నిరాకరించింది. తమిళనాడులోని ఐదు దేవాలయాలకు చెందిన నిధులతో రాష్ట్రంలోని వివిధ ఆలయాల ప్రాంగణాల్లో కల్యాణ మండపాల నిర్మాణానికి అనుమతిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై పిటిషనర్లు మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను కొట్టివేసింది. దీన్ని సవాలు చేస్తూ తమిళనాడు సర్కార్ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. విచారణ సందర్భంగా జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'కల్యాణ మండపాల ఏర్పాటు కోసం భక్తులు తమ డబ్బును ఆలయాలకు ఇవ్వరు. ఆలయ అభివృద్ధి వంటి వాటికోసం ఇస్తుంటారు. ఒక ఆలయ ప్రాంగణంలో పెళ్లి జరుగుతుంటే అక్కడ అసభ్యకరమైన పాటలు ప్లే చేస్తుంటే.. అది సరైనదేనా? అని ప్రశ్నించింది. ఆ డబ్బును విద్య, వైద్యం వంటి దాతృత్వ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తే బాగుంటుందని సూచించింది. తదుపరి విచారణను నవంబర్ 19కి వాయిదా వేసింది.

### అక్రమంగా వచ్చి నేరాలుచేస్తే ఉగాండా జైళ్లకు పంపిస్తా: ట్రంప్

**డల్లాస్, సెప్టెంబరు 17:** అమెరికాలోకి అక్రమంగా ప్రవేశిస్తే ఉగాండా, ఎస్వాటిని, సౌత్ సూడాన్‌లోని జైళ్లకు పంపిస్తామని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. స్వదేశాలలో నేరాలు చేసి పారిపోయి తమ దేశంలోకి వస్తున్నారని అక్రమ వలసదారులపై ఆయన మండిపడ్డారు. అమెరికాలోకి వచ్చి మళ్లీ నేరాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బైడెన్ సర్కారు అవలంభించిన విధానాల వల్ల నేరస్థులు అమెరికాగడ్డపై స్వేచ్ఛగా తిరుగుతున్నారని విమర్శించారు. డల్లాస్‌లో భారత సంతతికి చెందిన నాగమల్లయ్య దారుణహత్యపై స్పందిస్తూ ట్రంప్ ఈవ్యాఖ్యలు చేశారు. నాగమల్లయ్యను చంపిన హంతకుడు యోర్దానిస్ కోబోస్ మార్టినెజ్ క్యూబా పౌరుడని, అమెరికాలోకి అక్రమంగా వచ్చాడని తెలిపారు. గతంలో చిన్నపిల్లలపై అఘాయిత్యం, వాహనాల దొంగతనంకేసులో మార్టినెజ్‌ను పోలీసులు జైలుకు పంపించారని చెప్పారు. అయితే, బైడెన్ ప్రభుత్వ విధానాల వల్ల మార్టినెజ్ జైలు నుంచి విడుదలయ్యాడని, తాజాగా నాగమల్లయ్యను హత్య చేశాడని తెలిపారు.

### న్యూయార్క్‌టైమ్స్‌పై ట్రంప్ రూ.1.25 లక్షలకోట్ల పరువునష్టం దావా




**వాషింగ్టన్, సెప్టెంబరు 17:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, దేశంలోని ప్రముఖ మీడియా సంస్థల్లో ఒకటైన న్యూయార్క్ టైమ్స్‌పై న్యాయపోరాటానికి దిగారు. దశాబ్దాలుగా ఆ పత్రిక తనపై ఉద్దేశపూర్వకంగా అబద్ధపు ప్రచారం చేస్తోందని ఆరోపిస్తూ, ఏకంగా 15 బిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో సుమారు రూ. 1.25 లక్షల కోట్లు) పరువు నష్టం దావా వేశారు. ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా వేదికగా స్వయంగా ప్రకటించారు. ఫ్లోరిడా రాష్ట్రంలోని కోర్టులో ఈ దావాను దాఖలు చేసినట్టు ట్రంప్ తెలిపారు. న్యూయార్క్ టైమ్స్ పత్రిక రాడికల్ లెఫ్ట్ డెమొక్రాటిక్ పార్టీకి అధికారిక గొంతుకగా మారిపోయిందని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. తనపై, తన కుటుంబంపై, తన వ్యాపారాలపై, అలాగే అమెరికా ఫస్ట్, మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ (మాగా) ఉద్యమాలపై ఆ పత్రిక నిరంతరం అబద్ధాలు ప్రచురిస్తోందని ఆరోపించారు.

## ప్రధాని మోదీకి బిజెపి శ్రేణుల జేజేలు



తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్) భారతదేశాన్ని ప్రపంచ దేశాల సరసన విశ్వ గురువుగా నిలబెట్టే సంకల్పంతో భారత ప్రధాని నరేంద్ర మోడీ నమ్మిన సిద్ధాంతాన్ని ముందుకు తీసుకువెళ్లడంలో మొక్కవోని ధైర్యంతో నిర్విరామంగా కృషి చేస్తున్నారని ప్రధానిగా ఆయన సేవలు సుదీర్ఘకాలం భారతదేశానికి ఉండాలని తెనాలి రైల్వే స్టేషన్ అభివృద్ధి కమిటీ నాయకులు ప్రధాని మోదీ జన్మదినోత్సవాన్ని వినూత్నంగా నిర్వహించారు. కేంద్రంలోని కూటమి ప్రభుత్వం తెనాలి రైల్వే స్టేషన్ అభివృద్ధికి 29 కోట్లను కేటాయించి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు, అభివృద్ధి పనులకు ఒక కమిటీని ఏర్పాటు చేసిన నేపథ్యంలో , బుధవారం ఆ కమిటీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని, రైల్వే స్టేషన్ లోని పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. పారిశుధ్య పని వారి సేవలు వెలకట్టలేనివని, వారందించే విలువైన సేవలు వల్లనే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు లభిస్తున్నాయని, ప్రధాని నరేంద్ర మోడీ జన్మ దినోత్సవ వేళ వారిని సత్కరించుకోవడం సముచిత నిర్ణయంగా కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ సూపర్నెంట్ వెంకటరమణ సమక్షంలో, రైల్వేస్టేషన్ పారిశుద్ధ్య కార్మికులు బి. రాజు, షేక్ ఆలింబి, గాజులవర్తి మహాలక్ష్మి,ఎమ్. లలితకుమారి, చిలకామణి, ఉమ, వెంకటేశ్వరమ్మ, ఏసుదయమ్మ, అన్నెమేరి, ఎమ్. సుకన్య, ఎ. జ్యోతి, జాన్ లను, ఘనంగా సత్కరించి, గౌజులు, మాస్క్ లు, గొడుగులు అందజేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు అడపా సంపత్ రాయుడు, గాజుల వెంకయ్య నాయుడు, గోవాడ కృష్ణ చైతన్య, దారా సాయి గుప్తా, బిట్రా కనకదుర్గ, శిఖ రవీంద్ర, గోళ్ళ దేవరాజ్, కనకదుర్గ, తమిరిశరఘు, వై కామేశ్వరరావు, తుమ్మలసాయి, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైన్లపై ఆక్రమణలు తొలగించండి



○ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశం

ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు నగరంలో డ్రైన్లను ఆక్రమణ చేసి చేపట్టిన నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టం చేశారు. బుధవారం జిజిహెచ్ దగ్గరలోని సెయింట్ జోసఫ్ స్కూల్లో వర్షం నీరు నిలిచిందని అందిన ఫిర్యాదు మేరకు కమిషనర్ సదరు స్కూల్ ని పరిశీలించి, స్కూల్ ఎదుట డ్రైన్ పై ఆక్రమణలను తొలగించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డ్రైన్ల ఆక్రమణ ఎంత సమస్యగా ఉంటుందో గత 3 రోజులుగా కురుస్తున్న వర్షాల వలన రోడ్ల మీదకు, ఇళ్లల్లోకి వచ్చిన వర్షం నీరు చూస్తే తెలుస్తుందని, కనుక ప్రతి ఒక్కరూ డ్రైన్ల ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కోరారు. ఇప్పటికే ప్రజారోగ్య కార్మికులు వర్షం కురుస్తున్న సమయంలో కూడా విధుల్లో ఉండాల్సిన పరిస్తితి వస్తుందన్నారు. స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించుకోని వాటిని తక్షణం తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఆక్రమణల తొలగింపుకు అవరమైతే అదనపు జేసిబీలను కూడా తీసుకోవాలని తెలిపారు. వార్డ్ సచివాలయాల వారీగా ఆక్రమణలు జరిగే తోలి దశలోనే అడ్డుకోవాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పర్యటనలో పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

### వైసీపీ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో...

## 19న "ఛలో మెడికల్ కాలేజీ"



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) : తమ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన 10 కొత్త మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరించాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఈనెల 19న 'ఛలో మెడికల్ కాలేజీ' చేపడుతున్నట్లు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. పార్టీ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని పార్టీ వెల్లడించింది. ఆ రోజున ఆయా కాలేజీల వద్దకు వెళ్లే పార్టీ యువజన, విద్యార్థి విభాగాల ప్రతినిధులు అన్ని వాస్తవాలను ప్రజలకు వివరిస్తారని పార్టీ తెలియజేసింది. శాంతియుతంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తారని పార్టీ తెలిపింది.

ఈ మేరకు వైయస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య ఒక ప్రకటన చేస్తూ.. పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున "ఛలో మెడికల్ కాలేజీ" కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## జాతీయస్థాయిలో నిర్మల ఫార్మసీ విద్యార్థిని ప్రతిభ



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): నిర్మల ఫార్మసీ కళాశాల ఫైనల్ ఇయర్ బి.ఫార్మసీ విద్యార్థిని సాయి శ్రీయ కాండూరి జాతీయ స్థాయి సదస్సులో ప్రథమ బహుమతి అందుకుని ప్రతిభ చాటుకుంది. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో కేఎల్‌యూ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో, అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "థెరానొస్టిక్ నానోథెరప్యూటిక్స్‌లో పురోగతులు" అనే సదస్సులో ఆమె విజయం సాధించింది.

"క్యాన్సర్ ఖచ్చితమైన నిర్ధారణకు బయోసెన్సార్లు" అనే అంశంపై తన గైడ్ శ్రీమతి జి. సాయి శ్రీ లక్ష్మి మార్గదర్శకత్వంలో చేసిన మౌఖిక ప్రదర్శనతో దేశవ్యాప్తంగా వచ్చిన 72 ప్రదర్శనలలో ఆమెదే ప్రథమంగా నిలిచింది. ఆమెకు అవార్డు సర్టిఫికేట్, ట్రోఫీని ప్రముఖులు ప్రొఫెసర్ ఎం.ఎస్. ముత్తు (ఐఐటి-బిహెచ్‌యూ), డా. అరవింద్ (ఐఐటి హైదరాబాద్), డా. కె. అంకారావు (వైస్ ప్రిన్సిపాల్, కేఎల్‌సిపి) ప్రదానం చేశారు.

ఈ విజయంపై కళాశాలలో సాయి శ్రీయను ఘనంగా సన్మానించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ జి. నిర్మల జ్యోతి మాట్లాడుతూ, "సాయి శ్రీయ విజయం మా కళాశాల గౌరవం. పరిశోధనలో మహిళా విద్యార్థులకు ఇది ప్రేరణ" అని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డా. బి. పాముల రెడ్డి మాట్లాడుతూ, "విద్యార్థిని ప్రతిభ వెనుక అధ్యాపకుల కృషి విశేషం. గైడ్ సాయి శ్రీ లక్ష్మికి అభినందనలు" అని తెలిపారు.

# యూరియాపై ఆందోళన వద్దు : పెమ్మసాని

○ రైతులకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలి

○ వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) జిల్లాలో యూరియా సరఫరాపై రైతులు అనవసర ఆందోళనతో అవసరానికి మించి యూరియాను నిలువ చేసుకోకుండా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లోని ఎస్ ఆర్ శంకరన్ మినీసమావేశమందిరంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ , సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులతో కలసి వ్యవసాయశాఖ పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో రైతులకు యూరియా పంపిణీ, భూసార పరీక్షలు, ఈ - క్రాప్ బుకింగ్, ఫసల్ బీమా యోజన పథకం తదితర అంశాలపై కేంద్రమంత్రి వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి సూచనలు అందించారు. సమావేశం అనంతరం కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో యూరియా ఇబ్బందులు లేకుండా సక్రమంగా రైతులకు సరఫరా జరుగుతుందన్నారు. ఖరీఫ్ సీజన్లో యూరియా 24 వేల మెట్రిక్ టన్నులు అవసరం ఉంటే దానికంటే అదనంగా ఇప్పటికే 26,000 మెట్రిక్ టన్నులను రైతులకు సరఫరా చేయడం జరిగిందన్నారు. అధిక వర్షాలు, యూరియా సరఫరా పై ఉన్న అపోహలతో కొంతమంది రైతులు అవసరానికి మించి ముందస్తుగా యూరియాను నిల్వ చేసుకున్నట్లు తెలిసిందన్నారు. ప్రస్తుతము యూరియా అందుబాటులో ఉందని, మరికొంత యూరియా జిల్లాకు వస్తుందన్నారు. రానున్న రోజుల్లో మరింత మెరుగ్గా యూరియా సరఫరా కోసం ఆఫ్ సీజన్లో నే మార్క్ ఫెడ్ ద్వారా యూరియా కొనుగోలుకు చర్యలు తీసుకుంటామన్నారు. వాస్తవంగా పంటలు సాగు చేస్తున్న భూ యజమానులకు, కౌలు రైతులకు మాత్రమే యూరియా పంపిణీ జరిగేలా కేంద్ర ప్రభుత్వ యాప్ లో ఓటిపి విధానాన్ని తీసుకొచ్చేందుకు కేంద్ర ,రాష్ట్ర వ్యవసాయ అధికారులతో చర్చించడం జరుగుతుందన్నారు. జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాల మేరకు 13వేల భూసార పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. భూసార పరీక్షల నిర్వహణ , ఫలితాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని రైతులు తెలియజేశారని, గ్రామస్థాయిలోనే భూసార పరీక్షలు నిర్వహించి వెంటనే ఫలితాలు అందించేందుకు అవసరమైన పరికరాల కొనుగోలుకు నేషనల్ సాయిల్ హెల్త్ మిషన్ అధికారులతో చర్చించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ -క్రాప్ బుకింగ్ ఇప్పటి వరకు 58 శాతం మాత్రమే పూర్తయిందని నూరు శాతం ఈక్రాప్ బుకింగ్ పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సంయుక్త కలెక్టర్ కు సూచించడం జరిగిందన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద జిల్లాలో పంటల సాగు చేస్తున్న వారిలో దాదాపు 10 శాతం మంది మాత్రమే నమోదు కావడం జరిగిందన్నారు. బీమా నమోదుకు సంబంధించి రైతులు,బ్యాంకర్ల వద్ద రుణాలు తీసుకునే సమయంలో, ఈ-క్రాప్ బుకింగ్ లో సాగుచేసిన పంట నమోదులో వివరాలు సరిపోకపోవడం తదితర సమస్యల వలన ఎక్కువమంది ప్రధానమంత్రి ఫసల్ బీమా లో నమోదు కావడం లేదన్నారు. ప్రకృతి విపత్తుల సంభవించినప్పుడు బీమా లో నమోదైతే నష్టపరిహారం పొందవచ్చని రైతులందరికీ అవగాహన కల్పించి ప్రధానమంత్రి ఫసల్ బీమా లో నమోదయ్యేలా వ్యవసాయ అధికారులు జిల్లాలో వ్యవసాయ శాఖ కు సంబంధించి సమీక్షించిన అంశాలపై ఉన్న సమస్యల పరిష్కారం కోసం కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి తో పాటు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ యూరియా సమస్యలు ఉన్నాయన్న వార్త కథనాలపై స్పందిస్తూ వ్యవసాయ అధికారులతో కేంద్రమంత్రి సమీక్ష నిర్వహించారన్నారు. అయితే యూరియా కొరత అనేది కేవలం ఊహాజనితం మాత్రమే అని తెలిపారు. లక్ష్యానికి మించి 2000 మెట్రిక్ టన్నులు అధికంగా గుంటూరు జిల్లాలో యూరియా సప్లై జరిగిందని, యూరియా కొరత లేదన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి అయితా నాగేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు, మార్కెఫెడ్ డీఎం నరిసింహా రెడ్డి, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజరు హరిగోపాలం, జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీంద్రబాబు, ఏపీఎంఐపీ పీడీ వజ్రశ్రీ, పశుసంవర్ధకశాఖ డీడీ సత్యన్నారాయణ, లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్ రెడ్డి, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆగ్రహం



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. చిన్న వర్షానికే రోడ్లు మునిగిపోవడం, డ్రెయిన్లలో నీరు పారకపోవటం వంటి సమస్యలపై డివిజన్ వారీగా సమగ్రంగా రివ్యూ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... "నేను ఎన్నిసార్లు డీసిల్టేషన్ పనులు చేయాలని హెచ్చరించినా అధికారులు నిర్లక్ష్యం వహించడం వలన ఒక గంట వర్షానికే నగరం మునిగిపోయింది. అర్హత లేని కాంట్రాక్టర్లకు పనులు అప్పగించి, పనులు ప్రారంభించకపోవడం అభివృద్ధికి అడ్డంకిగా మారింది. నేను శంకుస్థాపన చేసిన తర్వాత కూడా పనులు మొదలు కాకపోవడం ప్రజాప్రతినిధుల అవమానించటమేనని" ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధికారుల నిర్లక్ష్యం వలన వర్షం పడిన ప్రతి సారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీని వలన ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుంది. ప్రజల కోసం పనిచేయడమే మన ప్రధాన ధ్యేయం. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యల పరిష్కారానికి జవాబుదారులుగా ఉండాలి" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హితవు పలికారు.

అదే విధంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఎక్కడా మంచినీటి సరఫరా సమస్యలు లేకుండా చూడాలని, శివారు ప్రాంతాల్లో వీధి దీపాలు తప్పనిసరిగా వెలిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదేశించారు. ఎక్కడికక్కడ సమస్యలు పరిష్కరించుకుంటూ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సూచించారు.

## 20న బీసీ సంక్షేమ హాస్టల్ ప్రారంభం



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) గత ప్రభుత్వంలో గ్రహణం పట్టిన బీసీ సంక్షేమ హాస్టల్ ను ఏడాదిలోనే పూర్తి చేసి ఈ నెల 20వ తేదీన ప్రారంభించనున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. బుధవారం స్థానిక కోడిగుడ్డు సత్రంలోని బీసీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ను ఎమ్మెల్యే పరిశీలించారు. నూతనంగా నిర్మించిన గదులు, మరుగుదొడ్లు, లైబ్రరీ పరిసరాలను పరిశీలించి అధికారులను తగిన సూచనలిచ్చారు. ఈ నెల 20న హాస్టల్ ప్రారంభానికి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయులు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారని వెల్లడించారు. గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో నిర్మాణం చేపట్టిన బీసీ సంక్షేమ హాస్టల్ ను గత ప్రభుత్వం గాలికి వదిలేసిందని తెలిపారు. తాను అధికారం చేపట్టిన వెంటనే బీసీ హాస్టల్ నిర్మాణం ఫైలును సీఎం చంద్రబాబు నాయుడు వద్దకు తీసుకెళ్లానని చెప్పారు. సమారు రూ. 3 కోట్ల నిధులతో భవన నిర్మాణాన్ని పూర్తి చేశామని, ఆధునిక వసతులు కల్పించామని వెల్లడించారు. 450 మంది విద్యార్థులకు వసతి సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమంతోపాటు విద్యాభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు.

## గుంటూరులో విద్యుత్ శాఖ విజిలెన్స్ విస్తృత తనిఖీలు



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు జిల్లా డి3 సెక్షన్‌లో విద్యుత్ శాఖ విజిలెన్స్ మరియు ఆపరేషన్ విభాగాలు విస్తృత తనిఖీలు నిర్వహించాయి. పర్యవేక్షక ఇంజనీర్ రమేష్ ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు వెంకటేశ్వరరావు, శ్రీనివాస బాబు, వెంకన్న చౌదరి (విజిలెన్స్) సంయుక్తంగా ఈ తనిఖీలను చేపట్టారు. 58 బృందాలుగా 4228 విద్యుత్ సర్వీసులను పరిశీలించగా, అనుమతించని కేటగిరిలో విద్యుత్ వాడిన 2 మంది నుంచి 0.30 లక్షల రూపాయల, అనుమతించిన లోడుకు మించిన విద్యుత్ వాడిన 113 మంది నుంచి 3.15 లక్షల రూపాయల మొత్తం 3.45 లక్షల రూపాయల అపరాధ రుసుము విధించబడింది. అధికారుల వివరాల ప్రకారం, విద్యుత్ సర్వీసుల తనిఖీలు భారత విద్యుత్ చట్టం ప్రకారం జరుగుతాయి. వినియోగదారులు తమ మీటర్ల సీల్స్ సరైన స్థితిలో ఉంచుకోవాలి. సీల్స్ గాయపడ్డా లేదా ఊడిపోయినా వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి రాత పూర్వకంగా తెలియ జేయాల్సిందిగా సూచించారు. సాగర తీర ప్రాంతాల్లో సీల్స్ త్వరగా పాడవ్వడం సాధారణం కావున తరచుగా తనిఖీలు అవసరం అవుతాయి.

ఏ ప్రాంతంలోనైనా సీల్స్ లేకపోవటం, ఉద్దేశపూర్వకంగా తొలగించడం, గాట్లు పెట్టడం వంటి ఉల్లంఘనలు గమనించిన విద్యుత్ అధికారులు వాటిని విద్యుత్ చౌర్యంగా గుర్తించి కేసులు నమోదు చేస్తారు. మొదటి సారి తప్పిదానికి కాంపౌండింగ్ ద్వారా రుసుము చెల్లిస్తే కేసు మాఫీ చేయబడుతుంది, రెండవ సారి అరెస్ట్ చేసి కఠినంగా వ్యవహరిస్తారు. విద్యుత్ చౌర్యపై ఫిర్యాదులను పూర్తి వివరాలతో 9440812263, 9440812361 నంబర్లకు నేరుగా లేదా వాట్సాప్ ద్వారా చేయవచ్చని అధికారులు పేర్కొన్నారు.

## అసెంబ్లీ సమావేశాల బందోబస్తులో మర్యాదపూర్వకంగా వ్యవహరించండి



○ పోలీస్ సిబ్బందికి గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): వెలగపూడి సచివాలయంలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల కోసం చేపట్టిన భద్రతా సన్నాహకాలను గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పర్యవేక్షించారు. తుళ్లూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో గురువారం జరిగిన సమావేశంలో అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అసెంబ్లీ సమావేశాలు అత్యంత ప్రాధాన్యమున్నవని పేర్కొంటూ, పోలీసు సిబ్బంది బందోబస్తు విధుల్లో మర్యాదపూర్వకంగా మెలుగుతూ, దృఢంగా వ్యవహరించాలన్నారు. వీవీఐపీ, వీఐపీల రాకపోకల సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాహనాల పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతి సెక్టార్‌లో అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఆకస్మిక ఘటనలు చోటు చేసుకున్నప్పుడు పక్క సెక్టార్ల పోలీసులు వెంటనే స్పందించాలని సూచించారు. సున్నితమైన ప్రాంతాల్లో భద్రతా బృందాలతో ముందస్తు తనిఖీలు నిర్వహించి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. సమావేశ మందిర గేట్ల వద్ద డిఎస్పీలను ఇన్‌ఛార్జీలుగా నియమించామని, వారు అప్రమత్తంగా వ్యవహరించి సంబంధిత వారినే అనుమతించాలని తెలిపారు. పోలీసు సిబ్బంది తప్పనిసరిగా యూనిఫాం ధరించి, ఐడీ కార్డులు, లాఠీలు, విజిల్స్, రెయిన్‌కోట్లు వెంట తెచ్చుకోవాలని, బాడీ వేర్ కెమెరాలు ధరించాలని ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రమణమూర్తి, ఎటి.వి. రవికుమార్, ఎ. హనుమంతు, డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

## స్త్రీశక్తి పథకం సక్సెస్ : ఆర్టీసి జోనల్ ఎగ్జిక్యూటివ్ మేనేజర్ నాగేంద్రప్రసాద్



తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకం సక్రమంగా అమలయ్యే విషయంలో సిబ్బంది సహకారం బాగుందని, మరింత మెరుగైన సేవలను స్త్రీ శక్తి పథకానికి అందించే విధంగా సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఏపీఎస్ఆర్టీసీ జోనల్ ఎగ్జిక్యూటివ్ మేనేజర్ నాగేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ఏపీఎస్ఆర్టీసీ జోనల్ విభాగం అధికారులు, తెనాలి ఆర్టీసి డిపోను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు ఈ సందర్భంగా డిపో మేనేజర్ రాజశేఖర్, వివిధ సెక్షన్ల అధికారులఅధికారకు సాదర స్వాగతంపలికారు. ఈ క్రమంలో ఏపీఎస్ఆర్టీసీ జోనల్ ఎగ్జిక్యూటివ్ మేనేజర్ నాగేంద్ర ప్రసాద్ జోనల్ ఆపరేషన్ అధికారి ఎ. అప్పలరాజు, ఇంజనీరింగ్ విభాగం జోనల్ అధికారి చంగల్ రెడ్డి డిపో సిబ్బందితో సమావేశమై సిబ్బందికి పలు, సూచనలు చేశారు. ప్రధానంగా గ్యారేజ్ నుండి బయటకు వచ్చే బస్సులు బ్రేక్ కండిషన్ విషయంలో పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు, ప్రయాణికుల సేవకు గ్యారేజ్ నుండి బయటకు వచ్చే బస్సులకు, టెక్నికల్ గా,ఎటువంటి సమస్యలు లేకుండా ఉండాలన్నారు. ఇందుకు అవసరమైన, స్పేర్ పార్టు గ్యారేజీకి అందుబాటులో ఉంటాయన్నారు. ఏప్రిల్ నుండి ఆగస్టు వరకు ఈ పీకే, కెఎమ్ పిఎల్ సాధించిన సిబ్బందిని, ఉన్నతాధికారులు బొకేలతో సత్కరించి, అభినందనలు తెలిపారు. స్త్రీ శక్తి పథకం ప్రారంభమైనప్పటి నుండి రాష్ట్రంలోని పలు డిపోలను విజిట్ చేస్తు, పథకం ఆవశ్యకతను సిబ్బందికి వివరిస్తూ తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు చేయడం జరుగుతుందని ఉన్నతాధికారులు మీడియాకు వివరించారు. 65శాతం మహిళలు స్త్రీ శక్తి పథకం బస్సులను వినియోగించుకుంటున్నారనిఅన్నారు. ఎపికి 1050 ఎలక్ట్రికల్ బస్సులు రానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ రాజశేఖర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా విశ్వకర్మ, పెరియార్ జయంతి



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): చేతివృత్తుల వారు- హస్త కళాకారులైన వెనుకబడిన తరగతులకు చెందిన వారు విశ్వకర్మ జయంతిని ఘనంగా జరుపుకుంటారని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. మంగళగిరిలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో బీసీ నాయకులు సకల హస్తకళల అధిపతి శ్రీ విశ్వకర్మ జయంతిని, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పెరియార్ రామస్వామి జయంతి లను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, త్రిమూర్తులలో ఒకరైన బ్రహ్మ దేవుని కుమారుడే విశ్వకర్మ అని, వారు దేవతల రాజభవనాలు,

వాహనాలు,ఆయుధాల సృష్టికర్తగా హిందువులు భావిస్తారన్నారు. ఈరోజు ముఖ్యంగా వాస్తు- యాంత్రిక శాస్త్రాల రంగంలోను-వివిధ వృత్తిదారులుగా పనిచేసే వారికి శుభదిన మన్నారు. ఈరోజు విశ్వకర్మను పూజిస్తే,తాము చేసే వృత్తులు విజయవంతం అవుతాయని, తమ కుటుంబాలు ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉంటాయని వృత్తిదారులైన బీసీ ప్రజలందరూ భావిస్తారన్నారు.

రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్ మాట్లాడుతూ,ఇదే రోజు హైదరాబాదు సంస్థాన నిజాం క్రూరపాలనకు-రజాకార్ల అరాచకాల నుండి ప్రజలు విముక్తి పొందిన రోజన్నారు. అలాగే తన జీవితాన్ని దేశ సేవకు- ప్రజాసేవకు అంకితం చేసి,భారత్ ను విశ్వ గురువుగా తీర్చిదిద్దుతున్న గొప్ప దార్శనిక ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం కూడా నేడేనన్నారు. అలాగే అణగారిన వర్గాల ఆశాజ్యోతి, స్వాతంత్ర సమరయోధులు, పేదలు- బడుగుల ఆత్మబంధువు, ద్రావిడ ఉద్యమ నేత, బడుగుల ఆత్మగౌరవ పితామహుడైన పెరియార్ ఈ.వి.రామస్వామి నాయకర్ జయంతి కూడా ఈ రోజేనన్నారు. రాష్ట్ర యువజన అధ్యక్షులు పారేపల్లి మహేష్, నియోజకవర్గ అధ్యక్షులు ఉడతా శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు జయలక్ష్మి, సైదేశ్వర రావు, దుర్గా భవాని, సిరాజ్, శివ, రామారావు, పావని, శ్రీనివాసరావు, పవన్, దానా గౌడ్ పలువురు బీసీ నేతలు పూలమాలలు వేసి,ఘనంగా వేడుకలు నిర్వహించారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# మీరు ఫుల్లు... నాలెడ్జ్ ఉన్నోళ్లు కదా.. అసెంబ్లీకి రండి..

- ఏ అంశపైనైనా చర్చిద్దాం
- జగన్ కు, వైసీపీ నాయకులకు మంత్రి సవిత సవాల్
- అబద్ధపు ప్రచారాలు మానుకోండి
- మెడికల్ కాలేజీలపై నిజం చెబితే భయమెందుకు..?
- చెరువులను మాయం చేసి లే అవుట్లు వేసిందెవరో అందరికీ తెలుసు...
- రోజా, రజిని టీడీపీలోనే రాజకీయ ఏబీసీడీలు నేర్చుకున్నారు
- నా ఫొటో మార్ఫింగ్ పై సైబర్ క్రైమ్ కు ఫిర్యాదు
- సత్ఫలితాలిచ్చిన బీసీ స్టడీ సర్కిల్ ఉచిత కోచింగ్
- టీచర్లగా 246 మంది బీసీ బిడ్డల ఎంపిక : మంత్రి సవిత




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** 'మీరంతా ఫుల్లు నాలెడ్జ్ కలిగిన వాళ్లే కదా... సోషల్ మీడియాలో మార్ఫింగ్ ఫొటోలు పోస్టు చేయడం, అబద్ధపు ప్రచారాలు చేయడమెందుకు...? అసెంబ్లీకి రండి... యూరియా, ఉల్లి, మెడికల్ కాలేజీలు ఏ అంశంపైనైనా చర్చిద్దాం' అని జగన్ సహా వైసీపీ నాయకులకు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ఎద్దేవా చేస్తూ సవాల్ విసిరారు. తన ఫొటోను మార్ఫింగ్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీలో బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా శిక్షణ పొందిన 246 మంది బీసీ అభ్యర్థులు టీచర్ పోస్టులకు ఎంపిక కావడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తంచేశారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం పబ్లిసిటీ సెల్ లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, సంక్షేమాన్ని చూసి జగన్ ఓర్వలేక విషం కక్కుతున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ అబద్ధాలంటూ ఫేక్ ప్రచారాలు చేస్తున్నాడన్నారు. తల్లికి వందనం, స్త్రీ శక్తి %-% ఉచిత ఆర్టీసీ ప్రయాణం, మహిళలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్న క్యాంటీన్లు, అన్నదాత సుఖీభవ, మెగా డీఎస్సీ నిర్వహణ... ఇలా ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చుతున్నారన్నారు. యూరియా, ఉల్లి, మెడికల్ కాలేజీలు, తిరుమలపై తప్పుడు ప్రచారాలు చేస్తూ జగన్ వికృతానందం పొందుతున్నాడన్నారు. 'మీరంతా ఫుల్ నాలెడ్జ్ కలిగిన వాళ్లు కదా... సోషల్ మీడియాలో మార్ఫింగ్ ఫొటోలు పోస్టు చేయడం, అబద్ధపు ప్రచారాలు చేయడం ఎందుకు..? అసెంబ్లీకి రండి... యూరియా, ఉల్లి, మెడికల్ కాలేజీలు సహా ఏ అంశంపైనైనా చర్చిద్దాం' అని జగన్ సహా వైసీపీ నాయకులకు మంత్రి సవిత సవాల్ విసిరారు. కావాల్సినంత సమయం ఇస్తామని స్పష్టంచేశారు.

**చెరువులు మాయం లే అవుట్లు వేశారు...**

తనపై వైసీపీ నాయకులు రోజా, ఉషశ్రీ చరణ్ చేసిన విమర్శలపై మంత్రి తీవ్రంగా స్పందించారు. రోజా, విడదల రజనీ సహా ఎందరో వైసీపీ వలస నాయకులు టీడీపీలోనే రాజకీయ ఏబీసీడీ నేర్చుకున్నవాళ్లేనన్నారు. టీటీడీ లెటర్లు అమ్ముకున్నదెవరో నగిరి, కల్యాణదుర్గంలో ఎవరినడిగినా చెబుతారన్నారు. చెరువులను మాయం చేసి లే అవుట్లు వేసుకున్నదెవరో అందరికీ తెలుసన్నారు. మెడికల్ కాలేజీలపై నిజం చెబితే భయమెందుకు అని ప్రశ్నించారు. తోటి మహిళనని చూడకుండా నోటికొచ్చినట్లు మాట్లాడడం సరికాదన్నారు. 'అయిదేళ్లలో మీ నియోజక వర్గాల్లో చేసిన అభివృద్ధిపైనా, 15 నెలల కాలంలో పెనుకొండలో తాను చేసిన అభివృద్ధిపైనా చర్చకు సిద్ధం' అని రోజాకు, ఉషశ్రీ చరణ్ కు మంత్రి సవాల్ చేశారు.

**ఫొటో మార్ఫింగ్ పై ఫిర్యాదు**

తన ఫొటోను మార్ఫింగ్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన వారిపై సైబర్ క్రైమ్ కు ఫిర్యాదు చేసినట్లు మంత్రి సవిత తెలిపారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నట్లు వెల్లడించారు. మహిళలను కించపరచడం మానుకోవాలని వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు హితవు పలికారు. సీఎం చంద్రబాబు నిర్మించిన సచివాలయంలోనే జగన్ పాలించిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు.

**246 మంది టీచర్లగా బీసీ బిడ్డలు**

ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీలో బీసీ అభ్యర్థులు సత్తా చాటినట్లు మంత్రి సవిత వెల్లడించారు. 246 మంది గురువులగా ఎంపికైనట్లు తెలిపారు. బీసీ స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యంలో మెగా డీఎస్సీకి ఆన్ లైన్, ఆఫ్ లైన్ ద్వారా బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందజేశామన్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లోనూ బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా నిర్వహించిన శిక్షణా కేంద్రాల్లో 1,674 మంది, ఆన్ లైన్ ద్వారా మరో 4,774 మందికి ఇలా మొత్తం 6,470 మందికి ఉచిత శిక్షణ అందజేశామన్నారు. శిక్షణ పొందిన వారిలో 241 మంది బీసీ అభ్యర్థులు టీచర్లగా ఎంపికయ్యారన్నారు. టీచర్లగా నియమితులైనవారితో పాటు బీసీ సంక్షేమ శాఖాధికారులను మంత్రి అభినందించారు. విజయవాడలోని బీసీ స్టడీ సర్కిల్ ద్వారా 83 మందికి సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్ అందజేయగా, వారిలో గ్రూప్ 2 మెయిన్స్ కు 12 మంది, ఆర్.ఆర్.బి లెవల్ – 1కు పది మంది ఎంపికయ్యారన్నారు. ఎఫ్.ఆర్.వో ప్రిలిమ్స్ కు ఇద్దరు, మెయిన్ కు ఒకరు అర్హత సాధించారన్నారు.

పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు మరో మరో ఆరుగురు, ఆర్.ఆర్.బి లోకో పైలట్ గా మరో అభ్యర్థి ఎంపికయ్యారన్నారు. మరికొన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు మరికొందరు అర్హత సాధించారన్నారు. అత్యధిక మంది బీసీ యువత ప్రభుత్వ ఉద్యోగులుగా స్థిరపడడమే సీఎం చంద్రబాబు ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. ఇదే స్ఫూర్తితో బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని పోటీ పరీక్షలకు శిక్షణివ్వనున్నట్లు తెలిపారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేలా బీసీ యువతకు ఉచిత శిక్షణ అందజేసినందుకు బీసీ సంక్షేమ శాఖకు ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు లభించిందన్నారు. ఈ నెల 20న దేశ రాజధాని న్యూఢిల్లీలో ఈ అవార్డు అందుకోనున్నట్లు మంత్రి సవిత తెలిపారు.

## సాలకట్ల బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆహ్వానం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఈ నెల 24వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు 9 రోజుల పాటు తిరుమల శ్రీవారి ఆలయంలో జరిగే సాలకట్ల బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారిని ఆహ్వానించారు. బుధవారం ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో సీఎం చంద్రబాబును టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని పండితులు ఆశీం-ర్వదించి తీర్థ ప్రసాదాలను అందించారు.

## తెనాలిలో స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ ప్రారంభం




- దివ్యాంగులకు అవసరమైన వీల్ చైర్లు అందిస్తాం
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో, (జర్నలిస్ట్ ఫైల్)** జిల్లాలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంను మంత్రి నాదెండ్ల మనోహర్ తెనాలి ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూదేశ ప్రధాని నరేంద్ర మోడీ జన్మ దినోత్సవం సందర్భంగా కార్యక్రమం ప్రారంబించడం సంతోషదాయకం అన్నారు. దేశ స్థితిగతులు మార్చిన వ్యక్తి ప్రధాన మంత్రి అన్నారు. "మహిళ ఆరోగ్యం – జాతీయ ఆరోగ్యం" అని ఆలోచించి స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్" ప్రారంభించారన్నారు. ఆరోగ్యవంతమైన మహిళ శక్తి వంతమైన, ఆరోగ్యవంతమైన కుటుంబానికి నిలయంగా ఉంటుందన్నారు.

కార్యక్రమంలో 40 మంది వృద్ధులు దివ్యాంగులకు వీల్ చైర్లు, వాకింగ్ స్టిక్స్, హియరింగ్ బర్డ్స్ అందజేశారు. అదేవిధంగా తెనాలి రూరల్, కొల్లిపరలో దివ్యాంగులకు త్వరలో మరిన్ని వీల్ చైర్లను అందజేస్తామని తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ వైద్యులు , అధికారులతో కలిసి స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ పోస్టర్ ను విడుదల చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని, ప్రదర్శన శాలలను మంత్రి సందర్శించారు.

## యూరియా కొరత లేదు... ప్రతి రైతుకు యూరియా అందాలి



- బాపట్ల జిల్లా ఇంచార్జి మంత్రి కొలుసు పార్థసారధి

**బాపట్ల (జర్నలిస్ట్ ఫైల్) :** బాపట్ల జిల్లాలో పంటలు పెట్టిన రైతుల అందరికి యూరియా కొరత లేకుండా పంపిణీ చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి సచివాలయంలో లోని రెండోవ బ్లాక్ కాన్ఫరెన్స్ హాల్ నందు బాపట్ల జిల్లా లో రైతులకు యూరియా పంపిణీ కి సంబంధించి బాపట్ల జిల్లా ఇంచార్జి మంత్రి, గృహ నిర్మాణం మరియు సమాచార శాఖ మంత్రి,కొలుసు పార్థసారధి, రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్,విద్యుత్ శాఖ మంత్రి గొట్టి పాటి రవికుమార్, లతో కలసి జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2025 ఏప్రిల్ నుండి ఇప్పటి వరకు జిల్లా మండలాల వారిగా యూరియా పంపిణీ కి సంబంధించి మంత్రులకు వివరించారు.వార వారమున కు ఎంత అవసరం అవుతుందో దాని ప్రకారంగా మండల వారిగా రైతుల ఆధార్ అను సంధానంతో జిల్లాలో రైతులకు అవసరమైన యూరియా పంపిణీకి చేస్తున్నామని మంత్రులకు వివరించారు.మంత్రులు మాట్లాడుతూ జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో సమానంగా యూరియా ను పంపిణీ చేయాలని, పంట పెట్టి ప్రతి రైతు కు యూరియా పంపిణీ చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గం యం పి.తెన్నేటి కృష్ణ ప్రసాద్ బాపట్ల,చీరాల, పచ్చురు ఎమ్మెల్యేలు నరేంద్ర వర్మ రాజు,కొండయ్య,సాంబశివరావు, బాపట్ల జిల్లా వ్యవసాయ శాఖ ఏ ఏ డి అన్నపూర్ణ, మార్కెట్ పేడ్ డి యం.కారుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తు చేసిన స్పౌజ్ టీచర్లందరికీ అంతర్ జిల్లా బదిలీలు చేపట్టాలి : ఏపీటీఎఫ్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** అంతర్ జిల్లాల బదిలీల కోసం ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం బదిలీకి దరఖాస్తు చేసుకున్న ప్రతి స్పౌజ్ కేటగిరికి చెందిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు బదిలీ అవకాశం కల్పించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి. హృదయ రాజు , యస్.చిరంజీవి ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయుల అంతర్ జిల్లాల బదిలీల కోసం ఆగస్టు 20వ తేదీన సెక్రెటరీ ఉత్తర్వులు జారీ చేస్తూ ఆయా జిల్లాల్లోని వారు ఇతర జిల్లాలకు వెళ్ళుటకు స్పౌజ్ కేటగిరి లో మరియు మ్యూచువల్ విధానంలో బదిలీ ల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరడం జరిగింది. ఆ మేరకు స్పౌజ్ కేటగిరీలో దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల జాబితాలను జిల్లాల నుండి పాఠశాల విద్య డైరెక్టరేట్ కు పంపడం జరిగింది. అయితే స్పౌజ్ క్యాటగిరి ఉపాధ్యాయులకు ఆయా జిల్లాల్లో ఉండే ఖాళీలు, అవసరత, సర్ప్లస్ లను పరిగణలోకి తీసుకొని చాలామంది కేటగిరి ఉపాధ్యాయుల పేర్లను ప్రభుత్వ అనుమతి కోసం పంపలేదని అభ్యర్థులు వాపోతున్నారని తెలిపారు. ఎటువంటి అనుమానాలు లేకుండా అంతర్ జిల్లా బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి స్పౌజ్ క్యాటగిరి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు అందరికీ ఇతర జిల్లాలకు వెళ్ళుటకు అవకాశం కల్పిస్తూ, డీఎస్సీ నియామకాలకు ముందే వారికి పోస్టింగ్స్ కేటాయించాలని ఏపిటీఎఫ్ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఘనంగా మంత్రి కందుల దుర్గేష్ జన్మదిన వేడుకలు

- నిడదవోలు లయన్స్ క్లబ్ లో అట్టహాసంగా పుట్టిన రోజు వేడుకల నిర్వహణ
- వేలాదిగా తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపిన కూటమి శ్రేణులు జనసైనికులు, అభిమానులు
- కార్యక్రమానికి హాజరైన తాడేపల్లి గూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు



**నిడదవోలు (జర్నలిస్ట్ ఫైల్) :** నిడదవోలు పట్టణంలోని లయన్స్ క్లబ్ లో మంత్రి కందుల దుర్గేష్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. వేలాదిగా తరలివచ్చిన కూటమి శ్రేణులు, జనసైనికులు, అభిమానులు మంత్రి దుర్గేష్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి తాడేపల్లి గూడేం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు లు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు విజ్జేశ్వరం నుండి నిడదవోలు వరకు ర్యాలీగా వచ్చిన మంత్రి కందుల దుర్గేష్ లయన్స్ క్లబ్ కు చేరుకోగానే సర్వమత ప్రార్థనలతో జన్మదిన వేడుకల కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఆ తర్వాత వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం అభిమానులు జనసేన పార్టీ గుర్తుతో ఏర్పాటు చేసిన భారీ కేక్ ను కట్ చేసిన మంత్రి దుర్గేష్ వేడుకలపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పుట్టినరోజు వేడుకలకు వచ్చిన వారికి అన్నదానం ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వంలో పర్యాటక మంత్రి అంటే ఎప్పుడూ బూతులే మాట్లాడేవారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో పర్యాటక శాఖను ఆంధ్ర రాష్ట్రంలో అభివృద్ధి పథంలో నడిపిస్తున్న మంత్రి కందుల దుర్గేష్ కృషిని పలువురు కొనియాడారు. వేడుకలకు వచ్చిన ప్రతి ఒక్కరికీ మంత్రి దుర్గేష్ ఆప్యాయంగా పలకరించడం ఆకట్టుకొన్నది. కూటమి ప్రభుత్వ పాలన,15 నెలల కాలంలో మంత్రి కందుల దుర్గేష్ నిడదవోలులో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, జై కందుల పేరుతో మార్మోగిన పాటలు ప్రతి ఒక్కరినీ ఆకర్షించాయి. ఈ సందర్భంగా తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ మంత్రి దుర్గేష్ పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు.

## సిపిఎస్ ఉద్యోగులకు డి.ఏ. బకాయిలు చెల్లించాలి

- హైకోర్టు ఆదేశాలు రాష్ట్రవ్యాప్తంగా సీపీఎస్ ఉద్యోగులందరికీ అమలు చేయాలి
- నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల డి.ఏ. బకాయిల చెల్లింపుపై గౌరవ హైకోర్టు జూన్ 24, 2024న డబ్ల్యూ.పీ. నంబరు 12039/2024లో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే సిఎఫ్ఎంఎస్ బిల్లులు రూపొందించిన వాటిని నాలుగు వారాల్లోగా, మిగతా మొత్తాలను ఎనిమిది వారాల్లోగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయాలని ఆదేశించింది.

సచివాలయ ఉద్యోగులకు కొంతమేర బకాయిలు చెల్లించగా, రాష్ట్రంలోని మిగిలిన సిపిఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఇంకా ఎదురుచూస్తున్నారని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కరణం హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి మాగంటి శ్రీనివాసరావు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. 2018 జూలై, 2019 జనవరి డి.ఏ. బకాయిలను సచివాలయ సిపిఎస్ ఉద్యోగులకు చెల్లించినట్లే రాష్ట్రంలోని ఇతర సిపిఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కూడా తక్షణం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. 2018 జూలై నుండి 2021 జూన్ వరకు డి.ఏ. బకాయిల బిల్లులు సిఎఫ్ఎంఎస్ లో సిద్ధమైనప్పటికీ చెల్లింపులు జరగలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

మిగతా కాలానికి సంబంధించిన బిల్లులు ఇంకా రూపొందించబడకపోవడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆశతో ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలను సమగ్రంగా అమలు చేసి, అందరికీ సమాన న్యాయం జరగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఘోర రోడ్డు ప్రమాదం...ఏడుగురి మృతి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** నెల్లూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సంగం మండలం పెరమన దగ్గర ఈ ఘటన చోటుచేసుకుంది. బుధవారం ఉదయం జాతీయ రహదారిపై కారును టిప్పర్ ఢీ కొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందారు. రాంగ్ రూట్లో వెళ్లిన టిప్పర్ కారును ఢీకొన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో కారును టిప్పర్ కొంత దూరం లాక్కెళ్ళింది. కారులో ప్రయాణిస్తున్న మొత్తం స్పాట్లో చనిపోయినట్లు సమాచారం. మృతుల్లో చిన్నారి ఉన్నట్లు తెలుస్తోంది. కారు నుజ్జు నుజ్జవ్వగా.. మృతదేహాలు ఛిద్రమయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో మరణించిన వారిని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేశారు. కాగా.. ప్రమాదంలో మరణించిన వారి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాద ఘటనపై సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంత్రి ఆనం ప్రమాద ఘటనపై అధికారులను ఆరా తీశారు. నేషనల్ హైవే 4 లైన్ రోడ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు.

### మంత్రుల ఆవేదన

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** నెల్లూరు జిల్లా సంగం మండలం పెరమన వద్ద జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. టిప్పర్-లారీ ఢీకొన్న ఈ ఘటనలో పలువురు అక్కడికక్కడే మృతిచెందగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు.

ఈ దుర్ఘటనపై రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆరా తీశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసిన ఆయన, క్షతగాత్రులకు అత్యవసర వైద్యం అందించాలంటూ అధికారులను ఆదేశించారు. రహదారులపై భద్రతా చర్యలు తప్పనిసరి చేయాలని సూచించారు. నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారులను వదలబోమని హెచ్చరించారు. సహాయక చర్యలు వేగంగా చేపట్టాలని మంత్రి ఫోన్లోనే ఆదేశాలు ఇచ్చారు.

ఇక రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి కూడా ఈ ప్రమాదంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. టిప్పర్-కారు ఢీకొని ఆరుగురు అమూల్యమైన ప్రాణాలు కోల్పోవడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ప్రభుత్వం వారికి అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

## సహన, సంస్కార, సంస్కృతికి ఆనవాళ్లు మహిళలు

- కేంద్ర కమ్యూనికేషన్, గ్రామీణ అభివృద్ధి సహాయ మంత్రి పెమ్మసాని వెల్లడి
- గుంటూరు మెడికల్ కాలేజీలో స్వస్థ నారి ససక్త్ పరివార్ అభియాన్ ప్రారంభం



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)**

సహనానికి, సంస్కారానికి, సంస్కృతికి ఆనవాళ్ళు మహిళలని కేంద్ర కమ్యూనికేషన్, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. బుధవారం గుంటూరు మెడికల్ కాలేజీలో జరిగిన స్వస్థ నారి ససక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాజకీయాలకి అ-తీతంగా నేను అభిమానించే నాయకులు ప్రధాని మోదీ అన్నారు. నాయకులు ఎంతోమంది వస్తుంటారు కానీ, దేశం గతిని మార్చే నాయకులు కొంతమంది ఉంటారు.

అలాంటి వారిలో తన జీవితాన్ని దేశానికి పూర్తిగా త్యాగం చేసిన వ్యక్తి నరేంద్ర మోడీ అన్నారు. నేడు అమెరికాలో కూడా భారతీయులకు గౌరవం దక్కేలా చేస్తూ, దీపావళి వంటి ఎన్నో పండుగలకు ఆ దేశం సెలవులు ప్రకటిస్తూ, గౌరవించే విధంగా చేసిన నాయకులు మోదీ అని కొనియాడారు భారత్ నాల్గవ ఆర్థిక శక్తిగా ఎదిగింది అంటే దానికి కారణం మోదీ అన్నారు. ఎక్కడా లేనివిధంగా ప్రపంచంలో యూపీఐ ద్వారా డిజిటల్ పేమెంట్లను పరిచయం చేశారని పెమ్మసాని చెప్పారు. నేడు 30 కోట్ల సెల్ ఫోన్ లను ఇండియాలో తయారుచేసి ప్రపంచ దేశాలకు సరఫరా చేయగలుగుతున్నాం. అద్భుతంగా ఉంది. బెంగళూరులో ఉన్న విమానాశ్రయాలు మరో ప్రాంతంలో లేవని చెప్పాలి ఇవాళ ప్రతి గ్రామంలో ఎలక్ట్రిసిటీ, గ్యాస్ బండలు కూడా అందుబాటులోకి తీసుకు రాగలిగామన్నారు.. మన దేశంలో తయారవుతున్న డిఫెన్స్ సెక్యూరిమెంట్ తమకు కూడా కావాలని ఇతర దేశాలు అడుగుతున్నాయంటే దానికి కారణం ప్రధానమంత్రి మోడీ అని చెప్పారు.

**స్వస్థనారి - సశక్తి పరివార్**

మహిళల ఆరోగ్యం పరిరక్షించే కార్యక్రమం ఇప్పుడు మనం చేపడుతున్నామన్నారు. అందరికంటే ఆఖరికి ఆరోగ్యం కంటే ఆలస్యంగా ఆలోచించుకునేది మహిళలు మాత్రమే అన్నారు. స్త్రీలకు పౌష్టిక ఆహారం కోసం రూ. 5– 6 వేల రూపాయలు అందజేస్తున్నారు. ప్రభుత్వ పథకాలు ఉపయోగించుకోవాల్సిన అవసరం, హక్కు ప్రజలందరికీ ఉంది. ఆయుష్మాన్ భారత్ అవకాశాన్ని తాము వచ్చిన తర్వాత మరింత ఎక్కువ సంఖ్యలో పెంచామని మంత్రి చెప్పారు. త్వరలోనే తొమ్మిది లక్షలు వరకు చేరుకోగలుగుతున్నాము. పెండింగ్ ఇంకా ఎవరైనా ఆయుష్మాన్ భారత్ కార్డును తీసుకోకపోతే తీసుకోవాలని ఆయన సూచించారు. అంతకు ముందు ఇండియాలో ఎక్కడ మహిళలకు ఆస్తి లో సమాన హక్కులు కల్పించింది ఎన్టీఆర్ అన్నారు. మహిళల కోసం పద్మావతి యూనివర్సిటీ తీసుకొచ్చారు రాజకీయాల్లో 33 శాతం రిజర్వేషన్లు తీసుకొచ్చిన వ్యక్తి అన్న ఎన్టీఆర్ గారు అని ఆ రిజర్వేషన్లను ముందుకు తీసుకెళ్లే వ్యక్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని చెప్పారు. దేశంలో ఎక్కడాలనే విధంగా తొలిసారి డ్వాక్రా గ్రూపులతో మహిళలకు ఆర్థిక స్వాతంత్రాన్ని అందజేసిన నాయకులు చంద్రబాబు అన్నారు. కొన్ని కోట్ల మంది స్వయం ఉపాధికి అదే విధానాన్ని వాళ్ళ దేశం ద్వారా మహిళలకు అందుబాటులో ఉంది. ఇలా ప్రజలకు మహిళలకు అన్ని వర్గాలకు ఉపయోగపడే నాయకులు ఎవరెవరు ఉన్నారు .అనేది తెలుసుకొని ప్రజలు కొనుకోవాలని కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమాన్ని ఇక్కడి నుంచి ప్రతి గ్రామ గ్రామానికి, మహిళలకు చేరువ అయ్యేలా చూస్తారని వైద్య శాఖ అధికారులను. ఆయన కోరారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ స్వస్తినారి సశక్తి పరివార అభియాన్ కార్యక్రమాన్ని ప్రధాని మోదీ జన్మదినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఒక కొత్త వరవడిని తీసుకొస్తున్నాం. మహిళా పక్షపాతిగా గతంలోనూ ఎన్నో సంక్షేమ పథకాలను, ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలను ప్రధాని మోదీ గారు ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకొని మన గుంటూరు జిల్లా మహిళలందరూ తమ ఆరోగ్యాలను మెరుగుపలుచుకోవాలని ఆయన కోరారు.. కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల మహిళలకు అవగాహన కల్పిస్తు, సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వం-కు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గుంటూరు జిల్లాలోని పీహెచ్సీ, సిహెచ్సీ, ఏరియా హాస్పిటల్, జిజిహెచ్ అన్నిచోట్ల ఈ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు.

మహిళలు అందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలి. ప్రభుత్వానికి సహకరించాలి. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్.ఎస్.ఐ.డి.సి ఎండి గిరీషా , డీసీఎంఎస్ చైర్మన్ వడ్రానం హరిబాబు , జడ్పీ చైర్పర్సన్ క్రిస్టియానా డిప్యూటీ మేయర్ షేక్ సజీలా తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467